మార్చి
2022

191

సంపుటి : 16 సంచిక : 10 వెల రు. 15/-

## ఈ సంచికలో........

నిరిష్ట పరిస్థితుల నిర్దిష్ట విశ్లేషణే మార్క్సిజం సారాంశం
మార్క్సిజంపై మళ్లీ ఆసక్తి పెరుగుతున్నది
రెండు రోజుల కార్మిక సమ్మె రాజకీయ ప్రాధాన్యత
గ్రామీణ వ్యవసాయేతర కార్మికవర్గం నమూనా సర్వే
అలెగ్జాండర్ దండయాత్ర
విశ్వసనీయత కోల్పోతున్న మోడి ప్రభుత్వం
రాజ్యాంగ పునానాదులనకు ధ్వంసం చేస్తున్న సంఘ్ పరివారం
విఫలమైన భారత పాలక వర్గాలు
1962-63 కాలంలో పార్టీపై దాడులు

# 1962-63 కాలంలో పార్టీపై దాడులు

**1962**లో మూడో సాధారణ ఎన్నికలను ఎదుర్కోడానికి పార్టీలోని విభేధాలను పక్కకు పెట్టడం జరిగింది. ప్రజాస్వామ్య అభివృద్ధికి, 'ప్రజల పురోగతికి' కాంగ్రెస్ అడ్డంకిగా ఉన్నదని నష్టం కావడంతో ఎన్నికలలో కాంగ్రెస్‌ని ఓడించి, దాని గుత్తాధిపత్యానికి గండి కొట్టాలని నిర్ణయం చేశారు. పార్లమెంటులోనూ, వివిధ రాష్ట్రాల శాసనసభలలోనూ కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం పెంచమని పార్టీ పిలుపునిచ్చింది.

భారతదేశ ఆర్థికవ్యవస్థ అభివృద్ధిలో వైఫల్యం, నిరుద్యోగుల సంఖ్య కొండవీటి చాంతాడులా పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. భారతదేశానికి స్వతంత్రం వచ్చిన 15 సంవత్సరాలలో అప్పుడే ఎదుగుతున్న బడా పెట్టుబడిదారులు అత్యధికంగా స్వతంత్ర ఫలాలను పొందినట్లు నికరంగా పెరిగిన వారి సంపదలు తెలియచేశాయి. మరోవైపు కార్మికవర్గానికి సరిపడా వేతనాలు ఇవ్వటం లేదు. కనీసంగా నిరంతరంగా పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా కూడా వారి వేతనాలు పెరగలేదు. అన్నిటికీ మించి దేశంలో అనేక చోట్ల ఏర్పడ్డ ఆహారకొరత ప్రజలకు మరిన్ని కష్టాలు తెచ్చిపెట్టింది. ఫలితంగా దేశవ్యాప్తంగా ప్రజలలో అసంతృప్తి పెరగడం మొదలయింది. అనేక రాష్ట్రాలలో పెద్ద పెద్ద పోరాటాలు జరిగాయి. ప్రభుత్వం పాశవిక దాడులతో నిరసనలను అణచివేయడానికి పూనుకుంది. ప్రజాతంత్ర హక్కులు మరింతగా కాలరాయబడ్డాయి.

కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న విధానాలు దేశంలో వేర్పాటువాద ధోరణులకు దారితీస్తున్నాయని పార్టీ ఎన్నికల ప్రణాళికలో పేర్కొంది. హిందూ మహాసభ, జనసంఘ్, స్వతంత్ర పార్టీ వంటి మతతత్వ, అభివృద్ధి నిరోధక పార్టీలు ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని సొమ్ము చేసుకుంటున్నాయి. వైనారిటీల మీద దాడులు 'సర్వ సాధారణం'గా మారాయి. "కాంగ్రెస్ వైఫల్యాల కారణంగానే ఇటువంటి ధోరణులు, వాటిని ఉపయోగించుకొంటున్న పార్టీలు పెరుగుతూన్నాయని మేము నొక్కి చెప్పక తప్పడం లేదు. ఈ విధానాల వైఫల్యాలు అసంతృప్తికి, నిస్పృహకి దారితీశాయి. ఎలాగైనా అధికారం నిలుపుకోవాలనే తపనతో కాంగ్రెస్ నాయకులే మతతత్వాన్ని, కులతత్వాన్ని, ప్రాంతీయ తత్వాన్ని ఉపయోగించుకుంటున్నారు" అని ప్రణాళికలో పేర్కొంది.

అతి మితవాద, ప్రతిఘాతుక, అభివృద్ధి నిరోధక, ఛాందసవాద పార్టీల ఎదుగుదల, విజయాలు, దేశ స్వాతంత్ర్యానికి, జాతి అభివృద్ధికి, ప్రజాస్వామ్యానికి కూడా ముప్పు తెచ్చిపెడతాయని పార్టీ నిర్ద్వంద్వంగా ప్రకటించింది. దేశభక్తులు, ప్రజాతంత్రవాదులతో కూడిన విశాలమైన జాతీయ ప్రజాస్వామ్య వేదికను ఏర్పాటు చేయడానికి పిలుపునిచ్చింది. అందుకు ప్రజల మద్దతు కోరింది. కాంగ్రెస్, మితవాద పార్టీల రెండింటి పోషకులు ఒకరే. ప్రధాన ప్రతిపక్ష స్థానం నుండి కమ్యూనిస్టులను తప్పించాలని, ప్రభుత్వ విధానాలను మరింత మితవాదం వైపుకు మరల్చాలని వారు కోరుకుంటున్నారు.

అందువలన సాధారణ ఎన్నికలలో ఇచ్చిన మూడు ముఖ్యమైన నినాదాలు పార్టీ ఎత్తుగడలను ప్రతిబింబించాయి :1. కాంగ్రెస్ గుత్తాధికారాన్ని బలహీన పరచాలి 2. మితవాద పార్టీలను తుడిచి పెట్టాలి. 3. కమ్యూనిస్టు పార్టీ స్థానాన్ని, నిజమైన ప్రజాతంత్ర శక్తులను బలపరచాలి.

ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ 10 శాతం ఓట్లను, 29 పార్లమెంటు సీట్లను గెలుచుకుంది. దాని ఓటింగ్ ఒక శాతం పెరిగింది. కాంగ్రెస్ ఓట్లు మూడు శాతం తగ్గాయి. ఎన్నికల ఫలితాలను సమీక్షించిన పార్టీ కేంద్ర కార్యదర్శి వర్గం కాంగ్రెస్ బలహీనపడడం కొనసాగుతున్నదని భావించింది. అదే సమయంలో మతతత్వ, ప్రతిఘాతుక శక్తులు బలపడుతుండడాన్ని ఆందోళనకరమైన అంశంగా పేర్కొంది. పార్టీలో తీవ్రమైన విభేదాలను ప్రతిబింబిస్తూ నేషనల్ కౌన్సిల్‌కు రెండు ఎన్నికల ఫలితాల సమీక్షలు పంపబడ్డాయి. వారి వాదన ఓడిపోతున్నదని సంస్కరణవాదులు గుర్తించిన తరువాత, 'ఎన్నికల ఫలితాలను పోస్టుమార్టం చేయవలసిన అవసరం లేదని' ప్రకటించారు.

ఎన్నికలు ముగిసిన వెంటనే పార్టీ ప్రధాన కార్యదర్శి అజయ్ ఘోష్ మరణించారు. అయన జ్ఞాపకార్థం కేంద్ర కార్యాలయాన్ని నిర్మించడానికి నిధులు వసూలు చేయాలని పార్టీ పిలుపునిచ్చింది. పార్టీ కొత్త ప్రధాన కార్యదర్శిని ఎన్నుకోవాల్సి ఉంది. అదే విషయంపై నేషనల్ కౌన్సిల్‌లో చర్చ నడుస్తున్నది. సభ్యులలోని ఊగిసలాడే ధోరణిని అదనుగా తీసుకుని రివిజనిస్టులు పార్టీ నిబంధనావళిలో లేకపోయినా కొత్తగా ఛైర్మన్ పదవిని సృష్టించారు. రాజీ మార్గంగా ఎస్ ఏ డాంగేను ఛైర్మన్ గాను, ఇ ఎం ఎస్ నంబూద్రిపాద్‌ను ప్రధాన కార్యదర్శిగాను ఎన్నుకున్నారు. కేంద్ర ఎగ్జిక్యూటివ్ కమిటీకి మరో ఆరుగురిని ఎన్నుకోవాలని నిర్ణయించుకున్నారు. కొత్త సభ్యులు పి సుందరయ్య, జి అధికారి, జ్యోతిబసు, హరికిషన్ సింగ్ సూర్జిత్, ఎచ్ కె వ్యాస్, అవతార్ సింగ్ మల్హోత్రాలతో కార్యదర్శి వర్గం పునర్నిర్మించబడింది. డాంగే, నంబూద్రిపాద్ కాక, భూపేష్ గుప్త, జడ్ ఏ అహ్మద్, ఎం ఎన్ గోవిందన్ నాయర్, పి సుందరయ్య, జ్యోతిబసు, హరికిషన్ సింగ్ సూర్జిత్, యోగింద్ర శర్మ కార్యదర్శివర్గంలో ఉన్నారు.

నాలుగు పత్రాలు తయారుచేసే బాధ్యతను కేంద్ర కార్యదర్శివర్గానికి అప్పగించారు. 1. కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కుంటున్న సైద్ధాంతిక, నిర్మాణ సమస్యలు; 2 సి పి ఎస్ యు 22 వ మహాసభ నిర్ణయాల ప్రాముఖ్యత; 3. ఎన్నికల అనంతరం దేశంలోని రాజకీయ పరిస్థితి; 4. నిర్మాణ సమస్యలు. ఆ తరువాత జరిగిన నేషనల్ కౌన్సిల్ సమావేశంలో సి పి ఎస్ యు 22 వ మహాసభ ఆమోదించిన

## ఈ సంచికలో...

1. 1962-63 కాలంలో పార్టీపై దాడులు ..... 2

2. నిరిష్ట పరిస్థితుల నిర్దిష్ట విశ్లేషణే మార్క్సిజం సారాంశం
సీతారాం ఏచూరి ...... 4

3. మార్క్సిజంపై మళ్లీ ఆసక్తి పెరుగుతున్నది
బి.వి..రాఘవులు ..... 9

4. రెండు రోజుల కార్మిక సమ్మె రాజకీయ ప్రాధాన్యత
జె.ఎస్.మంజుదార్ ........ 14

5. గ్రామీణ వ్యవసాయేతర కార్మికవర్గం నమూనా సర్వే
ఎస్. వీరయ్య ........ 16

6. అలెగ్జాండర్ దండయాత్ర
ఎం.వి.ఎస్.శర్మ ..... 18

7. విశ్వసనీయత కోల్పోతున్న మోడి ప్రభుత్వం
ఎ.కొటిరెడ్డి .......... 21

8. రాజ్యాంగ పునాదులనకు ధ్వంసం చేస్తున్న సంఘ్ పరివారం
రాకేష్ బతబ్యల్........ 25

9. విఫలమైన భారత పాలక వర్గాలు
రాకేష్ బతబ్యల్........ 30

సంపాదకుడు:
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం:
**పాటూరు రామయ్య**
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 9490099333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 9490098977**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com

# సమ్మె

**ఈ** నెల 28, 29 తేదీల్లో దేశ వ్యాపితంగా జరుగుతున్న కార్మిక సమ్మె డిమాండ్ల రీత్యా చూసినప్పుడు గత మూడు సంవత్సరాలుగా జరుగుతు్న సార్వత్రిక సమ్మెలకు కొనసాగింపుగా కనపడుతున్నప్పటికీ దీనికి ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. నయా-ఉదారవాద విధానాల పేరుతో అంతర్జాతీయంగా ఫైనాన్స్ పెట్టుబడి తన గరిష్ట లాభాలను పెంచుకోడానికి కార్మికవర్గంపై దోపిడీ తీవ్రం చేసింది. పొదుపు చర్యల పేరుతో కార్మికుల వేతనాలు, సంక్షేమం, ఉద్యోగభద్రతకు కోతపెట్టి కార్పొరేట్ల లాభాలు పెంచే చర్యలు తీసుకుంటున్నది. చివరికి కరోనా సమయంలో కూడా కార్మికుల రక్తం పిండి బడా పెట్టుబడిదారుల లాభాలు పెంచడానికి పూనుకున్నది. మన దేశంలో మోడీ ప్రభుత్వం నయా-ఉదారవాదానికి మతతత్వాన్ని జోడించి కార్మికవర్గంపై అన్ని విధాలా దాడి చేస్తూ కార్పొరేట్లకు లాభాల పంటపండిస్తున్నది. కరోనా లాక్‌డౌన్‌లతో లక్షలాది మంది కార్మికులు ఉద్యోగాలు, ఆదాయాలు కోల్పోయారు, లాక్‌డౌన్ సమయంలో కోట్ల మంది వలస కార్మికులను ప్రభుత్వం కనికరం లేకుండా రోడ్లమీద విడిచిపెట్టింది. మరోవైపు కరోనా సమయంలోనే 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వారి హక్కులు హరించే లేబర్ కోడ్‌లు తెచ్చింది. తనపై జరుగుతున్న దాడికి భారతీయ కార్మికవర్గం చేస్తున్న ప్రతిఘటనలో మార్చి 28,29 సమ్మె ఒక గొప్ప ముందడుగు అవుతుంది.

నాలుగు లేబర్ కోడ్‌ల రూపంలో కార్మికుల హక్కులపై జరుగుతున్న దాడి, దేశంలో పెరుగుతున్న ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలు, భారత రాజ్యాంగంపైనా, ప్రజాస్వామ్య వ్యవస్థలపైనా చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈ సమ్మె జరుగుతోంది. ఇది కేవలం కార్మికుల సమస్యలమీద మాత్రమే జరుగుతున్నసమ్మె కాదు. సమ్మె డిమాండ్లలో భారత రైతాంగానికి సంబంధించిన కీలకమైన సమస్యలున్నాయి. రైతు పండించిన పంటకు కనీస మద్దతు ధరను చట్టబద్ధంగా కల్పించాలిని, విద్యుత్ సవరణ బిల్లు వెనక్కు తీసుకోవాలన్న డిమాండ్లు చేరాయి. వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా చారిత్రక రైతాంగ పోరాటం విజయం సాధించిన నేపథ్యంలో ఈ సమ్మె ప్రాధాన్యత సంతరించుకున్నది.
అందువల్ల 28,29 తేదీల్లో జరుగుతున్న సమ్మె కార్మిక సమ్మె మాత్రమే కాదు. అది కార్మిక-కర్షక సమ్మె, ఐక్య పోరాటం. ఇంకో మాటలో చెప్పాలంటే రెండు వర్గాల మధ్య ఇటీవలి కాలంలో బలపడుతున్న ఐక్య కార్యాచరణను మరో మెట్టు ముందుకు తీసుకుపోయే కార్యాచరణ. గత రెండు సంవత్సరాల కాలంలో దేశంలో మూడు సార్వత్రిక సమ్మెలు జరిగాయి. 2019 జనవరి 8,9 తేదీల్లో ఒకటి, 2020 జనవరి 8న ఒకటి, 2020 నవంబర్ 26 మరొకటి జరిగాయి. అలాగే కార్మిక-రైతాంగ ఐక్య కార్యాచరణలు కూడా ఇటీవలి కాలంలో మూడు జరిగాయి. 2018 ఆగస్టు 9న దేశవ్యాపితంగా జరిగిన జైల్ భరో కార్యక్రమంలో 10 లక్షల మంది కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గన్నారు. అదే ఏడాది సెప్టెంబర్ 5న ఢిల్లీలో జరిగిన భారీ కార్మిక-కర్షక ప్రదర్శనలో 2 లక్షల మంది వరకు కార్మికులు, వ్యవసాయ కార్మికులు పాల్గన్నారు. సంయుక్త ట్రేడ్ యూనియన్ వేదిక మీద నుండి రైతుల సమస్యల డిమాండ్ల పరిష్కారానికి గళమెత్తగా, ఢిల్లీలో రైతుల ఆందోళనకు నాయకత్వం వహించిన సంయుక్త కిసాన్ మోర్చా రైతాంగ సమస్యలతోపాటు కార్మికవర్గ సమస్యలను కూడా లేవనెత్తింది.

హిందూత్వాకార్పొరేట్ ఎజెండాతో మోడీ ప్రభుత్వం దాడి చేస్తుంటే దేశంలోని కష్టజీవులు లౌకికతత్వ స్ఫూర్తితో కుల, మత, ప్రాంతీయ బేధాలను అధిగమించి ఐక్యమై దేశ స్వావలంబనను, ఆహార భద్రతను, ప్రజా సంపదను పరిరక్షించుకునే ప్రత్యామ్నాయ విధానాల కోసం మోడీ ప్రభుత్వంపై ప్రతిఘలనకు దిగారు. అందుకే సమ్మెకు కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతాంగంతో పాటు అన్ని సెక్షన్ల ప్రజానీకాన్ని సమీకరించేందుకు వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలి.

**ఈ మాసం ముఖ్యాంశం**

# నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట విశ్లేషణే మార్క్సిజం సారాంశం



**సీతారం ఏచూరి**

*(గత ఫిబ్రవరి 21వ తేదీన రెడ్ బుక్స్ డే సందర్భంగా మార్క్సిజం దాని ప్రాసంగిత గురించి సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి చేసిన ప్రసంగ పాఠాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందజేస్తున్నాం... సంపాదకుడు)*

ఈరోజు ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ మార్క్సిజం గురించి చర్చలు సాగుతున్న సందర్భంలో అంతర్జాతీయంగా 'రెడ్‌బుక్స్ డే'ను పురస్కరించుకుని వారం రోజుల పాటు మార్క్సిస్టు మూల సూత్రాల అధ్యయనంపై రకరకాల కార్యక్రమాల్ని చేయాలని నిర్ణయించుకున్నాం. 2008లో ప్రపంచ వ్యాపితంగా ఏర్పాడిన తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఇప్పటికీ కొనసాగుతోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఆ సంక్షోభానికి పెట్టుబడిదారీ వ్యవస్థలో పరిష్కారం కనపడలేదు. అందువల్ల పరిష్కారాన్ని కనుగొనే కృషిలో భాగంగా మార్క్సిజాన్ని పునరధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్న భావన బలపడుతోంది. దానితోపాటే అమెరికాలో వాల్‌స్ట్రీట్‌కి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు ఇతర దేశాల్లో ఉద్యమాలు వీటి అన్నింటిలోనూ ఒక భావన ముందుకొచ్చింది. 'పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉన్న తప్పులు సంక్షోభానికి కారణం కాదు అసలు కారణం పెట్టుబడిదారీ వ్యవస్థే' అన్న వాదన బలం పుంజుకుంటున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థకి వ్యతిరేకంగా ఒక ప్రత్యామ్నాయ వ్యవస్థను –సోషలిజాన్ని తీసుకువస్తే తప్పిస్తే ఈ సంక్షోభం నుంచి బయటపడలేమన్న వాదనలు ఊపందుకుంటున్నాయి. ఈ పరిణామాలు మార్క్సిజం అధ్యయనాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఈ రెడ్‌బుక్స్ డే పిలుపునందుకుని ఆంధ్రా, తెలంగాణా కమ్యూనిస్టులు ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పూనుకోవడం పట్ల వాళ్ళకి విప్లవాభినందనలు తెలుపుతున్నాను.

కానీ ఈ కార్యక్రమం పూర్తయిన తర్వాత అధ్యయనాన్ని ఆపేయకూడదు. ఈరోజు మనం మార్క్సిజం అధ్యయనాన్ని శాశ్వతంగా కొనసాగించాల్సిన అవసరం ఉంది. నేటి పరిస్థితుల్లో అధ్యయనం అసలు ఎందువల్ల అవసరం?

మొదటిది, ప్రతి మనిషికి తన జ్ఞానాన్ని పెంచుకోవాలన్న తపన ఉంటుంది. ఆ జ్ఞానాన్ని ఉపయోగించుకుని తన జీవితాన్ని మెరుగు చేసుకోవాలనే ప్రయత్నం ఉంటుంది. కాని మార్క్సిజం మనుకు నేర్పేదేమంటే, ఆ జ్ఞానాన్ని అంటే మార్క్సిస్టు మూలసూత్రాలు నేర్పిన వైజ్ఞానిక విజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ మనం మన జీవితాలను మార్చుకోవాలన్నా, మెరుగు పరుచుకోవాలన్నా ఈ వ్యవస్థనే మార్చాల్సిన అవసరం ఉందని.

అందు వల్ల ఈ వ్యవస్థని ఎందుకు మార్చాలి, ఏ విధంగా మార్చగలం, దోపిడీ నుంచి దారిద్యం నుంచి మనుషులు విముక్తి పొందడం ఎలా అని తెలుసుకునే ముందు మనం అసలు ఈ రకమైన దోపిడీ ఎందుకు జరుగుతోంది? దీనికి మూల కారణం ఏమిటి? ఈరోజు పెరుగుతున్న దారిద్ర్యం, నిరుద్యోగం వంటి వాటన్నిటికీ మూల కారణం ఏమిటి అనే విషయాలను స్పష్టంగా అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. అలా అర్థం చేసుకోవాలంటే మనం మార్క్సిజం మూల సూత్రాలను అధ్యయనం చేసి, అర్థం చేసుకోవడం అవసరం. మార్క్స్ కూడా స్వయంగా తన జీవితంలోనే ఈ విషయంలో విశేషమైన కృషి చేశాడు. ఆ రోజుల్లో హెగెల్ జర్మన్ పెద్ద తత్వవేత్త. గతితార్కిక సూత్రాలు (డైలస్టిక్స్) ప్రతిపాదించింది హెగెన్. కారల్ మార్క్స్ తొలుత యంగ్ హెగేలియన్‌గా ఉండేవాడు. అయితే హెగెల్ గతితర్కాన్ని పరిశీలిస్తూ హెగెన్ వచ్చిన నిర్ణయానికి భిన్నమైన నిర్ణయానికి వచ్చాడు మార్క్స్. ఇది అర్థం చేసుకోవలసిన చాలా ముఖ్యమైన అంశం. హెగెల్ గతితార్కిక సూత్రాలను సరిగ్గానే చెప్పాడు కానీ మనిషి చైతన్యం ఏవిధంగా పెరుగుతూ వస్తుందో దాని ఆధారంగా సమాజం కూడా పెరుగుతూ వస్తుందని హెగెల్ ప్రతిపాదించాడు. సమాజంలో ఏర్పడిన రాజకీయ సంస్థలు, న్యాయపాలిత సంస్థలు ఇవన్నీ పెరుగుతూ ఇంకా మెరుగవుతూ ఒక పౌర సమాజాన్ని (సివిల్ సొసైటీని) ఏర్పాటు చేస్తాయని ఆయన చెప్పాడు. దీన్ని అధ్యయనం చేసి మార్క్స్, హెగెల్‌కు భిన్నమైన నిర్ణయానికి వచ్చాడు. హెగెన్ చెప్పే సివిల్‌సోసైటీని రాజకీయ అర్థశాస్త్రం తీర్చి దిద్దుతుందని మార్క్స్ చెప్పాడు. సమాజాభివృద్ధికి మూలాధారం రాజకీయ అర్థశాస్త్రం (పొలిటికల్ ఎకానీమి). ఆ పొలిటికల్ ఎకానమీ ఆధారంగా ఏర్పడే సామాజ నిర్మాణాన్ని పరిశీలించి వాటిని విశ్లేషించితే తప్పితే అసలు ఈ దోపిడీ ఎలా జరుగుతోందో, ప్రజలు ఈ దారిద్ర్యాన్ని ఎందుకు అనుభవిస్తున్నారో అర్థం కాదు. దానిని మనం గుర్తించి అర్థం చేసుకుంటే సరిపోదు. దానికి పరిష్కారం ఏమిటి అనేదాన్ని సరిగ్గా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఆ రోజుల్లో జర్మనీలో ఫ్యూయెర్ బా అనే తత్వ వేత్త ఉండేవాడు. మార్క్స్, ఏంగెల్స్, ఫ్యూయెర్ బా గురించి చాలా రాశారు కూడా. ఫ్యూయెర్ బాకు ఒక చిన్న స్టడీ సర్కిల్ గ్రూపు ఉండేది.

**❝ అంటే పెట్టుబడిదారీ వ్యవస్థలో జరుగుతున్న దోపిడీ ఆ పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క ఉత్పత్తి క్రమంలోనే ఉంది. ఆ ఉత్పత్తి క్రమాన్ని మనం రద్దు చేయడం ద్వారా మాత్రమే దోపిడీని అంతం చేయగలమన్న మాట. దాన్ని రద్దు చేయా లంటే ఒక రాజకీయ ప్రత్యామ్నాయాన్ని తీసుకురావలసిన అవసరం ఉంది. అదే సోషలిజం. అది మనల్ని చివరికి కమ్యూనిజం వైపు తీసుకువెళుతుంది. ❞**

ఈ రోజుల్లో ఏ విధంగా మనం స్టడీ క్లాసులు నడుపుతున్నామో అలాగా. ఆయన యంగ్ హెగేలియన్స్ అనే ఒక గ్రూపుని ఏర్పాటు చేశాడు. ఈ గ్రూపు స్టడీ క్లాసుల్లో మార్క్స్ కూడా పాల్గొన్నాడు.

యంగ్ హెగేలియన్స్ గ్రూపు మానవ విముక్తి గురించి చర్చలు జరిపేది. మతం ప్రభావాన్ని, మనుషుల చైతన్యాన్ని మనం మినహాయిస్తే తప్పితే మానవ విముక్తి సాధించలేం అనే నిర్ణయానికి గ్రూపు వచ్చింది. దీన్ని మార్క్స్ అంగీకరించలేదు. ఆయన ఈ చర్చల నుండి విభిన్నమైన అభిప్రాయానికి వచ్చాడు. అసలు మతం, చైతన్యం ఎలా పుట్టుకొని వచ్చింది. ఈ చైతన్యం పుట్టుకు రావాలంటే దానికి ఒక భౌతిక ఆధారం ఉండాలి. ఆ భౌతిక ఆధారాన్ని విశ్లేషిస్తే తప్పితే మనకు ఎందువల్ల ఈ రకమైన చైతన్యం పెరుగుతోందో అర్థం కాదు అని ఆయన తెలుసుకున్నాడు. ఆ భౌతిక ఆధారం ఏది? ఆ భౌతిక ఆధారమే రాజకీయ అర్థ శాస్త్రం. పెట్టుబడిదారీ వ్యవస్థలో దాని సూత్రాలేమిటి అనేదాన్ని విశ్లేషించి ఒక నిర్ణయానికి వస్తే తప్పితే మనం ఈ దోపిడీ ఎందువల్ల జరుగుతోందో, దాని నుండి ఏ విధంగా మనం విముక్తి సాధించగలమో అర్థం చేసుకోలేం. అది ఇవాళున్న పరిస్థితుల్లో చాలా ముఖ్యమైన అంశం. ఈ దోపిడీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా సోషలిజాన్ని తీసుకురావాలనుకుంటున్న మనం ఈ సూత్రాలను అర్థం చేసుకుని సరైన విశ్లేషణ చేసి దాని ఆధారంగా ఉద్యమాలనూ, పోరాటాలనూ నిర్మించాల్సి ఉంది.

అందువల్లనే మార్క్సిజం ప్రాసంగికత (రిలవెన్స్) ఈ రోజు ఇంకా చాలా పెద్ద ఎత్తున పెరిగింది.

ఈరోజు దోపిడీ ఎందుకు జరుగుతోంది? ఎందుకు జరుగుతోందంటే ఒక పెట్టుబడిదారుడు అవినీతిపరుడు కావడం వల్లనా? కచ్చితంగా అవినీతి చేస్తాడు, లేక ఒక పెట్టుబడిదారుడు మోసం చేయడం వల్లనా? కచ్చితంగా మోసం చేస్తాడు. కాని ఈ దోపిడీ జరిగేది ఆ మోసం వల్లనో, అవినీతి వల్లనో కాదు జరిగేది. దోపిడీ వెనుక ముఖ్యమైన కారణం పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థలోనే ఉంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థలోనే అంతర్గతంగా ఈ దోపిడీ జరుగుతుంది. పెట్టుబడిదారుడు ఎంత నిజాయితీగా ఉన్నా, ఎంత అవినీతికి లొంగకుండా ఉన్నా, మోసం చేయకుండా ఉన్నా దోపిడీ జరుగుతుంది. ఏ విధంగా ఆ దోపిడీ జరుగుతుంది అనేదాన్ని మార్క్సిజం శాస్త్రీయంగా విశ్లేషిస్తుంది.

పెట్టుబడిదారీ ఉత్పాదన క్రమంలో అదనపు శ్రమ సృష్టి అవుతుంది. ఒక కార్మికుడు కొన్ని గంటలు శ్రమ చేసి ఒక వస్తువును ఉత్పత్తి చేస్తాడు. ఆ వస్తువు విలువ మార్కెట్‌లో ఆ కార్మికుడికి వచ్చే వేతనం లేక కూలీ కంటే ఎక్కువ ఉంటుంది. ఆ విధంగా పుట్టుకు వచ్చిన అదనపు విలువ పెట్టుబడిదారీ ఉత్పాదన వ్యవస్థలో లాభాల కింద మారుతుంది. ఆ అధిక విలువ పెట్టుబడిదారీ వ్యవస్థలోని ఉత్పత్తి క్రమంలోనే పుట్టుకు వస్తుంది. ఈ పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమాన్ని మనం రద్దు చేయకపోతే మన మీద జరుగుతున్న ఈ రకమైన దోపిడీని అంతం చేయలేం.

అంటే పెట్టుబడిదారీ వ్యవస్థలో జరుగుతున్న దోపిడీ ఆ పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క ఉత్పత్తి క్రమంలోనే ఉంది. ఆ ఉత్పత్తి క్రమాన్ని మనం రద్దు చేయడం ద్వారా మాత్రమే దోపిడీని అంతం చేయగలమన్న మాట. దాన్ని రద్దు చేయాలంటే ఒక రాజకీయ ప్రత్యామ్నాయాన్ని తీసుకురావలసిన అవసరం ఉంది. అదే సోషలిజం. అది మనల్ని చివరికి కమ్యూనిజం వైపు తీసుకువెళుతుంది. సోషలిజంలో వచ్చే ప్రత్యామ్నాయ ఉత్పాదక వ్యవస్థ ఎలా ఉంటుంది? సోషలిస్టు వ్యవస్థలో ఉత్పాదనా క్రమంలో వచ్చే అధిక విలువ పెట్టుబడిదారుల లాభాల కింద మారదు. అక్కడ అది సమాజానికి, ప్రజలందరి అభివృద్ధి కోసం ఉపయోగపడుతుంది. ఆ రకమైన వ్యవస్థను – సోషలిజాన్ని తీసుకువస్తే తప్పితే మానవ విముక్తి వైపుకి మనం ముందడుగు వేయ్యలేం.

ఈ అదనపు విలువ సూత్రాన్ని కనుగొనే క్రమంలో మార్క్స్.. పెట్టుబడిదారీ ఉత్పాదన వ్యవస్థ ఏంటి, దాని ఉత్పత్తి క్రమం ఏంటి? అన్న విషయాలను విపులంగా పరిశీలించి, చాలా లోతుగా విశ్లేషించి కనుగొన్న మార్క్సిస్టు మూల సూత్రాలను 'పెట్టుబడి' గ్రంథంలో మనకు వివరించారు. కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పిన విషయాలన్నింటినీ రుజువుచేయడానికి ఈ పెట్టుబడి గ్రంథంలో ఆయన అన్ని మూల సూత్రాలనూ వైజ్ఞానికంగా నిరూపించారు.

ఈ సూత్రాలన్నింటి గురించి విశ్లేషణ చేయ్యాలంటే ఒక క్లాస్‌లో, ఒక ఉపన్యాసంలో కుదరదు. వాటిని మనమందరం కలసి అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. ఇవాళ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో తీవ్రమైన సంక్షోభాన్ని అర్థం చేసుకోటానికి ఈ మూల సూత్రాలన్నిటినీ అధ్యయనం చేయడం, సరిగా అర్థం చేసుకోవడం అవసరం.

నేను పార్టీలో పూర్తికాలం కార్యకర్తగా వచ్చినప్పుడు మాకినేని బసవ పున్నయ్యగారు మార్క్స్–ఏంగెల్స్ రాసిన కమ్యూనిస్టు ప్రణాళిక ఎన్నిసార్లు చదివావు అని తరచూ అడుగుతూ వచ్చేవారు. అప్పుడు గ్రహించలేదు నేను. వ్యక్తిగతంగా ఇప్పుడు దాన్ని ఆత్మవిమర్శనా పూర్వకంగా చెప్పవలసిన అవసరం ఉంది. అన్ని సార్లు ఎందుకు చదవాలి ఒక్కసారి చదివితే చాలదా, ఒకసారి అర్థం అయితే చాలదా అంటే లేదు అని యం.బి.గారు ఎప్పుడూ చెబుతూ వచ్చేవారు. గతంలో నువ్వు చదివిన సమయంలో అర్థం కాని అనేక విషయాలు మారుతున్న పరిస్థితుల్లో అర్థం అవుతాయి. ఆ పుస్తకం అలా పదే పదే చదివే క్రమంలో దాని ప్రాసంగికత ఇంకా ఎక్కువ నీకు కనిపిస్తుంది. అందుకే ఈ మార్క్సిస్టు మూల గ్రంథాలను మళ్ళీ మళ్ళీ చదవాల్సిన అవసరం ఉంది అనేవారు.

ఇవాళ ఆ సమయం మళ్ళీ వచ్చింది. నేడు మనం ఉన్న పరిస్థితుల్లో నయా–ఉదారవాదం వల్ల ఇంకా తీవ్రంగా పెరుగుతున్న ఆర్థిక సంక్షోభాన్ని అర్థం చేసుకోవాలంటే మార్క్సిస్టు మూల గ్రంథాలను మళ్ళీ ఒకసారి తిరగ చదవాల్సిన అవసరం ఉంది. ఈ రెడ్

❝ ప్రపంచంలో నేడున్న పరిస్థితుల్లో సంక్షోభం ఎంత పెరిగినా పెట్టుబడిదారీ విధానానికి ఒక రాజకీయ ప్రత్యామ్నాయం -సోషలిజం సృష్టి అయ్యేవరకూ, అది పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చే వరకూ ఆ సంక్షోభం నుంచి, దోపిడి నుంచి మానవాళి విముక్తి సాధించ లేదు. అది సాధించాలంటే మన ముందు విప్లవం తప్పితే వేరే మార్గం లేదు. ఆ విప్లవం ఎలా తీసుకురావాలి అనేదాన్ని అర్థం చేసు కుంటే సరిపోదు. అర్థం చేసుకుని దాని ఆధారంగా ఈ ప్రపంచాన్ని మార్చాలి. మార్క్స్, ఏంగెల్స్ కమ్యూనిస్టు ప్రణాళికలో ఇచ్చిన పిలుపు సారాంశం ఇదే. ❞

బుక్స్ దే పిలుపు ద్వారా మనం అందరం ఈ అధ్యయనాన్ని కొనాసాగించాల్సిన అవసరం ఉంది.

**సంక్షోభం నుండి దానికదే విముక్తి రాదు**

మనం ఒకసారి వెనక్కి వెళితే... పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలోనే దోపిడీ జరుగుతుందనీ, ఈ దోపిడీ నుండి విముక్తి పొందాలంటే ఒక రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ముందుకు తీసుకురావలసిన అవసరం ఉందనే విషయాన్ని చర్చించాం. ఈ సందర్భంగా మార్క్స్ చెప్పిన ఒక ముఖ్యమైన విషయం గుర్తుపెట్టుకోవాలి. అదేమిటంటే సంక్షోభం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థలో ఎప్పుడూ సృష్టి అవుతూ ఉంటుంది. కానీ ఆ సంక్షోభం వల్ల ఎంత తీవ్రమైనాగానీ, ఆ సంక్షోభం వల్ల ఏన్నడూ పెట్టుబడిదారీ వ్యవస్థ ఆటోమ్యాటిక్‌గా కూలిపోదు.

అసలు పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభం ఎందుకు పుట్టుకు వస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పాదనలో అధిక విలువ సృష్టించబడుతుందని చెప్పుకున్నాం కదా! ఉత్పత్తయిన వస్తువు మార్కెట్‌లో అమ్ముడైతే తప్ప ఆ అధిక విలువ లాభాల్లోకి మారలేదు. ఆ వస్తువుని కొనుకున్ననే శక్తి ప్రజానికంలో లేకపోతే ఆ అధిక విలువ ఆ వస్తువులో ఉంటుంది. కాని లాభం కింద మారదు. ప్రజలపై దోపిడీ ఎంత తీవ్రంగా పెరుగుతే అంతగా వారి కొనుక్కునే శక్తి తగ్గుతుంది. అలాంటి పరిస్థితుల్లో వస్తువులు అమ్ముడు గాక అధిక విలువ లాభాల్లోకి మారక పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆర్థిక సంక్షోభం పెరుగుతుంది. కానీ ఆ ఆర్థిక సంక్షోభానికి పరిష్కారం పెట్టుబడిదారీ వ్యవస్థలో దొరకదు. ఎందువల్ల? ప్రజానికానికి కొనుక్కునే శక్తిని ఇవ్వాలంటే పెట్టుబడిదారులు తమ లాభాలను తగ్గించుకోవాలి. కానీ లాభాలను తగ్గించుకునే పని పెట్టుబడిదారులు చేయరు. అందువల్ల ఈ సంక్షోభానికి పరిష్కారం లేకపోవడంతో అది ఇంకా తీవ్రంగా పెరిగే అవకాశం ఉంది. అదే ఇవాళ ప్రపంచంలోనూ, మన దేశంలోనూ జరుగుతోంది.

అయితే ప్రపంచంలో నేడున్న పరిస్థితుల్లో సంక్షోభం ఎంత పెరిగినా పెట్టుబడిదారీ విధానానికి ఒక రాజకీయ ప్రత్యామ్నాయం –సోషలిజం సృష్టి అయ్యేవరకూ, అది పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చే వరకూ ఆ సంక్షోభం నుంచి, దోపిడి నుంచి మానవాళి విముక్తి సాధించలేదు. అది సాధించాలంటే మన ముందు విప్లవం తప్పితే వేరే మార్గం లేదు. ఆ విప్లవం ఏ విధంగా తీసుకురావాలి, ఏ విధంగా జరుగుతుంది అనేదాన్ని అర్థం చేసుకుంటే సరిపోదు. అర్థం చేసుకుని దాని ఆధారంగా ఈ ప్రపంచాన్ని మార్చాలి. మార్క్స్, ఏంగెల్స్ కమ్యూనిస్టు ప్రణాళికలో ఇచ్చిన పిలుపు సారాంశం ఇదే. ఈ ప్రపంచాన్ని మార్చాలి అంటే, ఈ దోపిడీని అంతం చేయ్యాలి అంటే ఇవాళ ఆ పెట్టుబడిదారీ వ్యవస్థని కూల్చివేసి ఒక ప్రత్యామ్నాయ సోషలిస్టు వ్యవస్థను నిర్మిస్తే తప్పితే ఈ పని జరగదు. కానీ ఈ సోషలిస్టు వ్యవస్థను ఏ విధంగా నిర్మించగలం?

ఈ సందర్భంలో లెనిన్ మార్క్సిజాన్ని ఏ విధంగా ముందుకు తీసుకువెళతాడో విశ్లేషించి దానిని అర్థం చేసుకోవడం కూడా అవసరం. ఎందుకంటే రాజకీయ ప్రత్యామ్నాయమైన సోషలిజం అనేది మానవాళిని కమ్యూనిజం వైపు తీసుకుపోతుంది. మారిన పరిస్థితుల్లో అటువంటి రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ఏ విధంగా మనం సాధించగలం అనేదాన్ని మనం లెనిన్ చేసిన విశ్లేషణల నుండి స్పష్టంగా గ్రహించగలుగుతాం. మార్క్సిజం ఒక ఒట్టి ఫార్ములా కాదు అంటాడు లెనిన్. ఒక విశ్లేషణ ఆధారంగా, ఏదో ఒక ఫార్ములా ఆధారంగా మనం విప్లవం సాధించగలమని అనుకోవడం తప్పు. నిర్దిష్ట పరిస్థితుల యొక్క నిర్దిష్ట విశ్లేషణే మార్క్సిజం యొక్క ముఖ్యమైన సారాంశం. పరిస్థితులు ఏవిధంగా మారుతున్నాయో ఆ మారుత్ను పరిస్థితుల విశ్లేషణ మారకపోతే చాలా పెద్ద తప్పులు జరుగుతాయి. దీని వల్ల విప్లవోద్యమం ముందుకు వెళ్ళడం కంటే అది ఎదురుదెబ్బలు తినే అవకాశం ఉంది.

అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో సంక్షోభం వస్తుందనీ దాని నుండి మానవాళి విముక్తి సాధించాలంటే ఆ పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసే రాజకీయ ప్రత్యామ్నాయం ఆధారంగా విప్లవ పరిస్థితిని సృష్టించాలని మార్క్స్–ఏంగెల్స్ చెప్పారు. కానీ ఇప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాద దశకు చేరినప్పుడు లెనిన్ చేసిన విశ్లేషణ ఏమిటి? సామ్రాజ్యవాదం మొత్తం ప్రపంచాన్ని ఒక గొలుసులో కట్టేసింది. ఆ గొలుసులో ఉన్న బలహీనమైన లింక్ ఎక్కడైతే ఉందో అక్కడ నుంచి ఈ విప్లవం మొదలవుతుంది. దాని ద్వారానే సోషలిజం ప్రత్యామ్నాయాన్ని ముందుకు తీసుకురాగలం అని ఆయన చెప్పాడు. బలహీనమైన లింకు దగ్గర సామ్రాజ్యవాద గొలుసును తెగ్గొట్టడం. అది 1917లో జరిగిన రష్యన్ విప్లవం.

ఆనాడు రష్యా, సామ్రాజ్యవాద సర్కిల్‌లో ఉన్న బలహీనమైన లింకు. అక్కడ విప్లవోద్యమాన్ని నిర్మించి పెట్టుబడిదారీ వ్యవస్థను కూలగొట్టి ప్రత్యామ్నాయ సోషలిజం నిర్మాణాన్ని నిర్మించే పనిని రష్యన్ విప్లవం చేసింది. అంటే అభివృద్ధి చెందిన దేశాల్లోనే కాక అంతగా అభివృద్ధి చెందని దేశాలలో కూడా విప్లవం సాధించగలం, సామ్రాజ్యవాద గొలుసులోని బలహీనమైన లింకుగా ఉన్న దేశాల్లో ఆ రకంగా విప్లవం సాధించే అవకాశం ఏర్పడుతుంది అన్న విషయం దీనితో స్పష్టమైంది. దానిని విప్లవకారులందరూ ఉపయోగించుకోవలసిన అవసరం ఉంది. అది ఉపయోగించుకోవాలంటే ఆ దేశంలో ఉన్న నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించాలి. ఆ పరిస్థితులు నిర్దిష్టంగా ఏ స్టేజిలో ఉన్నామో గ్రహించాలి. ఈ విధంగా లెనిన్ రష్యన్ పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించి విప్లవం తీసుకు వచ్చాడు.

ఆ విప్లవోద్యమాన్ని మనం ముందగు తీసుకు వెళ్ళటానికి, విప్లవాన్ని సాధించడానికి మార్క్స్, ఏంగెల్స్ నేర్పిన మూల సూత్రాలను అధ్యయనం చేస్తే చాలదు. లెనిన్ చేసినట్లు మార్క్సిజాన్ని నిర్దిష్ట పరిస్థితులకు వర్తింపజేయాలి. నిర్దిష్ట పరిస్థితుల యొక్క నిర్దిష్ట విశ్లేషణే గతితార్కిక సారం. ఆ నిర్దిష్ట పరిస్థితులను మనం సరిగ్గా గుర్తించకపోతే తప్పులు జరుగుతాయి. అంటే పరిస్థితులను గుర్తించడం దాని ఆధారంగా శాస్త్రీయమైన


విశ్లేషణ చేయడం ఇవి రెండూ చాలా ముఖ్యమైన అంశాలు. విప్లవ శక్తుల బలం పెరుగుతుందా తగ్గుతుందా అనేది దీనిపై ఆధారపడి ఉంటుంది.

ఈ మార్క్సిస్టు మౌలిక సూత్రాల ఆధారంగానే ఇవాళ మనం ప్రపంచాన్ని మార్చగలం. విప్లవం సాధించడానికి కార్మికవర్గ పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో రాజకీయ ప్రత్యామ్నాయం ఏర్పారచడం, దాని ఆధారంగా విముక్తి సాధించడం జరగాలి. ఈరోజు మార్క్సిజం ప్రాసంగిత ఎందుకు పెరుగుతోందో దీని వల్లనే అర్థం అవుతోంది. ప్రజా విముక్తి జరగాలంటే ఈ వ్యవస్థనే మార్చాలి, మార్చాలి అంటే వ్రస్థత పెట్టుబడిదారీ వ్యవస్థను కూలగోట్టాలి, దాన్ని కూలగొట్టాలంటే రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ముందుకు తీసుకొచ్చే విప్లవ శక్తిని బలపరచాలి. ఇవన్నీ సాధించాలంటే ఇవాళ ఉన్న నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.

సామ్రాజ్యవాదాన్ని ఎదిరించి నిలబడగలిగిన శక్తిగా ఉన్న సోవియట్ యూనియన్‌లో సోషలిజం దెబ్బతిన్న తర్వాత పెట్టుబడిదారీ వ్యవస్థకి తన లాభాలను ఇంకా పెద్ద ఎత్తున పెంచుకునే అవకాశాలు పెరిగాయి. ప్రపంచీకరణ లేక, నయా–ఉదారవాదం లక్ష్యం లాభాలను నిరంతరాయంగా పెంచుకుంటూ పోవడమే. లాభాలన్నే పెంచుకుంటూ పోవాలంటే ప్రభుత్వ రంగ సంస్థలనూ, సర్వీసులనూ ప్రైవేటీకరణ చేయాలి. అన్ని రకాల ప్రకృతి వనరులను – ప్రపంచంలో ఉన్న అడవులు, జల వనరులు, ఇంధనం... వగైరాలన్నిటినీ ప్రైవేటీకరించాలి. అలా చేస్తేనే లాభాలు నిరంతరంగా పెరిగే అవకాశం ఉంటుంది. నయా–ఉదారవాదం అంటే నియంత్రణ లేని పెట్టుబడి ప్రవాహానికి అవకాశం ఇవ్వం. పెట్టుబడి ఒక దేశం నుంచి మరో దేశానికి వెళ్ళడానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చేసే వ్యవస్థను సృష్టించడం. దాని వల్ల జరిగిందేమిటి?

దానివల్ల ఏదైతే మార్క్స్ విశ్లేషించాడో అటువంటి ఒక కొత్త రకమైన సంక్షోభం పుట్టుకు వచ్చింది. ఒకవైపు లాభాలు పెరుగుతున్నాయి. మరోవైపు ప్రజానికం చేతిలో కొనుక్కునే శక్తి అదే విధంగా తగ్గుతోంది. లాభాలు పెరగడం, ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం ఇవి రెండూ పెట్టుబడిదారీ వ్యవస్థలో సహజంగా జరుగుతాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో లాభాలను పెంచగలిగినా, పెట్టుబడి ఇంకా

❝ ఈ మార్క్సిస్టు మౌలిక సూత్రాల ఆధారంగానే ఇవాళ మనం ప్రపంచాన్ని మార్చగలం. విప్లవం సాధించ డానికి కార్మికవర్గ పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో రాజకీయ ప్రత్యామ్నాయం ఏర్పార చడం, దాని ఆధారంగా విముక్తి సాధించడం జరగాలి. ఈరోజు మార్క్సిజం ప్రాసంగిత ఎందుకు పెరుగుతోందో దీని వల్లనే అర్థం అవుతోంది. ❞




ఎక్కువ పెంచినా, కొత్త ఫ్యాక్టరీలు సరుకులు వచ్చినా వాళ్ళు ఉత్పత్తి చేసిన వస్తువుని అమ్ముకుంటే తప్పితే అధిక విలువ లాభంలోకి మారదు. అమ్ముకోవాలంటే కొనుక్కునే శక్తి ఉండాలి. ప్రజానికంలో అది తగ్గుతుండడంతో సంక్షోభం ఏర్పడింది. ఆ సంక్షోభం నుంచి బయటపడడానికి నయా–ఉదారవాదం ఎన్నుకున్న మార్గం ప్రజల మీద దోపిడీని ఇంకా తీవ్రం చేసి లాభాలను పెంచుకోడానికి ప్రయత్నించడం. అంటే దోపిడీ ఇంకా తీవ్రంగా పెరుగుతుంది. 2008లో వాల్‌స్ట్రీట్‌లో జరిగిన ద్రవ్య సంక్షోభం (ఫైనాన్సియల్ మెల్ట్ డౌన్) తర్వాత మనం అదే చూస్తున్నాం.

పొదుపు చర్యలు (ఆస్టిరిటీ మెజర్స్) అనే పేరుతో కార్మిక వర్గం మీద దోపిడి చాలా తీవ్రంగా పెరుగుతోంది. ఎనిమిది గంటలు పనిచేయాలని చాలా పెద్దఎత్తున కృషి చేసి, ఉద్యమాలు చేసి, త్యాగాలుచేసి, కార్మికవర్గం ఏదైతే సాధించిందో దానిని ఇవాళ అనేక దేశాలు 10 గంటల పనిగా మార్చాయి. మనదేశంలో 12 నుంచి 16 గంటల వరకు వనిచేయించుకుని లాభాలు పెంచుకుంటున్నారు. పెన్షన్‌లలో కోత, వేతనాల్లో కోత జరుగుతోంది. ఈ విధంగా ఈ లాభాలను పెంచుకోటానికి ఈ దోపిడీ ఇంకా తీవ్రంగా పెరుగుతోంది. నయా–ఉదారవాదం వల్ల ఈ దోపిడీ తీవ్రంగా పెరుగుతున్న కొద్దీ దానికి వ్యతిరేకంగా ప్రజల్లో అసంతృప్తి కూడా పెరుగుతోంది. ఈ అసంతృప్తి అనేక దేశాల్లో పెద్దపెద్ద ఉద్యమాలుగా మారి రాజకీయ మార్పులు కూడా తీసుకురావడం మనం చూసాం. లాటిన్ అమెరికాలోని చిలీలో ఐదు దశాబ్దాల క్రితం ఎన్నికైన కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని అమెరికా గూఢచారి సంస్థ సిఐఎ, సైన్యం కలిసి ఒక సైనిక కుట్ర ద్వారా కూలగోట్టి అక్కడ ఒక నియంతృత్వ ప్రభుత్వాన్ని స్థాపించాయి. ఆ ప్రభుత్వం ద్వారా ప్రపంచంలోనే మొదటి సారి నయా–ఉదారవాద విధానాలను అక్కడ ప్రారంభించారు. అటువంటి చిలీలో 50 సంవత్సరాల తరువాత ఇవాళ మళ్లీ వామపక్ష ప్రభుత్వం ఏర్పడింది. ముగ్గురు కమ్యూనిస్టు నాయకులు క్యాబినేట్‌లో ఉన్నారు. అక్కడ ప్రజా ఉద్యమం ద్వారా రాజకీయ రంగంలో వచ్చిన చాలా పెద్ద మార్పు ఈ వామపక్షాల ప్రభుత్వం రావటం. అదే విధంగా లాటిన్ అమెరికాలోని పెరూ, బొలివియా, హోండురాస్‌లో వామపక్ష ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి. అదే విధంగా పెద్ద సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వెనుజులాలో పెద్ద పోరాటం జరుగుతోంది. సోషలిస్టు క్యూబా వీటన్నిటికీ ప్రేరణ ఇస్తోంది. క్యూబాకి వ్యతిరేకంగా సామ్రాజ్యవాదం ఆర్థిక ముట్టడి ఇంకా పెంచింది. అయినా ఈ మార్పులు జరుగుతున్నాయి.

ప్రజల యొక్క అసంతృప్తి ఒక ఉద్యమం కింద మారి తద్వారా వచ్చే ఒక రాజకీయ పరిణామాలు సోషలిజం వైపుకి మళ్ళుతే సామ్రాజ్యవాదానికి పెద్ద ప్రమాదం. నియో–లిబరల్ రాజకీయ వ్యవస్థ దీనిని ఎదుర్కోడానికి

> **" ఇలాంటి పరిస్థితుల్లో మనం మార్క్సిస్టు మూల సూత్రాలను అధ్యయనం చేస్తూ నేటి నిర్దిష్ట పరిస్థితులకు వాటిని అమలు చేస్తూ విప్లవోద్యమాన్ని నిర్మించాలి. మార్క్స్-ఏంగెల్స్ ఇచ్చిన పిలుపును మనదేశంలో సాధించేందుకు, విప్లవం వైపుకి ముందడుగు వేయడం కోసం విప్లవ ప్రత్యామ్నాయాన్ని సృష్టించాలంటే ఈ బిజెపి ప్రభుత్వాన్ని అధికారం నుంచి దించాలి. దానికోసం తీసుకునే ఎత్తుగడలను గురించిన వివరాలు మనం ఇటీవల విడుదల చేసిన పార్టీ 23వ మహాసభ ముసాయిదా రాజకీయ తీర్మానంలో ఉన్నాయి. "**

అనేక విధాలా ప్రయత్నిస్తోంది. అనేక దేశాల్లో ప్రజల్లో పెరిగిన అసంతృప్తి ఉద్యమాలుగా మారి రాజకీయ ప్రత్యామ్నాయం సోషలిజంలోకి మారకుండా చూడ్డానికి నయా-ఉదారవాదం ప్రజల్లో ఏర్పడుతున్న ఐక్యతను చెదరగొట్టడానికి ప్రయత్నిస్తున్నది. ప్రతి దేశంలోనూ నేడు ఈ పరిస్థితి మనకు కనిపిస్తుంది. అనేక దేశాల్లో నేడు నియంతృత్వ పోకడలు పెరుగుతున్నాయి. రాజకీయ రంగంలో మితవాదంవైపు మొగ్గు పెరుగుతోంది. బ్రెజిల్ అధినాయకుడు తాను ఫాసిస్టునని బహిరంగంగా చెప్పుకుంటున్నాడు. ఫాసిజంలో ప్రజలకు హక్కులేమి ఉండవు. ట్రేడ్ యూనియన్ హక్కులేమి ఉండవు. అన్ని ట్రేడ్ యూనియన్‌ల మీద నిషేధం విధిస్తారు. కార్మిక వర్గ ఉద్యమాల మీద ఉక్కుపాదం మోపుతారు. అమెరికా మరికొన్ని దేశాల్లో వర్ణవివక్ష రూపంలో నియంతృత్వం అమలవుతున్నది. మన దేశంలో మతతత్వం ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేసి వారిలో పెరుగుతున్న అసంతృప్తి విప్లవోద్యమం వైపు మళ్ళకుండా ప్రయత్నిస్తోంది.

మన దేశంలో నేడు నయా-ఉదారవాదం కింద ఆర్థిక దోపిడీ చాలా తీవ్రంగా పెరుగుతోంది. అన్ని రంగాల్లోనూ జరుగుతున్న ప్రైవేటీకరణ, వనరుల లూటీ, లేబర్ కోడ్‌లు ప్రవేశపెట్టడం ద్వారా, ఇంకా అనేక విధాలా కార్మిక వర్గం మీద దాడులు, ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ ప్రైవేటీకరించడం, ప్రభుత్వ ఆస్తుల నగదీకరణ, మన రైతాంగ వ్యవసాయాన్ని కార్పొరేట్ రంగం లూటీ చేసుకుని లాభాలు పెంచుకునే అవకావ కాశాలు పెద్దఎత్తున కల్పించడం, విదేశీ పెట్టుబడులు మన దేశంలోకి వచ్చి లాభాలు చేసుకోవడానికి అవకాశాలు పెంచడం...ఇదంతా కూడా పెట్టుబడిదారుల లాభాలు పెంచడానికి తీసుకునే చర్యలే. దేశంలో ఇటు కార్పొరేట్ రంగం, మరోవైపు మతతత్వ హిందూత్వల మధ్య బాంధవ్యం వృద్ధి చెందింది. ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని దారి మళ్లించడానికి మతతత్వాన్ని ఉపయోగించుకోవడం అనేదానితోపాటు వాళ్ళకు మరో వ్యూహం కూడా ఉంది. మన దేశంలో ఉన్న లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని ఆర్‌ఎస్ఎస్ యొక్క మెజారిటీ మతతత్వంతో కూడిన హిందూత్వ రాజ్యంగా మార్చాలన్నది వారి లక్ష్యం. లౌకిక ప్రజాతంత్ర రిపబ్లిక్కును హిందూ రాష్ట్రగా మార్చాలన్నది వారి ధ్యేయం. అందుకే వారు మన రాజ్యాంగం మీద, రాజ్యాంగం యొక్క మూలస్థంబాల మీద, మన రాజ్యాంగ సంస్థల మీద నిత్యం దాడులు చేస్తున్నారు. పార్లమెంట్ నుంచి మొదలుపెట్టి న్యాయవ్యవస్థ, ఎలక్షన్ కమీషన్, ఎన్‌ఫోర్స్ మెంట్ డిపార్టుమెంట్, సి.బి.ఐ వంటి సంస్థలను ఉపయోగించుకుంటూ వాళ్ళ లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ రోజు ఏర్పడిన ఈ మతతత్వ, కార్పొరేట్ కూటమి విదేశీ పెట్టుబడిదారులతో చాలా గట్టి సంబంధాలు నెలకొల్పు కున్నది. దాని వల్లనే నేడు మన విదేశాంగ విధానం భారత దేశాన్ని సామ్రాజ్యవాదానికి ఒక జూనియర్ పార్టనర్‌గా మార్చే స్థాయికి దిగజారిపోయింది. మోదీ ప్రభుత్వం దేశంలో నిరంకుశ పద్ధతులు అనుసరిస్తున్నది. ప్రజల అధికారాల మీద, ప్రజాతంత్ర హక్కులు, పౌర హక్కులు మీద తీవ్రమైన దాడులు చేస్నున్నది.

వీటన్నింటిలోనూ వీళ్ళ ముఖ్యమైన టార్గెట్‌గా నేడు కమ్యూనిస్టులు ఉన్నారు. రేపు అసెంబ్లీ ఎన్నికల మొదటి దశ మొదలవుతుందనగా ఇవాళ ప్రధాని నరేంద్ర మోదీ ఒక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక అంశాలను గురించి మాట్లాడుతూ ఒక ముఖ్యమైన మాట అన్నారు. దీన్ని మనం గుర్తించాల్సిన అవసరం ఉంది. నేడు కమ్యూనిస్టుల బలం చాలా దిగజారింది. ఏదో దేశంలో ఒక కార్నర్‌లో కేరళాలో ఉన్నారు. అక్కడ కూడా ఎక్కువ రోజులు ఉండరు. కాని వాళ్ళు పార్లమెంట్‌లో ఉన్నా లేకపోయినా, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నా లేకపోయినా వాళ్ళ సిద్ధాంతం చాలా ప్రమాదకరమైనది, దానిని రద్దు చేయాల్సిన అవసరం ఉంది అని చెప్పాడు. ఎందువల్ల ఆయన అలా అన్నారు? ఈరోజు ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని సమీకరించి ఒక విప్లవ రూపం ఇచ్చే శక్తి మన సిపియంకే, మన కమ్యూనిస్టు ఉద్యమానికే, వామపక్ష ఉద్యమానికే ఉంది. ఆ ప్రమాదాన్ని గ్రహించారు గనుకనే ఆయనకు కమ్యూనిస్టుల మీద దాడి ఎక్కుపెట్టారు. ఆర్ఎస్ఎస్, బిజెపి మదోన్మాదాన్ని ఎదిరించడంలోనూ, లౌకిక తత్వాన్ని కాపాడ్డడం లోనూ, ముఖ్యంగా ఎటువంటి రాజీ లేకుండా సూత్రబద్ధంగా మతతత్వాన్ని వ్యతిరేకిస్తున్నది సిపిఐ(ఎం), వామపక్షాలే. ఏడాది పాటు జరిగిన రైతాంగ ఉద్యమం కానివ్వండి, లేక పెరుగుతున్న ట్రేడ్ యూనియన్స్ ఉద్యమాలు కానివ్వండి, మార్చిలో జరిగే రెండు రోజుల కార్మిక సమ్మె కానివ్వండి... వీటన్నింటి వెనుక లెఫ్ట్ ఒక ముఖ్యమైన శక్తి అనేది మన వర్గ శత్రువులే గమనిస్తున్నారు. అందువల్లనే వారు గురిచూసి మనమీద దాడి చేసి, ప్రజలల్లో ఉన్న అసంతృప్తి ఒక ప్రజా ఉద్యమంగా మారకుండా, ఆ ఉద్యమం ఒక విప్లవ స్థాయికి చేరకుండా ప్రయత్నిస్తున్నారు.


ఇలాంటి పరిస్థితుల్లో మనం మార్క్సిస్టు మూల సూత్రాలను అధ్యయనం చేస్తూ నేటి నిర్దిష్ట పరిస్థితులకు వాటిని అమలు చేస్తూ విప్లవోద్యమాన్ని నిర్మించాలి. మార్క్స్-ఏంగెల్స్ ఇచ్చిన పిలుపును మనదేశంలో సాధించేందుకు, విప్లవం వైపుకి ముందడుగు వేయడం కోసం విప్లవ ప్రత్యామ్నాయాన్ని సృష్టించాలంటే ఈ బిజెపి ప్రభుత్వాన్ని అధికారం నుంచి దించాలి. అలా దించడానికి తీసుకునే ఎత్తుగడలను గురించిన వివరాలు మనం ఇటీవల విడుదల చేసిన పార్టీ 23వ మహాసభ ముసాయిదా రాజకీయ తీర్మానంలో ఉన్నాయి.

చివరిగా చెప్పదలచుకున్న మౌలిక విషయం ఏమంటే మార్క్సిజాన్ని అధ్యయనం చేసి, దాని మూల సూత్రాలను పునఃగ్రహించి, వాటిని నేటి నిర్దిష్ట పరిస్థితులో నిర్దిష్ట విశ్లేషించుకుంటూ మానవాళి విముక్తి కోసం ముందడుగు వెయ్యాలి. నేటి ఈ ప్రపంచాన్ని మార్చటానికి ముందడుగు వేయాలి. ఈ రెడ్ బుక్స్ డేని ప్రేరణగా తీసుకొని మీరు ప్రారంభించిన అధ్యయన కార్యక్రమం సంతోషించదగింది. అయితే మొదటిలోనే చెప్పినట్లు అది ఈ వారంరోజుల కార్యక్రమం అయిపోవడంతోనే ఆగిపోకూడదు. అధ్యయనాన్ని కొనసాగించాలి.

❋

అధ్యయనం

# మార్క్సిజంపై మళ్లీ ఆసక్తి పెరుగుతున్నది



**బి.వి.రాఘవులు**

***(రెడ్‌బుక్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 20వ తేదీన విజయవాడలో జరిగిన పుస్తకావిష్కరణ సభలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు గారు చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలను పాఠకులకు అందిస్తున్నాం - సంపాదకుడు.)***

**1990**వ దశకంలో సోషలిజం ఎదురుదెబ్బ తిన్న తరువాత మానవాళి చరిత్రలో పెట్టుబడిదారీ వ్యవస్థే అంతిమ దశ అనీ, ఇక చరిత్ర పురోగమనంలో మార్పులు ఉండవనీ పెట్టుబడిదారీ పండితులు జోస్యం చెప్పారు. పెట్టుబడిదారీ వ్యవస్థ విజయం సాధించిందని, అదే శాశ్వతంగా కొనసాగుతుందని ప్రచారం చేశారు. కాని 2008 తర్వాత పరిస్థితి మారిపోయింది. పెట్టుబడిదారీ వ్యవస్థలోని అంతర్గత వైరుధ్యాలే దానిని నాశనం చేస్తాయని మార్క్స్-ఏంగెల్స్‌లు కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పినది వాస్తవం అవుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థలోని వైరుధ్యాలు పెరగటంతో అది తీవ్రమైన సంక్షోభంలో పడింది. ఏ సమస్యలనైతే పెట్టుబడిదారీ వ్యవస్థ పరిష్కరిస్తుందని చెప్పారో అవి పరిష్కారం కాకపోగా మరింతగా తీవ్రమౌతున్నాయి.

2008లో ప్రారంభమైన సంక్షోభం పెట్టుబడిదారీ వ్యవస్థను ఒక కుదుపు కుదిపింది. అమెరికాలో సబ్‌ప్రైమ్ కుంభకోణంతో ఈ సంక్షోభం ప్రారంభమైంది. ఇళ్ళ కొనుగోలు, అమ్మకాల కోసం బ్యాంకులు ఇచ్చిన అప్పులు తీర్చలేక ఇళ్ల యజమానులు చతికిలపడటంతో బ్యాంకులు, వాటికి రుణాలు ఇచ్చిన ఆర్థిక సంస్థలు దివాళా తీయడం ప్రారంభం కావటంతో సంక్షోభం మొదలైంది. అమెరికాలో ప్రారంభమైన ఈ సంక్షోభం ప్రపంచం మొత్తానికి విస్తరించింది. సంక్షోభం తీవ్రం కావటంతో పెట్టుబడిదారీ విధానం అతలాకుతలం అయ్యింది. అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిన్నాయి. స్థూల ఉత్పత్తులు పడిపోయాయి.

ఈ సంక్షోభం తాత్కాలికమైనదని, త్వరలోనే అంతా సమసిపోయి మళ్ళీ పూర్వస్థితి వస్తుందని చాలామంది బూర్జువా ఆర్థికవేత్తలు చెప్పారు. కాని అలా జరగలేదు. ఆర్థిక మాంద్యం ఏదో ఒక రూపంలో కొనసాగుతూ వచ్చింది. ఉద్దీపన పథకాల పేరుతో భారిస్థాయిలో ద్రవ్యాన్ని అందుబాటులోకి తీసుకురావటం ద్వారా పెట్టుబడిదారీ విధానాన్ని రక్షించటం కోసం ప్రయత్నాలు చేసారు. ఆ ఉద్దీపన పథకాలు కొనసాగినంత కాలం కొంత మెరుగైనట్టు కనిపించినా, వాటి నుండి వెనక్కు తగ్గినప్పుడు మళ్ళీ ఆర్థిక వ్యవస్థలు చతికిలపడే పరిస్థితి వచ్చింది. గాయం పూర్తిగా నయమయ్యేందుకు మౌలిక వైద్యం చేయకుండా పై పూతలు పూస్తే తాత్కాలికంగా తగ్గినట్టే తగ్గి మళ్ళీ చెలరేగుతుంది. పెట్టుబడిదారీ విధానం మూలంగానే సంక్షోభం రూపంలో వ్యవస్థకు ఈ జబ్బు వచ్చింది. దానికి వైద్యం అంటే పెట్టుబడిదారీ విధానాన్ని నాశనం చేసి, ప్రత్యామ్నాయ విధానం కోసం సాగి పోవడం తప్ప మరో మార్గం లేదు. ఈ వ్యవస్థలోనే ఉంటూ దానికి మార్పులు చేయాలంటే గాయం మానినట్టే మాని మళ్ళీ చెలరేగుతుంది. ఆ పరిస్థితులు ఈ రోజు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సంక్షోభం కొనసాగుతోంది కాబట్టే ప్రపంచ స్థూల ఉత్పత్తి పడిపోతూ వస్తోంది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ కూడా దెబ్బతింది. కాకపోతే కాస్త ఆలస్యంగా. 2008, 2009, 2010 ఆ మూడు సంవత్సరాలలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎంత దెబ్బతిందో ఆ స్థాయిలో భారత ఆర్థికవ్యవస్థ దెబ్బతినలేదు. అప్పుడు మన దేశం సంక్షోభానికి అతీతంగా నిలిచిందని మన పాలకులు చెప్పారు. కాని అది మన పాలకుల గొప్పతనం కాదు. ఇక్కడి ప్రజలు, కార్మికవర్గం చేస్తున్న పోరాటాల వలన ప్రభుత్వరంగాన్ని రక్షించుకోవడం, బ్యాంకింగ్ రంగాన్ని ప్రైవేటికరించాలనే ప్రయత్నాలను చాల వరకు తిప్పికొట్టడం, ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన భాగం ప్రభుత్వరంగంలో కొనసాగుతున్నది కాబట్టి మనదేశం మీద సంక్షోభ ప్రభావం తీవ్రంగా పడలేదు. మూడు సంవత్సరాల పాటు దానిని దూరంగా ఉంచగలిగాం. కాని ఆ తర్వాత భారతదేశం కూడ సంక్షోభ ప్రభావానికి గురైంది.

2013, 2014 నుంచి మనదేశం కూడా మాంద్యంలో పడిపోయింది. మన ఆర్థికాభివృద్ధి 8, 9 శాతం పెరుగుతున్నదని గొప్పలు చెప్పారు. కాని తర్వాత 6, 7 శాతం, 2018, 2019, 2020 సంవత్సరాలకు వచ్చేసరికి 4 శాతానికి పడిపోయింది. 2020లో కరోనా మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేసి, ప్రపంచ ఆర్థికవ్యవస్థను స్థంభింపజేసింది. స్థూల జాతీయోత్పత్తి ప్రతికూలంగా నమోదైంది. మనదేశ జిడిపి 4 శాతం నుండి మైనస్ 7.3 శాతానికి పడిపోయింది. ఆ తర్వాత సంవత్సరం కొద్దిగా కోలుకుని, జిడిపి 9 శాతం పెరిగిందని తాజా బడ్జెట్‌లో చెప్పారు. 9 శాతం పెరిగింది అంటే నిజంగా 9 శాతం కాదు, మైనస్ 7.3 శాతం నుండి 9 శాతం అంటే మైనస్ 7.3 శాతం ప్రతికూలాభివృద్ధి కవరై అదనంగా రెండు శాతం పెరిగింది. ఇది కూడా బడ్జెట్ అంచనా మాత్రమే. పూర్తిస్థాయి బడ్జెట్ లెక్కలు వస్తే ఆ అభివృద్ధి కూడా ఉంటుందని చెప్పలేం.

> **"పెట్టుబడిదారీ విధానంలోని వైరుధ్యాలతో పాటు, అవసరమైనపుడు ప్రజలను అదుకోవడంలో దాని వైఫల్యాలను, సోషలిస్టు అర్థిక వ్యవస్థ గొప్పతనాన్ని కూడా కరోనా కాలం ఎత్తి చూపింది. ఇటువంటి నేపథ్యంలో మార్క్సిజం, సోషలిజం గురించి తెలుసుకోవాలనే ఆసక్తి పెరుగుతున్నది."**

కరోనా ప్రారంభమైన తర్వాత ఈ రెండు సంవత్సరాలలో ప్రపంచవ్యాపితంగా ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిన్నాయి. పెట్టుబడిదారీ విధానం డొల్లతనం, అసమర్థతతో పాటు సోషలిజం గొప్పతనం కూడా వెల్లడైంది. పెట్టుబడిదారీ దేశాలతో పాటు సోషలిస్టు దేశాలలోనూ కరోనా వచ్చింది. పెట్టుబడిదారీ దేశాలలో సామాన్య ప్రజలకు వైద్యం అందుబాటులో లేకుండాపోయింది. ప్రజలు పిట్టల్లాగా రాలిపోయారు. ఆరోగ్య వ్యవస్థలు కుప్పకూలిపోయాయి. అగ్రదేశమని గొప్పలు చెప్పుకునే అమెరికాలో ప్రపంచంలోని ఏ దేశంలో కన్నా ఎక్కువ మంది చనిపోయారు. లక్షల మంది చనిపోతున్నా ఏమీ చెయలేని దుస్థితిలో ఆ దేశం ఉంది. సోషలిస్టు చైనా ఒక్క నెలరోజులలోనే కరోనాని అదుపుచేసి, ఆర్థిక వ్యవస్థను గాడిలోకి తీసుకువచ్చింది. ఆ దేశ ఆర్థిక వ్యవస్థ 4 శాతం అభివృద్ధి సాధించింది. వియత్నాం కూడా ఆ రకంగా చేయగలిగింది. అమెరికా ఆర్థిక దిగ్బంధం చేయటంతో అంత్యంత దుర్భర పరిస్థితులను ఎదుర్కుంటున్న క్యూబా కూడా ప్రజలను అదుకున్నది. మనదేశంలో కేరళ ఆ విధమైన కృషి చేసింది. ప్రజారోగ్య వ్యవస్థ బలంగా ఉండటంతో పాటు ప్రజల సహకారంతో అటువంటి విజయం సాధించింది.

పెట్టుబడిదారీ విధానంలోని వైరుధ్యాలతో పాటు, అవసరమైనపుడు ప్రజలను అదుకోవడంలో దాని వైఫల్యాలను, సోషలిస్టు అర్థిక వ్యవస్థ గొప్పతనాన్ని కూడా కరోనా కాలం ఎత్తి చూపింది. ఇటువంటి నేపథ్యంలో మార్క్సిజం, సోషలిజం గురించి తెలుసుకోవాలనే ఆసక్తి పెరుగుతున్నది. పెట్టుబడిదారీ విధానమే ఉండాలని కోరుకునే వారు కూడా ఈ విధానం ఎందుకని అంతర్గత సమస్యల్లో పడిపోతోంది? ఎందువలన ప్రజలకు వైద్యాన్ని అందించలేకపోయింది? స్టాక్ మార్కెట్‌లు ఎందుకు కుప్పకూలుతున్నాయి? విపత్తులో కూడా పెట్టుబడిదారుల లాభాలు ఎందుకు పెరుగుతున్నాయి? అసమానతలు ఎందుకు పెరుగుతున్నాయి? ప్రజల అసంతృప్తి ఎందుకు పెరుగుతున్నది తదితర ప్రశ్నలకు పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రవేత్తలు సమాధానం చెప్పలేకపోతున్నారు. ఇటువంటి వాటిని అధిగమించి, పెట్టుబడిదారీ విధానం సజావుగా నడిచేందుకు మార్క్సిస్టు అర్థశాస్త్రంలో సమాధానాలు దొరుకుతాయేమోనని ఆ గ్రంథాలను చదువుతున్నారు. కొంతమంది దేశాధినేతలు పెట్టుబడి గ్రంథాన్ని చదువుతున్నామని ప్రకటనలు కూడా చేశారు. ఆ రకంగా మళ్ళీ మార్క్సిజం, సోషలిజంపై ఆసక్తి పెరుగుతున్నది. పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలో ఉన్నది. అందుకే ఈ రోజు ప్రపంచవ్యాపితంగా మార్క్స్ గ్రంథాలు, ఇతర గ్రంథాల్ని ప్రజలు మళ్ళీ ఆసక్తిగా చదువుతున్నారు. మార్క్స్ గొప్ప మేధావి. గొప్ప గ్రంథాలు రాశాడన్న దానిలో సందేహం లేదు. మార్క్స్ 19వ శతాబ్దంలో ఉద్భవించాడు. 19వ శతాబ్దంలో ఆయన రచనలు చేశాడు. కాబట్టి మార్క్స్ రచనలు 19వ శతాబ్దంలోని పరిస్థితులకు అన్వయించుకోడానికి పనికొచ్చేవి మినహా 20, 21వ శతాబ్దాలలోని పరిస్థితులను అర్థం చేసుకోవటానికి తోడ్పడవు అని చెప్పేవాళ్ళు కూడా ఉన్నారు.

మార్క్స్ గొప్పతనాన్ని అంగీకరిస్తూనే, ఆయన చెప్పిన విషయాలు ఉపయోగపడతాయని చెబుతూనే ఉపయోగపడే కాలాన్ని మాత్రం ప్రస్తుతానికి కాకుండా వెనక్కు నెట్టే ప్రయత్నం చేసేవారు చాలామంది ఉన్నారు. ఆ రకంగా మార్క్స్ గొప్పతనాన్ని పాత చరిత్రకు పరిమితం చేసి, ప్రస్తుతానికి ఆయన సిద్ధాంతం నిరుపయోగమైనదని నమ్మించటానికి ప్రయత్నం చేస్తున్నారు. ఇంకా ప్రామాణిక పరిభాషలో చెప్పాలంటే ఇది పాత చింతకాయ పచ్చడని, బూజుపట్టిన సిద్ధాంతమని, కాలం చెల్లిన భావాలని రకరకాల పద్ధతులలో వ్యాఖ్యానాలు చేస్తున్నారు.

ఇంతకు ముందే చెప్పినట్టు ఈ వాదనలు పూర్తిగా తప్పు. మార్క్స్ తన రచనలలో ఆనాటి పరిస్థితుల గురించి చెప్పాడు. పెట్టుబడిదారీ విధానానికి సార్వజనీనమైన, అంటే పెట్టుబడిదారీ విధానం అంతమయ్యే వరకు వర్తించే కొన్ని విషయాలు కూడా చెప్పాడు. పెట్టుబడిదారీ విధానం క్రమం తప్పకుండా సంక్షోభాలను ఎదుర్కొంటుంది. అది ప్రజలకు కష్టాలను తెస్తూనే ఉంటుంది. అది ఉన్నంత కాలం యుద్ధాలను, కార్మికవర్గంపై దోపిడీని కొనసాగిస్తూనే ఉంటుంది. రైతాంగాన్ని దివాళా తీయించి, వాళ్ళను అర్ధ శ్రామికులలోకి, శ్రామికులలోకి నెడుతూనే ఉంటుంది. వర్ణం, కులం, మతం, ప్రాంతం లాంటి పేర్లతో విభజన సృష్టించి మారణకాండ కొనసాగిస్తూనే ఉంటుంది. ఆడవాళ్ళు, గిరిజనులు, వికలాంగులు, మనదేశంలో దళితులు, అమెరికాలో నల్లజాతి పిల్లలు, ఇటువంటి వారిపై సామాజికంగా ఉన్న తక్కువ భావాన్ని ఉపయోగించుకుని, వారిని అదనంగా దోచుకుంటున్నారు. ఈరోజు ఇటువంటి పరిస్థితులు ఉన్నాయి కాబట్టి వాటిని అర్థం చేసుకోవడానికి మార్క్స్ రచనలు తోడ్పడతాయి. పెట్టుబడిదారీ విధానం ఉన్నంత కాలం కొనసాగే ఈ పరిస్థితులను గురించి మార్క్స్ చాలా చెప్పాడు. మార్క్స్ అభిప్రాయాలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. ఇపుడు అది ఇంకా ఎక్కువ అయింది. మనదేశం ఉన్న పరిస్థితులలో మార్క్స్ భావాల ప్రాధాన్యత ఇంకా ఎక్కువ అయిందని నేను అభిప్రాయపడుతున్నాను. 1947లో రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధి చేయటం కోసం పాలకులు ప్రయత్నించారు. 1990 వరకు పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి అయిన తీరు ప్రత్యేకమైనది. అయితే అది భారతదేశానికి మాత్రమే కాక ప్రపంచంలో కూడా ప్రత్యేకమైనదే. మార్క్స్ రచనలు చేస్తున్న కాలంలో రాజ్యం పరిమితమైన పాత్ర నిర్వహించేంది. 1945 వరకు పెట్టుబడిదారీ విధానం యొక్క స్వచ్ఛమైన లక్షణాలతో, రాజ్యం ప్రమేయం లేకుండా, ఉన్నా అది పరిమితంగా ఉండేది. మొదటి ప్రపంచ యుద్ధం, ఆ తర్వాత గుత్త పెట్టుబడిదారి విధానం, సామ్రాజ్యవాదం అంతులేని యుద్ధాలను

ప్రపంచం మీద రుద్దింది. ఆఖరికి పెట్టుబడికే ప్రమాదం తెచ్చే పరిస్థితి ఉంది అని చెప్పి కీన్స్ రాజ్యం పాత్రను కొంత మార్చి, పెట్టుబడిదారీ విధానాన్ని ముందుకు తీసుకువెళ్ళటం కోసం కొత్త పద్ధతిని అనుస రించాలని చెప్పాడు. మనం దానిని కీనీషియనిజం అంటాం. 1945లో రెండవ ప్రపంచ యుద్ధం అంతం అయిన దగ్గర నుంచి అంతర్జాతీయంగా కొన్ని నియంత్రణలతో పెట్టుబడిదారీ విధానం కొనసాగటానికి కీనీషియనిజం తోడ్పడింది. 1990 వరకు ఆ విధంగా జరిగింది. 1980 నుంచి ప్రపంచంలో, 1990 నుంచి మనదేశంలో సరళీకరణ విధానాల పేరుతో కీన్స్ చెప్పిన విధానాలను పక్కనబెట్టి, ఏ విధమైన నియంత్రణలు లేకుండా, అంతర్జాతీయ పెట్టుబడి సంపూర్ణమైన స్వేచ్ఛతో వ్యవహరించే పద్ధతిలో ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దుతున్నారు. మార్క్స్ కాలంలో ఉన్న పరిస్థితి కూడా అదే. ఆ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కమ్యూనిస్టు ప్రణాళిక, ఇతర రచనల్లో మార్క్స్ పేర్కొన్న విషయాలు 1990కి ముందున్న భారతదేశ ఆర్థిక పరిస్థితుల కన్నా 90 తర్వాత పరిస్థితులను మరింత బాగా అర్థం చేసుకోవటానికి ఉపయోగపడతాయి. కమ్యూనిస్టు ప్రణాళిక చదువుతుంటే మన దేశ పరిస్థితులు అద్దం పట్టినట్లే కనిపిస్తాయి. ఆ రకంగా చూసినప్పుడు కమ్యూనిస్టు ప్రణాళికలోని అంశాలు, మార్క్స్ చెప్పిన భావాలకు ఎప్పుడూ లేనంత ప్రాధాన్యత ఉందని అర్థమవుతోంది.

**“ కమ్యూనిస్టు ప్రణాళిక, ఇతర రచనల్లో మార్క్స్ పేర్కొన్న విషయాలు 1990కి ముందున్న భారతదేశ ఆర్థిక పరిస్థితుల కన్నా 90 తర్వాత పరిస్థితులను మరింత బాగా అర్థం చేసుకోవటానికి ఉపయోగపడతాయి. కమ్యూనిస్టు ప్రణాళిక చదువుతుంటే మన దేశ పరిస్థితులు అద్దం పట్టినట్లే కనిపిస్తాయి. ఆ రకంగా చూసినప్పుడు కమ్యూనిస్టు ప్రణాళికలోని అంశాలు, మార్క్స్ చెప్పిన భావాలకు ఎప్పుడూ లేనంత ప్రాధాన్యత ఉందని అర్థమవుతోంది. ”**




పెట్టుబడిదారీ వర్గం తన దోపిడి కోసం, అదనపు విలువను రాబట్టుకోవడం కోసం ఉత్పత్తి శక్తులను ఇబ్బడి ముబ్బడిగా ఎలా పెంచుకుంటూ పోతుందో, తన లాభాల కోసం శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏ రకంగా ఉపయోగించుకుంటుందో కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్స్ చెప్పాడు. ఇప్పుడు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, సమాచార సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ, సమాచార విశ్లేషణ తదితరాలను చూస్తుంటే శాస్త్ర, సాంకేతికాభివృద్ధి శరవేగంగా ముందుకు పోతున్నదని మనం తెలుసుకోవచ్చు. ఈ విషయాన్ని మార్క్స్ ఆరోజే చెప్పాడు. అలాగే పెట్టుబడికి సంతృప్తి అనేది ఉండదు. దాని తృష్ణ తీరేది కాదు. లాభం దాహంతో పెట్టుబడి తహతహ లాడుతూ ఉంటుంది. ఆ దాహాన్ని తీర్చుకోవడానికి నిరంతరం ప్రయత్నం చేస్తూ ఉంటుంది. ప్రపంచంలో ప్రతి మూలా అది ఉంటుంది. ఎక్కడ రంధ్రం ఉంటే ఆ రంధ్రంలో చొరబడుతుంది. ఆ రంధ్రంలో చొరబడటం సాధ్యం కాకపోతే దానిని బద్దలు కొడుతుంది. ఆ రకంగా ప్రపంచం నలుమూలలకి అది చొచ్చుకుపోతుంది. అక్కడ పరిస్థితులను, సంబంధాలను తన రూపంలోకి తీర్చిదిద్దటానికి ప్రయత్నిస్తుందని మార్క్స్ కమ్యూనిస్టు ప్రణాళికలోచెప్పాడు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి అవుతున్న కొద్దీ ఉత్పత్తిని ముక్కలు చేసి, ప్రపంచం నలుమూలలకు ఎలా తీసుకుపోతుందో మనం చూస్తున్నాం. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడులు క్షణాలలో ఎక్కడికైనా వెళ్ళి తిరిగి క్షణాలలో వెనుదిరుగుతున్నాయి. ఇంతకు ముందు పెట్టుబడిదారీ సంబంధాలు విస్తరించటానికి అసాధ్యమైన ప్రాంతాలలో కూడా, గిరిజనులు, కొండలు, మారుమూల ప్రాంతాలలోకి కూడా పెట్టుబడిదారీ సంబంధాలు చొచ్చుకుపోయి, అంతకు ముందున్న సంబంధాలను, లావాదేవీలను ఎలా డబ్బు మయం చేస్తుందో, అక్కడి మనుషులను కూడా ప్రపంచ మార్కెట్‌లోకి ఎలా లాగుతుందో ఇప్పుడు మనం చూస్తున్నాం. మార్క్స్ దీనిని చాలా స్పష్టంగా చెప్పాడు. ఇంకో విషయం కూడా చెప్పాడు. ఇదేదో ప్రపంచమంతటా శాంతియుతంగా ప్రయాణం చేసి, సాధువులాగా తిరిగిరాదు. ఈ ప్రయాణంలో ఎక్కడ ఏది అడ్డంవస్తే దానిని బద్దలు కొట్టుకుపోవడం, నాశనం చేయడం చేస్తుంది. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లలో యుద్ధాలను చూసాం. ఇప్పుడు మళ్ళీ ఉక్రెయిన్, దక్షిణ చైనా సముద్రంలోనూ అమెరికా నాయకత్వాన సామ్రాజ్యవాదులు ఏ రకంగా యుద్ధానికి కాలుదువ్వుతున్నారో చూస్తున్నాం. ఆఫ్రికాలో అనేక అంతర్యుద్ధాలను చూస్తున్నాం. పెట్టుబడిదారీ విధానం తన లాభం కోసం యుద్ధాలతో మనుషులను చంపడానికి ఏ మాత్రం సందేహించదు.

కమ్యూనిస్టు ప్రణాళికలో ఆయన ఇంకో విషయం కూడా చెప్పాడు. పెట్టుబడి కార్మికులను ఒకరికి వ్యతిరేకంగా మరొకరిని పోటీ పెడుతుంది. కార్మికులను ఒకరికి వ్యతిరేకంగా మరొకరిని పోటి పెడితేనే పెట్టుబడిదారులకు వారి శ్రమ చౌకగా దొరుకుతుంది. కార్మికులు ఒకేచోట పనిచేస్తుం టారు, ఒకే యజమాని కింద పనిచేస్తుంటారు,

> **“ నిరుద్యోగ సైన్యం లేకపోతే కార్మికుల మధ్య పోటీ ఉండదు. అటువంటి పరిస్థితి పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రమాదకరంగా పరిణమిస్తుంది. తమ లాభం కోసం నిరుద్యోగుల సంఖ్య పెంచేందుకు, కార్మికుల మధ్య పోటీని తీవ్రం చేసేందుకు మహిళల్ని శ్రామికులుగా రంగంలోకి తీసుకువస్తున్నారు. అవసరమైనప్పుడు వాళ్ళని వినియోగించుకుంటారు. అవసరం లేనప్పుడు సులభంగా తొలగిస్తారు. ఈ రోజు రైతాంగాన్ని, వ్యవసాయాన్ని చిధ్రం చేసి, వారందరూ పట్టణాలకు వలస వచ్చేలా చేస్తున్నారు. ”**

సమస్యలు ఒకేరకంగా ఉంటాయి కాబట్టి సమిష్టిగా ఉండటం సహజ సిద్ధమైనదని అనుకుంటుంటారు. కాని పెట్టుబడి కార్మికుల మధ్య నిరంతరం పోటి పెడుతుంది. పోటీని పెంచుతూ వుంటుంది. ఆ రకంగా పోటీని పెంచితేనే శ్రామికులు చౌకగా దొరుకుతారు. కార్మికుల మధ్య పోటీలేకుండా, పరస్పరం సహకరించుకుంటూ ఉంటే తమ సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడిగా పోరాటం చేస్తారు. 1950-90 దశాబ్దాల వరకు ప్రపంచంలో కార్మికవర్గ ఐక్యత మెరుగుగానే ఉన్నది. సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత పెట్టుబడి కార్మికవర్గ ఐక్యతను సహించలేక పోయింది. కార్మికుల మధ్య పోటీ లేకపోతే పెట్టుబడి దోపిడీకి అవకాశాలు పరిమితమౌలాయి.

అందుకనే మార్క్స్ కాలంలో పెట్టుబడి ఏ రకంగా వ్యవహరించేదో అదే విధంగా, స్వచ్ఛంగా వ్యవహరిస్తూ, దోపిడిని తీవ్రం చేయటం ప్రారంభించింది. అందుకని కార్మికుల మధ్య రకరకాల అంతరాలను సృష్టించి, వారి మధ్య పోటీని పెంచి, వారి శ్రమను కారుచౌకగా దోపిడీ చేస్తున్నారు. శ్రామికుల మధ్య పోటీ పెరగాలంటే పని కోసం పోటీ పడేవాళ్ళు పెరగాలి. అందుకని ఎవరి పనిపోతే ఆ పనిలో చేరదామని ఎప్పుడూ కొంతమంది ఎదురుచూసే వాళ్ళు ఉండాలి. మార్క్స్ అంటువంటి వాళ్ళని నిరుద్యోగ సైన్యం అన్నాడు. నిరుద్యోగ సైన్యం లేకపోతే కార్మికుల మధ్య పోటీ ఉండదు. అటువంటి పరిస్థితి పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రమాదకరంగా పరిణమిస్తుంది. తమ లాభం కోసం నిరుద్యోగుల సంఖ్య పెంచేందుకు, కార్మికుల మధ్య పోటీని తీవ్రం చేసేందుకు మహిళల్ని శ్రామికులుగా రంగంలోకి తీసుకువస్తున్నారు. అవసరమైనప్పుడు వాళ్ళని వినియోగించుకుంటారు. అవసరం లేనప్పుడు సులభంగా తొలగిస్తారు. ఈ రోజు రైతాంగాన్ని, వ్యవసాయాన్ని చిధ్రం చేసి, వారందరూ పట్టణాలకు వలస వచ్చేలా చేస్తున్నారు. ఆ రకంగా ఎంత తక్కువ కూలి ఇచ్చినా, ఏ సౌకర్యాలు లేకపోయినా పని చేయటానికి సిద్ధపడుతూ, వేతనాలు తక్కువగా ఉండటానికి దోహదం చేస్తున్నారు. ఎక్కడెక్కడో పంటపొలాలలో పని చేసుకుంటున్న వారికి అక్కడ ఉపాధి పోగొట్టి, అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ఇళ్లనుంచి వెళ్ళ గొట్టి, వాళ్ళు పట్టణాలకు వలస వచ్చి పని చేయాల్సిన పరిస్థితి సృష్టిస్తున్నారు. ఆ రకంగా వాళ్ళు కూడా శ్రామిక సైన్యంలో చేరుతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో నిరుద్యోగం ఎంత తీవ్రంగా ఉందో మనకు కనపడదు. కాని కొన్ని సందర్భాలలో మనం స్పష్టంగా చూస్తాం. లాక్‌డౌన్ కాలంలో కోట్లాది మంది తాము వలస వచ్చిన ప్రాంతాల నుంచి రోడ్లమీద నడుస్తూ వెళ్ళటం హృదయ విదారకంగా ఉన్నది. పెట్టుబడిదారీ విధానం ప్రజలను ఏ రకంగా నిరుద్యోగ సైన్యంలోకి ఆకర్షిస్తుందో, పోటీని సృష్టించి వేతనాలను ఎలా తగ్గిస్తుందో మనం అర్థం చేసుకోవడానికి ఇటువంటి సంఘటనలు ఉపయోగపడతాయి. మార్క్స్ ఆరోజే కమ్యూనిస్టు ప్రణాళికలో ఈ సమస్యలను గురించి చెప్పాడు. ప్రిన్సిపుల్స్ ఆఫ్ కమ్యూనిజంలో ఏంగెల్స్ కూడా చెప్పాడు, సోషలిజం ఊహాజనితం, శాస్త్రీయంలో కూడా వాటి ప్రస్తావన ఉంది. అందువలన పెట్టుబడిదారీ విధానాన్ని, దాని విభిన్న రూపాలను మనం అర్థం చేసుకోడానికి ఈ పుస్తకాలు చాల ఉపయోగపడతాయని నేను మీ దృష్టికి తీసుకువస్తున్నాను.

ఇక చివరి విషయం ఏమిటంటే పెట్టుబడిదారీ విధానం దుర్మార్గమైనది. పీడిత ప్రజలందరినీ తీవ్రమైన సమస్యలలోకి నెడుతుంది. మార్క్స్, ఎంగెల్స్ రచనలను అధ్యయనం చేయటం ద్వారా వీటికి పరిష్కారం ఏమిటో అర్థం చేసుకోవలసి ఉంది. పెట్టుబడిదారీ విధానం అంతం అయితే ఈ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని మార్క్స్ చెప్పాడు. పెట్టుబడిదారీ విధానం అంతమై సోషలిజం, తర్వాత కమ్యూనిజంలోకి పరిణామం చెందితే ఈ సమస్యలన్ని పరిష్కారం అవుతాయని మార్క్స్ కన్నా ముందు ఎంతో మంది చెప్పారు. మార్క్స్ వాళ్ళని ఊహాజనిత సోషలిస్టులు అన్నాడు. సెయింట్ సైమన్, రాబర్ట్ ఒవెన్ అనేవారు చెప్పారు. వీళ్ళ కన్నా ముందు కొంత మంది సోషలిజం అనే పదాన్ని వాడారు. వాళ్ళు సోషలిజం గురించి చెప్పిన గొప్ప మేధావులు. వాళ్ళ రచనలన్నింటిని మార్క్స్ ఎంతో మెచ్చుకున్నాడు. వాళ్ళ కృషిని ప్రశంసించాడు.

అయితే మార్క్స్ పెట్టుబడిదారీ విధానాన్ని అధ్యయనం చేసిన తర్వాత వాళ్ళు చెప్పిన సోషలిజం ఊహజనితమైనదిగా ఉన్నది. అంటే సమాజం మంచిగా ఉండాలని చేప్పే గొప్ప వ్యక్తులు ఆ రకంగా ఊహించారు. కొన్ని ప్రయోగాలు కూడా చేశారు. కాని అటువంటి ఊహజనిత సోషలిజం వల్ల పెట్టుబడిదారీ విధానం నాశనం కాదు. గొప్ప వ్యక్తులు గొప్ప గొప్ప చర్యల వలన పెట్టుబడిదారీ విధానం నాశనం కాదు. దాని అంతర్గత వైరుధ్యాలు బద్ధలైనపుడు కార్మికవర్గం చైతన్య పూర్వకంగా దానిని కూలదోసి, ఒక కొత్త సమాజాన్ని నిర్మించాల్సి ఉంది. అప్పుడే సోషలిజం వస్తుంది అని చెప్పాడు. అకాశంలోనో లేకపోతే నిర్మానుష్యంగానో పెట్టుబడిదారీ విధానం నిర్మాణం కాదు. ఆ పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మించేది మనుషులు. అక్కడ యజమానులుగా ఉండేది, కార్మికులుగా పనిచేసేది మనుషులు. శ్రమ చేసే రైతులు, భూస్వాముల దగ్గర పనిచేసే కూలీలు, వృత్తిదారులు, అర్ధ బానిసలు ఉంటారు. వీళ్ళందరూ మనుషులు. ఈ మనుషులందరూ ఆర్థికవ్యవస్థలో వివిధ తరగతులుగా, వర్గాలుగా విడిపోయి ఉన్నారు. ఆ వర్గాలు, వాటి ప్రయోజనాలు ఒకే రకంగా ఉండవు. పరస్పర విరుద్ధంగా ఉంటాయి. పెట్టుబడిదారుడికి లాభం రావాలంటే శ్రామికుడిని దోచుకోవాలి. శ్రామికుడి దోపిడి తగ్గాలి అంటే పెట్టుబడిదారుల లాభం తగ్గాలి. శ్రమతో తాము తయారు చేసిన వస్తువుకి తాము దూరంగా ఉండే పరిస్థితి పోవాలంటే పెట్టుబడిదారీ విధానమే అంతమైపోవాలి. ఆ రకంగా వ్యక్తిగత ఆస్తి విధానమే

నాశనమైపోవాలి. సంపదంతా ప్రజలది, ఉత్పత్తి అంతా ప్రజలది, దాని నుంచి వచ్చే అదనపు ఉత్పత్తి అంతా ప్రజలది అనే భావం రావాలి. శ్రమతోనే సంపదను సృష్టించినప్పుడు శ్రమ చేసేవాడే సమాజంలో ఉన్నతంగా ఉండాలి. శ్రమ చేయని వాళ్ళు కూడా ఉంటారు. శ్రమచేసే శక్తి లేనివాళ్ళు, పసిపిల్లలు ఉంటారు. వాళ్ళని శ్రామికులుగా చేయలేము. అలాగే వయసు మళ్ళిన వారు ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొనలేరు. సహజ సిద్ధంగానే శారీరకంగా, మానసికంగా లోపాలతో ఉన్నవారు ఉంటారు. అటువంటి వాళ్ళు అన్ని కార్యకలాపాలలో పాల్గొనలేరు. అటువంటి వాళ్ళను శ్రమచేసే వ్యక్తులు పోషిస్తారు. కాని శ్రమ చేయగలిగి ఉండి, తాము శ్రమ చేయకుండా ఇతరులు చేసే శ్రమను స్వాధీనం చేసుకుని బ్రతికేవాళ్ళు సమాజంలో ఉండకూడదు. అటువంటి వ్యవస్థనే సోషలిజం అన్నారు. దీన్నే శాస్త్రీయ సోషలిజం అన్నారు. దోపిడి చేసేవాళ్ళు దోపిడీ చేయబడే వర్గాలు, ముఖ్యంగా కార్మికవర్గం – పెట్టుబడిదారుల మధ్య సంఘర్షణ ద్వారా ఈ మార్పు వస్తుంది. ఈ సంఘర్షణ నిరంతరం జరుగుతూ ఉంటుంది. కొన్నిసార్లు శాంతియుతంగా జరుగుతుంది. కొన్ని సందర్భాలలో భౌతికంగా సంఘర్షణ జరుగుతుంది. కాని నిరంతరం సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలన్నింటిపైనా, అన్ని రంగాలలోనూ ఈ సంఘర్షణ జరుగుతుందని మార్క్స్ చెప్పాడు. అందుకనే ఇప్పటి వరకు జరిగిన చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్ర అని కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పాడు. కాబట్టి దీనిని శాస్త్రీయ సోషలిజం అన్నాడు. సోషలిజం వచ్చిన తర్వాత సమాజం ఎలా ఉంటుంది అనేది ప్రిన్సిపుల్స్ ఆఫ్ కమ్యూనిజంలో ఏంగెల్స్ చెప్పాడు. సోషలిజం ఊహాజనితం, శాస్త్రీయంలో కూడా చెప్పాడు. శ్రమను బట్టి ఆర్థిక వ్యవస్థ నడవాలి అనేది కీలకం. అందుకని సోషలిజం, కమ్యూనిజం గురించిన నిర్వచనం క్లుప్తంగా శ్రమను తగిన ఫలితం వచ్చేది సోషలిజం, అవసరానికి అనుగుణంగా ఫలితం ఇచ్చేది కమ్యూనిజం అని చెప్పాడు. అంటే సోషలిజంలో ప్రతి వానికి అవసరమైనంత ఉత్పత్తి రాకపోవచ్చు. అందుకనే సోషలిజంలో శ్రమను బట్టి ఫలితం ఉంటుంది. సోషలిజంలో శ్రమ చేయగలిగే శక్తి ఉండి అవసరమైనంత శ్రమ చేయని వారుంటారు. కాని కమ్యూనిస్టు సమాజంలో ఉన్నత స్థాయి విలువలు వస్తాయి. అందుకని ఒళ్లు దాచుకొని శ్రమ చేయకుండా ఎవరూ ఉండరు. అందరూ శ్రమ చేస్తారు. శ్రమలో హెచ్చు తగ్గులు ఉండవచ్చు. భౌతిక పరిస్థితులను, అవసరాలను బట్టి పంపిణీ జరుగుతుంది. అవసరాలను బట్టి పంపిణీ చేయగలిగే ఉత్పత్తి సమాజంలో జరుగుతుంది. ఇది రేఖా మాత్రమే. సోషలిజం ఎలా ఉండాలి, కమ్యూనిజం ఎలా ఉంటుందో స్థూలమైన సైద్ధాంతిక విషయాలు రేఖామాత్రంగా చెప్పటం మినహా దానిని సంపూర్ణంగా పరిశీలించి, ఒక ప్రణాళిక రూపంలో మార్క్స్ ఏంగెల్స్‌లు చెప్పలేకపోయారు. ఆ తర్వాత సోవియట్ యూనియన్, చైనాలలోని పరిస్థితులను అధ్యయనం చేసి, కొత్త రూపాలను ఎంచుకొని సోషలిజం నిర్మాణం చేయాల్సివచ్చింది. లెనిన్ సారథ్యంలో సోవియట్ యూనియన్‌లో సోషలిజం నిర్మాణం జరిగి, 75 సంవత్సరాల పాటు కొనసాగింది. కాని మొదటి ప్రయోగంలో కొన్ని లోపాల వల్ల అక్కడ విఫలం అయ్యింది. మళ్లీ ఇప్పుడు చైనాలో కమ్యూనిస్టు పార్టీ సోషలిజం నిర్మాణాన్ని కొనసాగిస్తున్నది. ఇపుడు ప్రపంచంలో రెండవ ఆర్థిక వ్యవస్థగా ఉంది. మార్క్సిజం మార్గదర్శకత్వంలో, కార్మికవర్గ నాయకత్వంలో ముందుకు పోతామని వారు చెబుతున్నారు. ఆ రకంగా ఒక ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థను అక్కడ నిర్మిస్తున్నారు. అక్కడ కూడా సమస్యలు ఉన్నాయి. ఆర్థికవ్యవస్థలో మార్కెట్ పాత్ర నిర్వహించే పరిస్థితి అక్కడ కూడా కనబడుతున్నది. ప్రైవేటు శక్తులకు అవకాశం ఉంది. అయితే సోషలిజం ప్రారంభ దశలో ఉన్నాం కాబట్టి పాత వ్యవస్థలో నుంచి వచ్చిన కొన్ని అంశాలు ఇంకా కొనసాగుతున్నాయి.

> “ దోపిడి చేసేవాళ్ళు దోపిడీ చేయబడే వర్గాలు, ముఖ్యంగా కార్మికవర్గం - పెట్టుబడిదారుల మధ్య సంఘర్షణ ద్వారా ఈ మార్పు వస్తుంది. ఈ సంఘర్షణ నిరంతరం జరుగుతూ ఉంటుంది. కొన్నిసార్లు శాంతియుతంగా జరుగుతుంది. కొన్ని సందర్భాలలో భౌతికంగా సంఘర్షణ జరుగుతుంది. కాని నిరంతరం సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలన్నింటిపైనా, అన్ని రంగాలలోనూ ఈ సంఘర్షణ జరుగుతుందని మార్క్స్ చెప్పాడు. ”



రెడ్‌బుక్ డే సందర్భంగా విజయనగరం పట్టణంలో
కమ్యూనిస్టు ప్రణాళిక చదువుతున్న సిపిఐ(ఎం) సభ్యులు

మార్చి 28, 29 కార్మిక సమ్మె దిశగా

# రెండు రోజుల కార్మిక సమ్మె రాజకీయ ప్రాధాన్యత



రచయిత సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు

జె.ఎస్.మంజుదార్

ఆర్‌ఎస్‌ఎస్‌కి అనుబంధంగా ఉన్న బిఎంఎస్ తప్ప, మిగిలిన పది కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర జాతీయ ఫెడరేషన్లు 2021, నవంబర్‌లో న్యూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన సదస్సులో రెండు రోజుల సమ్మె పిలుపునిచ్చాయి. 2022లో పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో రెండు రోజుల సమ్మె చేయాలని నిర్ణయించాయి. రాజకీయ కారణాల రీత్యా ఈ సమ్మె ప్రాధాన్యత సంతరించుకుంది.

**కార్మిక-కర్షక ఐక్య కార్యాచరణ**

ఈ సమ్మె కార్మిక, కర్షకుల ఐక్య పోరాటానికి కొనసాగింపు. మూడు రైతాంగ వ్యతిరేక చట్టాలను వెనక్కు తీసుకోవాలని, కనీస మద్దతు ధరకి చట్టరూపం కల్పించాలని, విద్యుత్ సవరణ బిల్లు, నాలుగు లేబర్ కోడ్‌ల రూపంలో కార్మికుల హక్కులపై జరుగుతున్న దాడి, దేశంలో పెరుగుతున్న ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలు, భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలపై చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనల కొనసాగింపు ఈ సమ్మె. మూడు వ్యవసాయ నల్లచట్టాలు, వ్యవసాయ భూములు, మొత్తం వ్యవసాయ ఉత్పత్తికి సంబంధించినవి కాగా, నాలుగు లేబర్ కోడ్‌లు, వాటిని బలపరిచేందుకు చేసిన అత్యవసర సైనిక సేవల చట్టం కార్మికుల ఉమ్మడి బేరసారాల హక్కును హరిస్తాయి. సమ్మెతో సహా అన్ని రకాల ఐక్య కార్యాచరణ హక్కులను హరించడానికి, పని గంటలను ఏకపక్షంగా పెంచడానికి, పని పరిస్థితులు భరించలేని విధంగా మారినా వ్యతిరేకించకుండా ఉండడానికి, ప్రైవేటు కార్పొరేట్ల దయపై కార్మికులు ఆధారపడాలని, మొత్తం కార్మికవర్గ హక్కులను కాలరాయాలనే లక్ష్యంతో ఈ చట్టాలు చేశారు.

గతంలో 2020, నవంబర్ 26వ తేదీన దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె జరిగింది. అదే రోజు రైతులు పార్లమెంటుకు ప్రదర్శనగా వెళ్లారు. రైతాంగం ఢిల్లీ సరిహద్దులలో ఆరు చోట్ల నిరవధికంగా ఆందోళనకు పూనుకోవటంతో ఇది ఒక చారిత్రాత్మక ఘటనగా మారింది. బిజెపి పాలనలోని హర్యానా ప్రభుత్వ పోలీసులు, మోడీ అధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ సరిహద్దులలో నిరసన తెలుపుతున్న రైతాంగంపై పాశవిక దాడులకు పాల్పడ్డారు. పార్లమెంటు వద్ద శాంతియుతంగా నిరసన తెలియచేసేందుకు వారికి ఉన్న హక్కును అప్రజాస్వామ్యంగా అడ్డుకుంది.

ఆ తరువాతి కాలంలో కేంద్ర కార్మికసంఘాలు (సిటియులు), సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) కలిసి దేశవ్యాప్తంగా కార్మిక-కర్షక ఐక్య కార్యాచరణను కొనసాగించాయి. యువకులు, విద్యార్థులు, మహిళలు, వృత్తిదారులు, చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వారు తదితర అనేక తరగతులు ఈ ప్రతిఘటనలలో పాల్గొన్నారు. రైతాంగం మహాపాదయాత్రలు, ట్రాక్టర్ ర్యాలీలు, కార్మికవర్గ ప్రదర్శనలు, అనేక చోట్ల ఐక్యకార్యాచరణ, స్వతంత్ర కార్యాచరణ రూపాలలో, కొన్నిచోట పరిశ్రమల వారీగా కార్యాచరణ, సమ్మెలు జరిగాయి. ఆ తర్వాత దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె జరిగింది.

**ఈ కార్మిక-కర్షక ఐక్య కార్యాచరణలో అనేక మూల మలుపులు ఉన్నాయి అందులో ప్రధానమైనవి:**

- *2021 ఫిబ్రవరి 3న దేశవ్యాప్తంగా కార్మికుల నిరసనలు, లేబర్ కోడ్‌ల దగ్ధం,*
- *2021 మార్చి నెల 15-18 తేదీల మధ్య ద్రవ్యరంగంలో - బ్యాంకులలో 15,16 తేదీలలో, ఎల్ఐసిలో 18వ తేదీన- ఉద్యోగులు, అధికారులు దేశవ్యాప్తంగా సమ్మె చేశారు.*
- *2021 మే 26న కార్మికులు-కర్షకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలియచేశారు:*
- *2021 జులై 23న ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, సైనిక సేవల ఆర్డినెన్సుకి వ్యతిరేకంగా కార్మికుల దేశవ్యాప్త నిరసనలు :*
- *2021 ఆగస్టు 9న "భారత దేశాన్ని రక్షించు" నినాదంతో కార్మికులు, కర్షకులు ఆందోళన చేయడం:*
- *2021 సెప్టెంబర్ 5: ముజఫర్ నగర్ మహాపంచాయత్‌లో మత సమైక్యత కోసం రైతాంగం చారిత్రాత్మక పిలుపునిచ్చింది. బిజెపి ప్రభుత్వాలను పదవి నుంచి తొలగించటం కోసం మిషన్ ఉత్తరప్రదేశ్, మిషన్ ఉత్తరాఖండ్ పిలుపునిచ్చారు.*
- *2021 సెప్టెంబర్ 27:, కార్మిక-కర్షకులు భారత్ బంద్‌కి పిలుపు ఇచ్చారు.*
- *2022బడ్జెట్ సమావేశాల సందర్భంగా రెండు రోజుల సమ్మెకు నవంబర్ 3న సిటియుల పిలుపు.*

పరిశ్రమల వారీగా వరుస క్రమంలో ఇప్పటికే అనేక సమ్మెలు జరుగుతున్నాయి. డిసెంబర్ 2వ తేదీన నిర్మాణ రంగంలోని కార్మికులు లక్షలాది మంది సమ్మె చేసారు. డిసెంబర్ 16న పోర్టులలో పనిచేసే కార్మికులు సమ్మె చేసారు. జాతీయకరణ సవరణ బిల్లుకి వ్యతిరేకంగా డిసెంబర్ 16,17 తేదీలలో బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేసారు. అలాగే విద్యుత్ ఉద్యోగులు విద్యుత్ సవరణ బిల్లుకి వ్యతిరేకంగా సమ్మెకు కార్యాచరణ రూపొందించుకుంటున్నారు. అనేక ప్రైవేటు రంగ పరిశ్రమలలోని కార్మికులు కూడా పోరాటాలకు దిగుతున్నారు.

**మోడీ ప్రభుత్వం, కార్పొరేట్‌ల తాత్కాలిక వెనకడుగు**

ఇన్ని రకాల నిరసనలు వెల్లువెత్తడంతో

మోడీ ప్రభుత్వం తాత్కాలికంగా వెనకడుగు వేసింది. అయినప్పటికీ కార్మికులు, కర్షకులతో పాటు ప్రజలందరిపై మతతత్వ దాడుల దూకుడును మరింత పెంచేందుకు బిజెపి ప్రభుత్వం, కార్పొరేట్లు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు.

**❝ దోపిడి చేసేవాళ్ళు దోపిడీ చేయబడే వర్గాలు, ముఖ్యంగా కార్మికవర్గం - పెట్టుబడిదారుల మధ్య సంఘర్షణ ద్వారా ఈ మార్పు వస్తుంది. ఈ సంఘర్షణ నిరంతరం జరుగుతూ ఉంటుంది. కొన్నిసార్లు శాంతియుతంగా జరుగుతుంది. కొన్ని సందర్భాలలో భౌతికంగా సంఘర్షణ జరుగుతుంది. కాని నిరంతరం సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలన్నింటిపైనా, అన్ని రంగాలలోనూ ఈ సంఘర్షణ జరుగుతుందని మార్క్స్ చెప్పాడు. ❞**

ఈ కొత్త చట్టా లేవీ అమలు కాకపోయినా, దేశ ఆర్థికవ్యవస్థ నానాటికి దిగజారుతున్నా, ప్రైవేటు కార్పొరేట్ల లాభాలు మరింత వేగంగా పెరుగుతున్నాయి. ఆ భారమంతా ప్రజలపై పడుతున్నది. ఆక్సఫామ్ నివేదిక ప్రకారం భారత శతకోటీశ్వరుల సంపద 35 శాతం పెరిగింది. వారి సంపద మూడు లక్షల కోట్ల రూపాయలు పెరిగింది. లాక్‌డౌన్ కాలంలో గంటకు 90 కోట్ల రూపాయల చొప్పున సంపద పోగుచేసుకున్న ముఖేశ్ అంబానీ భారతదేశం, ఆసియాలో అత్యంత ధనికుడిగా ఎదిగాడు. లాక్ డౌన్ కాలంలోనే భారతదేశంలో లక్షలాది మంది ప్రజా ఆరోగ్య సేవలు అందుబాటులో లేక కోవిద్ మహమ్మారి బారినపడి చనిపోయారు. అనేక మంది వలస కూలీలు ఇళ్లకు వెళుతూ దురదృష్టకర పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఉద్యోగాలు ఊడాయి. అనియత కార్మికుల ఆదాయాలు 80 శాతం దిగజారాయి. దిగువస్థాయిలోని 25 శాతం ప్రజల కుటుంబ అప్పులు నాలుగు రెట్లు పెరిగాయి అని అజీమ్ ప్రేమజీ విశ్వవిద్యాలయం అధ్యయనంలో వెల్లడైంది.

2021, మార్చి 31వ తేదీన కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ల అమలును తాత్కాలికంగా నిలిపి ఉంచింది. నిజానికి అవి 2021 ఏప్రిల్ 1వ తేదీ నుండి అమలు జరగవలసి ఉంది. ఏడాది పాటు పార్లమెంటు ముందున్న భూసేకరణ ఆర్డినెన్సుపై ఉగిసలాడిన మోడీ ప్రభుత్వం, ఆఖరికి బీహార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని 2015 ఆగస్టులో ప్రతిపాదిత ఆర్డినెన్స్‌కు కాలం చెల్లిపోయేలా చేసింది. ఇప్పుడు మూడు నల్ల చట్టాలకు అదే గతి పట్టబోతున్నది. ఏడాది పాటు సుదీర్ఘంగా, నిరంతరాయంగా ఢిల్లీ సరిహద్దులలో కొనసాగిన చారిత్రక రైతాంగ పోరాట ఫలితమిది. 2021, నవంబర్ 19వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీ వ్యవసాయ చట్టాలను వెనక్కు తీసుకుంటున్నట్టు ప్రకటించారు. ఇప్పుడు జరుగుతున్న పార్లమెంటు సమావేశాలలో వెనక్కు తీసుకునే ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంది.

### సమ్మె రాజకీయ ప్రాధాన్యత

మోడీ ప్రభుత్వం తన విధానాలను మార్చుకున్నదనడానికి ఈ చట్టాలను వెన్నక్కు తీసుకోవడం సంకేతం కానే కాదు. యోగి ప్రభుత్వం పాలిస్తున్న కీలకమైన ఉత్తర్‌ప్రదేశ్‌తో సహా ఇతర రాష్ట్రాలలో బిజెపి ఎన్నికలను ఎదుర్కొంటున్నందు వలన, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ నుండి ప్రతిఘటన ఎదురౌతున్నందు వలన, ఈ మధ్యనే పదవీ చ్యుతుడైన మాజీ ముఖ్య మంత్రి కెప్టెన్ అమరిందర్ సింగ్‌తో లాలూచి పడి పంజాబ్ ఎన్నికలను ఎదుర్కోవలసి రావడం వలన, తప్పనిసరి పరిస్థితులలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు 2024లో జరుగనున్న పార్లమెంటు ఎన్నికలలో బిజెపి గెలుపుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. క్రితం సారి ఎన్నికలలో ఘనవిజయం సాధించిన పశ్చిమ యుపిలో బిజెపి ఇప్పుడు సంకట స్థితిలో ఉంది. రైతాంగం అంతా ఎదురు తిరుగుతున్నారు. వ్యవసాయ చట్టాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఢిల్లీ సరిహద్దులోని ఘజియాబాద్‌లో ఏడాదికి పైగా ఉండి, 2021 సెప్టెంబర్ 5వ తేదీన ముజఫర్‌నగర్ వరకు మహా పాదయాత్రను, నవంబర్ 22న లక్నో మహాపాదయాత్రను నిర్వహించిన రైతులు బిజెపి పాలన పట్ల తమ ఆగ్రహాన్ని వ్యక్త పరుస్తున్నారు.

సెప్టెంబర్ 5న ముజఫర్ నగర్‌లో జరిగిన రైతాంగ ర్యాలీ ఒక చారిత్రాత్మక ఘట్టం. అశేష జనవాహినితో ముజఫర్‌నగర్ జన సంద్రంగా మారి, నగరమంతా సభాప్రాంగణంగా మారడమేకాక, కర్షక ఉద్యమ ఐక్యతను చాటి చెప్పింది. ఈ రైతాంగ ర్యాలి అనేక ఇతర అంశాలను కూడా ముందుకు తెచ్చింది. ముజఫర్ నగర్ మతతత్వ భావనలకు, మత విభజనకు కేంద్రంగా ఉండేదని మనం గుర్తుంచుకోవాలి. 2013లో అక్కడ మత ఘర్షణలు కూడా జరిగాయి. 2014లో కేంద్రంలో, 2017లో యుపిలో బిజెపి అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం అదే. సెప్టెంబర్ 5న ముజఫర్ నగర్‌లో జరిగిన ర్యాలీ మత సమైక్యతను చాటి చెప్పింది– హిందువులు, ముస్లిముల మధ్య, అంటరానివారు, వెనుకబడిన తరగతుల వారు, ఉన్నత తరగతులకు చెందిన వారితో పాటు అన్ని కులాల మధ్య ఐక్యతను చాటి చెప్పింది.

ముజఫర్‌నగర్ ర్యాలీకి కిసాన్ మజ్దూర్ మహాపాదయాత్రగా నామకరణం చేసారు. అంటే అది కార్మికుల, కర్షకుల వర్గ ఐక్యతకు ప్రత్యేక స్థానం కల్పించింది. రైతుల సమస్యలనేకాక లేబర్ కోడ్‌లు, కార్మికుల హక్కుల పై దాడులు, వరుస జాతీయ ద్రవ్యీకరణ (నేషనల్ మోనిటైజేషన్ స్కీం ద్వారా పెద్ద ఎత్తున జరుగుతున్న ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ), పెరుగుతున్న ధరల సమస్యలను ఎత్తి చూపింది. బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపే కార్యక్రమం యుపి నుండే ప్రారంభం కావాలన్న రాజకీయ నినాదాన్ని కూడా ఇదే వేదిక నుండి ఇచ్చారు.

ఎస్‌కెఎం ముజఫర్ నగర్ ర్యాలీ మిషన్ ఉత్తరప్రదేశ్, మిషన్ ఉత్తరాఖండ్ ద్వారా యుపి, ఉత్తరాఖండ్‌లలో బిజెపిని గద్దె దించాలని రైతాంగాని పిలుపునిచ్చింది. ఆ విధంగా హిందీ రాష్ట్రాల మూల స్థంభాలుగా చెప్పుకునే రెండు రాష్ట్రాలలో రాజకీయ ప్రాధాన్యత గలిగిన కార్యాచరణకు నాంది పలికింది.

విచ్ఛిన్నకర కార్యక్రమంతో ఉన్న కుల, మతశక్తులు ఈ రాష్ట్రాల ఎన్నికలలో ప్రధానపాత్ర పోషిస్తాయి. మొదటిసారిగా వర్గ ప్రయోజనాలు, సమస్యలపై శక్తివంతంగా ప్రచారం చేయటం జరిగింది. కులాల, మతాల సామాజిక శక్తుల ప్రభావాలను తక్కువగా అంచనా వేయకుండానే మిషన్ యుపి, మిషన్ ఉత్తరాఖండ్‌లను బలమైన ప్రతిఘటనా శక్తిగా పరిగణించవచ్చు.

అందువలన యుపి, పంజాబ్, ఎన్నికలు జరుగుతున్న ఇతర రాష్ట్రాలతో సహా అన్ని రాష్ట్రాలలోనూ కార్మికుల రెండురోజుల సార్వత్రిక సమ్మెకు రాజకీయ ప్రాధాన్యత ఉన్నది. మూడు వ్యవసాయ నల్ల చట్టాలు వెనక్కుతీసుకోవటం, రైతాంగ ఉద్యమం విజయం సాధించిన నేపథ్యంలో ఈ రెండు రోజుల సమ్మె కార్మికవర్గంలో ఉత్తేజ్జాన్ని నింపుతుంది. ❋

సర్వే

# గ్రామీణ వ్యవసాయేతర కార్మికవర్గం నమూనా సర్వే

**ఎస్ వీరయ్య**



రచయిత సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు

గ్రామీణ వ్యవసాయేతర కార్మికవర్గం గురించి తెలంగాణలో నమూనా సర్వే చేయడం జరిగింది. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, నిజామాబాద్, నారాయణపేట్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలో, ఒక్కొక్క జిల్లాలో ఒక గ్రామం చొప్పున, ఎంపిక చేసిన 16 చిన్న గ్రామాలలో సర్వే జరిగింది. కాశిపూర్, దేవులపల్లి, రాంసాగర్, అంబర్, క్యాతన్‌పల్లి సాధారణ గ్రామాలు కాగా అంజుబాక నూరుశాతం ఆదివాసీ గిరిజన గ్రామం.

రెండు రకాల ప్రశ్నావళులు తయారు చేసాం. మొదటి ప్రశ్నావళి వృత్తులు, వ్యవసాయం వదిలి వ్యవసాయేతర ఉపాధిమార్గాలు ఎంచుకుంటున్న వయోజనుల సంఖ్య, ఏయే ఉపాధి మార్గంలో ఎంతమంది ఉన్నారో తేల్చడానికి తోడ్పడుతుంది. రెండవ ప్రశ్నావళి వివిధ రకాల వ్యవసాయేతర కుటుంబాల ఆదాయాలు, ఖర్చులు, ఆర్థిక, సామాజిక మార్పులు అధ్యయనం చేయడానికి అవసరమైన సమాచార సేకరణ కోసం రూపొందించాం. ముఖ్యమైన కామ్రేడ్స్‌నే ఈ సర్వే కోసం కేటాయించారు. ముందుగా ఆయా గ్రామాలకు కేటాయించిన బాధ్యులతో వర్క్‌షాప్ నిర్వహించాం. వారి సూచనల మేరకు ప్రశ్నావళులను మరింత పరిపుష్టం చేసాము.

ఈ కామ్రేడ్స్ తమకు కేటాయించిన గ్రామంలో, అంగన్వాడీ, ఆషా, గ్రామపంచాయితీ, గ్రామసేవకులు వంటి (సమాచారం ఇవ్వగల్గిన) వారితో సమావేశమై మొదటి ప్రశ్నావళికి సమాధానాలు సేకరించారు. ఈ సమాచారం ఆధారంగా ఎంపిక చేసిన కార్మికులతో ఒక్కొక్కరితో చర్చించటం ద్వారా రెండవ ప్రశ్నావళికి సమాచారం సేకరించారు. ఒక్కొక్కరితో 45 ని॥ నుంచి గంట సమయం పట్టింది. ముందురోజు సాయంత్రమే గ్రామానికి చేరుకుని, వ్యవసాయేతర కార్మికుల ఇండ్లలో బస చేసాం. వారి కుటుంబ పరిస్థితులు మరింత దగ్గరగా పరిశీలించేందుకు ఇది తోడ్పడింది. ఈ పద్ధతుల్లో సేకరించే సమాచారం గ్రామీణ వ్యవసాయేతర కార్మిక వర్గం సంఖ్య, ఏయే రంగాలలో ఎంతమంది ఉన్నారన్న వివరాలు, వారి సమస్యల గురించి అధ్యయనం చేయడానికి తోడ్పడుతున్నది. వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులను అంచనా వేయడానికీ, నిర్దిష్ట నినాదాలు రూపొందించడానికీ, సంఘటితం చేయడానికి ఉన్న అవకాశాలను అన్వేషించాడానికి తోడ్పడుతుంది. పార్టీ కేంద్ర కమిటీ ఇచ్చిన కర్తవ్య సాధనకు ఇది చాలా అవసరం. అంతేకాకుండా ఉత్సాహం ఉన్న కార్యకర్తలు అనేక రూపాల్లో లోతైన అధ్యయనం చేయడానికి, పరిశోధనాత్మక కృషికి కూడా ఈ సమాచారం తోడ్పడుతుంది. ఈ ఆరు గ్రామాల సర్వే అనుభవాల ఆధారంగా ప్రశ్నావళిలో కొన్ని మార్పులు చేసుకుంటే మరింత నిర్దిష్ట సమాచారం వస్తుంది. వీటన్నింటికీ మించి, సర్వేలో పాల్గొని, సమాచారం విశ్లేషించే నాయకులకు, కార్యకర్తలకు గతితార్కిక పద్ధతి పట్ల అవగాహన పెరుగుతుంది. నాయకత్వ లక్షణాలు బలపడతాయి. ప్రజలతో ప్రత్యక్ష సంబంధం ఏర్పడుతుంది. ప్రజల నాడి అర్థమవుతుంది.

ఈ గ్రామాలలో 74 ట్రాక్టర్లున్నాయి. వ్యవసాయరంగంలో ట్రాక్టర్ల వినియోగం పెరుగుదలను ఇవి సూచిస్తున్నాయి. హమాలీల సంఖ్య 116 ఉన్నది. కేంద్రప్రభుత్వ విధానాల నేపథ్యంలో ఐకేపీ కేంద్రాలు ఎత్తివేస్తే వీరికి పని తగ్గవచ్చు. లేదా కొత్త సమస్యలు తలెత్తవచ్చు. నిర్మాణ రంగంలో కార్మికుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. ఆరు గ్రామాల్లోనే 304 మంది ఉన్నారు. ట్రాక్టర్లు, మోటార్ వైండింగ్, హార్వెస్టర్ వర్కర్ల సంఖ్య 88 ఉన్నది. రైతులు, వ్యవసాయేతర కార్మికులు దాదాపు అందరూ ఉపాధి పనులకు పోతున్నారు. అత్యధికులు కుటుంబ పోషణ కోసం ఏడాదిలో మూడు, నాలుగు రకాల పనులకు పోతున్నారు. అంటే ఒకే వ్యక్తి అనేక రకాల పనులు చేస్తాడు. లేకుంటే కుటుంబం గడవదు. ఏడాది పొడవునా, రోజూ పని దొరుకుతుందన్న గ్యారంటీ లేదు. నిరంతరం అస్థిరత్వం వెంటాడుతున్నది. స్త్రీ, పురుషుల మధ్య వేతన వ్యత్యాసాలున్నాయి. ఉపాధి కార్మికులు, రాష్ట్ర వ్యాపిత రంగాలు మినహాయిస్తే దేవులపల్లిలో 248 మంది, రాంసాగర్‌లో 202 మంది, అంబంలో 587 మంది, కాశిపూర్లో 127 మంది, క్యాతన్‌పల్లిలో 313 మంది, అంజుబాకలో 190 మంది వ్యవసాయేతర కార్మికులున్నారు.

ఎంత చిన్న గ్రామమైనా 30 రంగాలకు పైనే ఉన్నారు. కొంచెం పెద్ద గ్రామమైతే వంద రంగాలు దాటుతున్నాయి. గ్రామం సైజును బట్టీ, అభివృద్ధి మోతాదును బట్టీ ఒక్కొక్క రంగంలో కార్మికుల సంఖ్య పెరుగుతున్నది. వ్యవసాయేతర గ్రామీణ కార్మికులలో గణనీయమైన సంఖ్యలో స్వయం ఉపాధి కార్మికులున్నారు. టైలరింగ్ వర్కర్స్ సంఖ్య గణనీయంగా పెరిగింది. కానీ వీరంతా స్వయం ఉపాధి కార్మికులే. స్నేహ వంటి కంపెనీలతో ఒప్పందం ద్వారా కమీషన్ పద్ధతిలో పౌల్ట్రీ ఫారాలు వస్తున్నాయి.

గ్రామాలకు ఫిల్టర్ వాటర్ వినియోగం విస్తరించింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా విస్తరించింది. దాదాపు మోటారు సైకిల్ లేని కుటుంబం లేదు. అత్యధిక కుటుంబాలలో కలర్ టీవీ, వంటగ్యాస్ వాడకం ఉన్నది.

రెండు లేదా మూడు సెల్‌ఫోన్లు ఉన్నాయి. వాటిలో కనీసం ఒకటి స్మార్ట్ ఫోన్. మాంసాహారం, కూరగాయలు, పండ్ల ఖర్చు పెరిగింది. పాలు వాడకం మాత్రం పెద్దగా పెరగలేదు. జొన్నలు, సజ్జల స్థానంలో బియ్యం వాడకం బాగా పెరిగింది. ఇండ్లు ఇరుకు గదులతో, చిన్న చిన్నవి ఎక్కువ. అప్పులేని కుటుంబం లేదు. కూల్‌డ్రింక్స్, బిస్కెట్లు, బేకరీ ఫుడ్ వాడకం కూడా పెరిగింది. కుటుంబ ఖర్చులో విద్య, వైద్యం ఖర్చు పెద్దది. కుటుంబాలలో పురుషులలో మద్యం వాడకం పెరిగింది. అత్యధిక కుటుంబాలలో ఇదొక ముఖ్యమైన ఖర్చుగానే ఉన్నది. కుటుంబం గడవడానికి అనేక పనులు చేయవల్సి వస్తున్నందువల్ల రైతు బంధు, పించన్లు ఆసరా అవుతున్నాయి.

> **కార్యక్రమాల అవసరం పెరిగింది. గ్రామాలకు, మండలాలకు, ప్రాంతాలకు మధ్య వ్యత్యాసాలుంటాయి. రాష్ట్రంలోని అన్ని గ్రామాలు లేదా అన్ని మండలాలలో ఎంపిక చేసిన గ్రామాలు, సాధ్యమైనంతవరకు ఎక్కువ గ్రామాలలో సర్వే చేయటం ద్వారా నిర్దిష్ట చర్యలు చేపట్టవచ్చు. ఇది ఫలితం ఇవ్వాలంటే కేవలం రాష్ట్ర, జిల్లా నాయకులకు పరిమితం కాకుండా ఎక్కువమంది కార్యకర్తలు క్షేత్రస్థాయి సర్వేలో పాల్గొనటం, అధ్యయనం చేయటం అవసరం.**

అంజుబాక గ్రామం పూర్తిగా ఆదివాసీలు స్థిరపడటం ద్వారా ఏర్పడ్డది. ఇతర ఆదివాసీ ప్రాంతాలతో పోల్చితే కొద్దిగా అభివృద్ధి చెందిన గ్రామం. అయినా వారి అమాయకత్వం, నిష్కల్మషత్వం అనేక రూపాల్లో కనిపిస్తుంది. ఎవరూ క్రాప్ లోన్ సౌకర్యం వాడుకోలేదు. మాఫీ అవుతుందన్న అలోచనతో ఇతర గ్రామాలలో అందరూ ఉపయోగించుకుంటున్నారు. అంజుబాకలో కుటుంబాలలో ఉన్నదానితో సర్దుకునే ధోరణి ఎక్కువ. అప్పులు చేయడానికి అత్యధికులు సిద్ధపడలేదు. అప్పులు లేకపోవటం ఒక ముఖ్యమైన అంశం. దాదాపు ప్రతి ఇంటికీ ఒకటో రెండో తాడిచెట్లున్నాయి. వారే గీసుకొని తాగుతారు.

బీడీ, హమాలీ, నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికులు వంటి రంగాలను మండల స్థాయిలో సంఘటితం చేయాలి. ఇవి ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయిలో మనం కృషి చేస్తున్న రంగాలు. మిగిలిన కార్మికులు ఒక్కొక్క రంగంలో చూస్తే అతి తక్కువగా, ఒకరిద్దరు చొప్పునే ఉన్నారు. వీరందరి పని స్వభావం గానీ, పని పరిస్థితులుగానీ, సమస్యలుగానీ పూర్తిగా భిన్నమైనవి. అనేక రంగాల శ్రామికులలో 'కార్మికులు-యజమాని' సంబంధం కూడా లేదు. వీరందరినీ కలిపి ఒక యూనియన్‌గా సంఘటితం చేయటం సాధ్యపడకపోవచ్చు. జిల్లా, రాష్ట్ర స్థాయిలలో క్యాంపెయిన్స్, సంఘటితం చేసే కృషి అంతగా ఫలితం ఇవ్వదు.

దాదాపు అన్ని రంగాలకు హెల్త్, జీవిత బీమా ఒక ముఖ్యమైన సమస్యగా ఉన్నది. స్వయం ఉపాధి రంగాల కార్మికులందరికీ ప్రభుత్వం నుంచి అప్పు డిమాండు బలంగా ఉన్నది. దేవులపల్లి అడ్డాకూలీలకు బస్‌పాస్ సౌకర్యం డిమాండ్ చేయవచ్చు. రేషన్ షాపుల ద్వారా నిత్య జీవితావసర సరుకుల సరఫరా కూడా ముఖ్యమైన డిమాండు అవుతుంది. రాష్ట్రమంతా ఈ సర్వే చేస్తే మరింత నిర్దిష్టంగా నినాదాలు రూపొందించే అవకాశం ఉంటుంది. సాధారణ డిమాండ్లకే పరిమితం కాకుండా, కొన్ని గ్రామాలకు, మండలాలకు, ప్రాంతాలకు నిర్దిష్టమైన సమస్యలు కూడా ఉండవచ్చు. ప్రభుత్వాన్ని డిమాండ్ చేయటం, సంఘటితం చేసి ప్రభుత్వం మీద వత్తిడి చేయటం వరకే పరిమితం కాకూడదు. సహకార పద్ధతుల్లో కూడా వీరిని సంఘటితం చేసి ప్రత్యామ్నాయ నమూనాలు నిర్మించవచ్చు. కంప్యూటర్ సెంటర్లు, కుట్టుమిషన్లు, కంప్యూటర్ శిక్షణా కేంద్రాలు, వైద్య సదుపాయాల వంటి సేవా కార్యక్రమాలు కూడా ప్రారంభించవచ్చు.

విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణ వల్ల సేవా కార్యక్రమాల అవసరం పెరిగింది. గ్రామాలకు, మండలాలకు, ప్రాంతాలకు మధ్య వ్యత్యాసాలుంటాయి. రాష్ట్రంలోని అన్ని గ్రామాలు లేదా అన్ని మండలాలలో ఎంపిక చేసిన గ్రామాలు, సాధ్యమైనంతవరకు ఎక్కువ గ్రామాలలో సర్వే చేయటం ద్వారా నిర్దిష్ట చర్యలు చేపట్టవచ్చు. ఇది ఫలితం ఇవ్వాలంటే కేవలం రాష్ట్ర, జిల్లా నాయకులకు పరిమితం కాకుండా ఎక్కువమంది కార్యకర్తలు క్షేత్రస్థాయి సర్వేలో పాల్గొనటం, అధ్యయనం చేయటం అవసరం. ※


**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

చరిత్ర

# అలెగ్జాండర్ దండయాత్ర

ఎంవిఎస్ శర్మ



రచయిత ............

టర్కీ కి పశ్చిమాన ఉన్న ఆసియా ప్రాంతాన్ని అయోనియా అని పిలిచేవారు. ఆ ప్రాంతంలో గ్రీకు ప్రజలు నివసించారు. దానికి ఆనుకునివున్న యూరప్ ప్రాంతంలో కూడా గ్రీకు ప్రజలు ఉండేవారు. క్రీ.పూ. 5, 4 శతాబ్దాలలో గ్రీకు నాగరికత వికాసం ఉన్నత స్థాయిలో ఉండేది. గ్రీకు తత్వ శాస్త్రం, చరిత్ర, వారి నాటక కళ మానవజాతి సాధించిన విజయాలలో ప్రముఖస్థానాన్ని కలిగివున్నాయి. గ్రీకు సమాజంలో ఆ కాలంలో పెద్ద సంఖ్యలో బానిసలు ఉండేవారు. పలు చిన్న చిన్న బానిస రాజ్యాలుగా చీలివుండి నిరంతరం యుద్ధాలలో, కలహాలలో మునిగితేలుతూ ఉండేవారు.

ఇరాన్ కేంద్రంగా మహాసామ్రాజ్యాన్ని నిర్మించిన అకెమినిడ్ అయోనియా ప్రాంతాన్నంతటినీ తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. గ్రీసు ఉత్తరభాగంలో క్రీ.పూ. 359–336 మధ్యకాలంలో అధికారంలో ఉన్న ఫిలిప్ –2 ఒక కొత్త తరహాలో(ఆనాటికి) తన సైన్యాన్ని అభివృద్ధి చేశాడు. డాలులు ధరించి పొడవాటి ఈటెలతో యుద్ధం చేసే విధంగా సైనికులకు శిక్షణనిచ్చాడు. ఆ సైనికులంతా ఒకరిని ఆనుకుని ఒకరు పక్కపక్కనే నిలబడిఒక గోడమాదిరిగా ముందుకు సాగుతూ ఎదటి సైన్యాలను కకావికలు చేసేవారు. వారికి తోడు ఆశ్విక దళాలను కూడా తయారు చేశాడు ఫిలిప్–2. ఐతే అప్పటికి గుర్రాలపై స్వారీ చేస్తూ వాటిని వేగంగా పరిగెత్తించడానికి జీను, స్టర్ అప్ వంటివి ఉనికిలోకి రాలేదు. ఆ గుర్రాలమీద స్వారీ చేస్తూ విల్లంబులు ప్రయోగించే విలుకాళ్ళను తయారు చేశాడు. శత్రు సైన్యాలపై పెద్ద పెద్ద రాళ్ళను కురిపించే భారీ సైజు వడిసెలలను ఉపయోగించడం నేర్చారు. ఎత్తైన కర్ర నిచ్చెనలు తయారుచేసి వాటిని రథాలకు పూన్చి వాటిని ఉపయోగించి శత్రువుల కోటలను ధ్వంసం చేసే శక్తిని తెచ్చుకున్నారు. ఈ కొత్త యుద్ధపద్ధతులలో తన సైన్యాలకు ఫిలిప్–2 గట్టి శిక్షణనిచ్చాడు. యుద్ధరీతిలో తెచ్చిన ఈ విప్లవాత్మక మార్పుతో ఫిలిప్ త్వరగా గ్రీకు ప్రాంతం మీద అధికారాన్ని సాధించగలిగాడు. అతడి కుమారుడే అలెగ్జాండర్ ది గ్రేట్.

క్రీ.పూ. 336–323 మధ్య కాలంలో అలెగ్జాండర్ పాలించాడు. అయోనియా ప్రాంతంమీద పెత్తనం ఉన్న అకెమినిడ్ రాజ్యాన్ని ఎదిరించాడు. క్రీ.పూ. 334–331 మధ్య మూడు మహా యుద్ధాలు జరిగాయి. ఆ యుద్ధాలలో అలెగ్జాండర్ అకెమినిడ్ రాజ్యాన్ని పాదాక్రాంతం చేసుకున్నాడు. అకెమినిడ్ సామ్రాజ్యానికి రాజుగా ఉన్న డారియస్–3 దాసోహం అన్నాడు. దాంతో ఇరాన్ వరకూ ఉన్న అకెమినిడ్ సామ్రాజ్యం అలెగ్జాండర్ అధీనంలోకి పూర్తిగా వచ్చింది.

క్రీ.పూ. 331లో అలెగ్జాండర్ తూర్పు దిశగా తన జైత్రయాత్రను కొనసాగించాడు. ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతాన్ని కైవసం చేసుకున్నాడు. అరకోసియా మైదానాలలోకి (హరక్వతి నది ప్రవహించే ప్రాంతం) ప్రవేశించి రాజధాని కాందహార్‌ను స్వాధీనం చేసుకున్నాడు. (చూ. మ్యాప్1.1)అక్కడినుంచి ఈశాన్యదిశవైపు మళ్ళీ కాబూల్ నది ప్రవహించే మైదానాలలో ప్రవేశించాడు. అక్కడ అలెగ్జాండ్రా అనే పేర ఒక నగరాన్ని నిర్మించాడు. అక్కడినుంచి వాయవ్య దిశగా మళ్ళీ హిందూకుష్ పర్వతశ్రేణిని దాటి బాక్ట్రియా (బాల్క్) రాజ్యం మీద దాడి చేశాడు. అక్కడి రాజు బెస్సస్ ను తరిమివేసి ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఈ ప్రాంతం ఇప్పుడు ఉత్తర ఆఫ్ఘనిస్తాన్‌లో ఉంది. అలెగ్జాండర్ సైన్యాలలోకి గ్రీకు ప్రాంతం నుండి మాత్రమే కాక ఇప్పుడు అకెమినిడ్ సామ్రాజ్య ప్రాంతం ,ఉండి కూడా దళాలు వచ్చి చేరసాగాయి. మళ్ళీ హిందూకుష్ పర్వతాలను దాటి వెనక్కి వచ్చి అలెగ్జాండ్రా నగరాన్ని చేరుకుని తన బలగాలను సిద్ధం చేసుకుని కాబూల్ నది వెంబడి యాత్రను సాగించాడు. పెషావర్ కు ఉత్తరాన ఉన్న ప్రాంతాన్ని తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. అక్కడనుంచి సింధునదిని దాటి తక్షశిలలోకి ప్రవేశించాడు. తక్షశిల రాజు అంభి అలెగ్జాండర్ కి లంగి అనుకూలంగా వ్యవహరించి సామంతుడిగా కొనసాగాడు. అక్కడనుంచి అలెగ్జాండర్ జైత్రయాత్ర కొనసాగడానికి జీలం నదిని దాటాలి.

అక్కడ పురు వంశానికి (తెగ) చెందిన రాజు పోరస్ (పురుషోత్తముడు) గట్టి ప్రతిఘటననిచ్చాడు. 200 ఏనుగులు, 4000 గుర్రాలు, 300 రథాలు, 30,000 మంది సైన్యంతో ఉన్న తన బలగాలతో అలెగ్జాండర్‌తో భీకరయుద్ధం చేశాడు. అలెగ్జాండర్ బలగాలలో ఏనుగులు లేవు. అందువలన పోరస్ యుద్ధంలో పైచేయి సాధించవచ్చునని భావించాడు. కాని అలెగ్జాండర్ యుద్ధవ్యూహం వేరుగా నడిచింది. తన కాలిబలాలతో పోరస్ ఏనుగుల దళాలను చుట్టుముట్టి చీకాకుపరిచాడు. ఏనుగులను నడిపే మావటిలను లక్ష్యంగా చేసుకుని వారిని హతమార్చాడు. మావటిలు లేకపోవడంతో ఏనుగులు చెల్లాచెదరై పోరస్ సైన్యాలకే సమస్యగా మారాయి. ఆ సమయంలో తన ఆశ్వికదళాలను నడిపించి పోరస్ బలగాలను తుదముట్టించాడు అలెగ్జాండర్. చివరికి పోరస్ బందీ అయ్యాడు. ఆఫ్ఘనిస్తాన్ దాటిన తర్వాత అలెగ్జాండర్ కు ఎదురైన అతి పెద్ద, గట్టి ప్రతిఘటన ఈ యుద్ధమే. అందుకే ఇది చరిత్రలో ప్రసిద్ధికెక్కింది.


తనకు సామంతుడిగా ఉండి పాలన సాగించేందుకు అంగీకరించిన పోరస్ కు తిరిగి ఆ రాజ్యంమీద అధికారాన్ని అప్పజెప్పి

అలెగ్జాండర్ తన దండయాత్రను కొనసాగించాడు. చీనాబ్ , రావి, బియాస్ నదులను దాటాడు. మార్గమధ్యంలో పలు తెగలను ఓడించి 70,000 మందికి పైగా బందీలను పట్టి తన దేశానికి బానిసలుగా తరలించాడు. ఆ తర్వాత గంగోత్రి దగ్గర గంగా మైదానంలోకి అడుగుపెట్టాడు. అక్కడ పెద్ద సంఖ్యలో ఏనుగుల మందలు ఉన్నాయి. పోరస్ తో జరిగిన యుద్ధంలో ఏనుగు దళాల ప్రాధాన్యతను గుర్తించిన అలెగ్జాండర్ పెద్ద సంఖ్యలో వాటిని సేకరించాడు.

ఇక అక్కడినుంచి ఇంకా ముందుకు తూర్పు దిశగా గంగా మైదానంలోకి సాగడానికి అలెగ్జాండర్ సేనానులు సుతరామూ అంగీకరించలేదు. దీర్ఘకాలంపాటు సాగిన దండయాత్రతో వారు అలసిపోయారు. తమ స్వంత దేశానికి పోవాలనే వాంఛ వారిలో బలంగా పెరిగింది. దాంతో క్రీ.పూ.326 లో అలెగ్జాండర్ తిరుగుప్రయాణం ప్రారంభించాడు. బియాస్ నదీతీరం వరకూ తాను గెలుచుకున్న ప్రాంతంమీద అధికారం సామంతుడైన పోరస్ కు అప్పజెప్పాడు. తన దండయాత్రలో కొల్లగొట్టిన విలువైన సంపదనంతనూ తరలించుకుపోడానికి, ఏనుగుల మందలను, సింధు ప్రాంతపు మూపురం ఉన్న ఎద్దులను వెంట తీసుకుపోడానికి వీలుగా పెద్ద సంఖ్యలో నౌకలను తయారు చేయించాడు. అందుకోసం గ్రీస్‌నుంచి భారీనౌకల నిర్మాణంలో నిపుణులను రప్పించాడు. దాదాపు 200 కు పైగా ఏనుగులను, ఇతర సామగ్రిని , సైనిక దళాలను ఎక్కించుకుని నౌకలలో ప్రయాణం ప్రారంభించాడు. మార్గమధ్యంలో చీనాబ్ దాటగానే సైన్యంతో భూమార్గాన ముందుకు సాగి అక్కడ ఉన్న 'మల్ల' రాజ్యాన్ని స్వాధీనం చేసుకోడానికి యుద్ధం చేశాడు. భీకర యుద్ధం సాగింది. పెద్ద సంఖ్యలో ప్రాణనష్టం జరిగింది. వెనక్కు తగ్గుతున్న మల్లులను వెంట తరుముతూ వారి ప్రధాన పట్టణాన్ని ( ప్రస్తుత ముల్తాన్ నగరానికి సమీపంలో ఉండేది) స్వాధీనం చేసుకునే యత్నంలో అలెగ్జాండర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఐతే ప్రతీకారంగా ఆ పట్టణంలోని ప్రతీవొక్క పౌరుడినీ, పిల్లా, పాపలతో సహా చంపించివేశాడు.

అక్కడినుంచి చీనాబ్ గుండా నౌకలలో ప్రయాణం సాగిస్తూ ఆ నది సింధునదితో కలిసే చోటికి చేరుకున్నాడు. సింధు ప్రాంత రాజ్యాలను లొంగదీసుకున్నాడు. శంభ తెగ ప్రజలను పాదాక్రాంతం చేసుకున్నాడు. సింధునది సముద్రంలో కలిసే చోటికి చేరి

❝ ఇక అక్కడినుంచి ఇంకా ముందుకు తూర్పు దిశగా గంగా మైదానంలోకి సాగడానికి అలెగ్జాండర్ సేనానులు సుతరామూ అంగీకరించలేదు. దీర్ఘకాలంపాటు సాగిన దండయాత్రతో వారు అలసిపోయారు. తమ స్వంత దేశానికి పోవాలనే వాంఛ వారిలో బలంగా పెరిగింది. దాంతో క్రీపూ. 326 లో అలెగ్జాండర్ తిరుగుప్రయాణం ప్రారంభించాడు. బియాస్ నదీతీరం వరకూ తాను గెలుచుకున్న ప్రాంతంమీద అధికారం సామంతుడైన పోరస్ కు అప్పజెప్పాడు. ❞




క్రీస్తు పూర్వం 325లో అలెగ్జాండర్ ఆక్రమించుకున్న వాయవ్య భారత దేశ పటం


అక్కడినుండి హిందూమహాసముద్రపు అలల ఉధృతిని ప్రత్యక్షంగా చూశాడు.

తన తిరుగు ప్రయాణాన్ని ఇరాన్, మెసపుటేమియాల గుండా సాగించాలని అలెగ్జాండర్ తలచాడు. అందుకు ముందు తన ఆక్రమణలో ఉన్న భారత ఉపఖండ ప్రాంతాన్ని ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించి ఉత్తర భాగాన్ని ఫిలిప్ అనే సేనానికి, దక్షిణ భాగాన్ని తన మామ అయిన ఆగ్జీయార్టెస్ కు అప్పజెప్పాడు. ఆ ప్రాంతాలను పాలించే సైన్యంలో అటు ఇరాన్, గ్రీకు సైనికులు, ఇటు భారత ఉపఖండ ప్రాంతపు సైనికులు కూడా ఉన్నారు. ఇది సైన్యంలో అస్థిరతకు, అల్లర్లకు దారితీసింది. కొంతముంది గ్రీకు కుట్రదారులు ఫిలిప్‌ను హత్య చేశారు. అప్పుడు అలెగ్జాండర్ ఆ ప్రాంతానికి యుడెమస్ అనే గ్రీకు సేనానిని, అతనితోబాటు ఒక స్థానిక సేనానిని ఉమ్మడిగా నియమించాడు. తద్వారా స్థానిక సైన్యాల మద్దత్తును పొందడానికి ప్రయత్నించాడు.

ఆ తర్వాత తన సైన్యంలో ఒక భాగాన్ని ఏనుగుల దళాలను తూర్పు ఇరాన్, కాందహార్ త గుండా బోలన్ కనుమ గుండా

❝ అలెగ్జాండర్ దండయాత్రతో వాయవ్య భారతం దారుణంగా దెబ్బ తింది. అపారమైన జననష్టంతోబాటు భారీగా సంపదను దోచుకున్నాడు. పెద్ద సంఖ్యలో బానిసలను పట్టి తీసుకునిపోయాడు. మరోవైపు భారతీయ నాగరికత గ్రీకు నాగరి కతతో సంపర్కం చెందింది. గ్రీకు పాలనా పద్ధతులు ఇక్కడ కూడా ప్రవేశించాయి.గ్రీకు నిర్మాణ కళ ఇక్కడ వినియోగించబడింది. పలు విశాలమైన భవనాలు, వ్యాయామ శాలలు, నాట్యశాలలు నిర్మించ బడ్డాయి. గ్రీకు దేశపు శాస్త్ర విజ్ఞానాన్ని కూడా ఇక్కడ ఉపయోగించడం ప్రారంభించారు. ❞

దేశం కోసం నిలబడ్డ వీరుడిగా చిత్రీకరణ ఉంటుంది. నిజానికి అంభి పోరాటం చేయకుండా ముందే లంగిపోయాడు. పోరస్ (పురుషోత్తముడు) పోరాడి ఓడిపోయాక అలెగ్జాండర్ కు సామంతుడై, తదనంతర దండయాత్రలో అలెగ్జాండర్ కు సహకరిస్తూ వచ్చాడు. మొత్తం మీద ఇద్దరూ లంగి, సహకరించినవారే. అనేక చిన్న, చిన్న రాజ్యాలుగా ఉన్న వాయవ్య భారత ప్రాంతంలో లంగిపోయిన రాజులూ ఉన్నారు,



అలెగ్జాండర్‌కు చెందిన మాసిడోనియన్ సైనికుడు గుర్రం మీద వచ్చి ఏనుగుపై ఉన్న భారతీయ సైనికులపై దాడి చేస్తున్నట్లు వేసిన చిత్రం. క్రీస్తు పూర్వం 323లో బాబిలోనియాలో ఈ చిత్రం గీయబడింది. ఉరుమును చేతబట్టుకున్న అలెగ్జాండర్ చిత్రాన్ని కుడివైపు చూడవచ్చు.

ముందుకు పంపాలని, రెండో భాగంతో తాను తీరమార్గానికి సమీపంగా ఉంటూ బెలూచిస్థాన్ ద్వారా పర్షియన్ అగాథం లోకి ప్రవేశించాలని భావించాడు. ఐతే ఆ క్రమంలో చాలామంది సైనికులు, జంతువులు కూడా చనిపోయారు. మొత్తానికి అలెగ్జాండర్ క్రీ.పూ.324 ఏప్రిల్–మే మధ్యలో నైరుతి ఇరాన్ లో ప్రవేశించాడు. అక్కడినుంచి ఇరాక్ లోని బాబిలోన్ కు ప్రయాణం మొదలుపెట్టాడు. అయితే అనుకోకుండా క్రీ.పూ.323 జూన్ లో అలెగ్జాండర్ మరణించాడు.

అలెగ్జాండర్ దండయాత్రతో వాయవ్య భారతం దారుణంగా దెబ్బ తింది. అపారమైన జననష్టంతోబాటు భారీగా సంపదను అలెగ్జాండర్ దోచుకున్నాడు. పెద్ద సంఖ్యలో బానిసలను పట్టి తీసుకుని పోయాడు.

ఈ భారీ నష్టం తోబాటు భారతీయ నాగరికత గ్రీకు నాగరికతతో సంపర్కం చెందింది. గ్రీకు పాలనా పద్ధతులు ఇక్కడ కూడా ప్రవేశించాయి.గ్రీకు నిర్మాణ కళ ఇక్కడ వినియోగించబడింది. పలు విశాలమైన భవనాలు, వ్యాయామశాలలు, నాట్యశాలలు నిర్మించబడ్డాయి. గ్రీకు దేశపు శాస్త్ర విజ్ఞానాన్ని కూడా ఇక్కడ ఉపయోగించడం ప్రారంభించారు. క్రీ.పూ. 311 నుండి 281 వరకూ వాయవ్య భారతంలో గ్రీకు సామ్రాజ్య ప్రతినిధిగా పాలించిన సెల్యూకస్ కాలంలో ఈ నాగరికతల సంగమం ఉన్నతస్థాయికి చేరింది.

అలెగ్జాండర్ దండయాత్ర గురించి సంఘపరివారం చెప్పే వివరణలో అంభి (తక్షశిల రాజు) దేశద్రోహిగా, పోరస్ పోరాడి మరణించినవారూ ఉన్నారు, పోరాడి ఓడిపోయి లంగినవారూ ఉన్నారు. దండయాత్రలో చాలాకాలంపాటు కొనసాగినందువలన అలసిపోయి అలెగ్జాండర్ సైన్యాలు వెనుదిరిగాయే తప్ప ఆ దండయాత్రను జయప్రదంగా నిలవరించినది లేదు. అన్ని విధాలా బలమైన, సుశిక్షితమైన సైన్యం ఉన్నందువలన అలెగ్జాండర్ అనేక విజయాలను సాధించగలిగాడు. అతడి సైన్యంతో సరితూగగల శక్తి సామర్థ్యాలు ఇక్కడ ఏ రాజ్యానికీ లేనందువలన అతడికి దీటైన ప్రతిఘటన ఎదురుకాలేదు.

(అలెగ్జాండర్ దండయాత్ర సాగించి గెలుచుకున్న ప్రాంతం మ్యాప్ 1.1)

(పోరస్ ఏనుగు బలాన్ని ఎదుర్కోడానికి అలెగ్జాండర్ పన్ని వ్యూహాన్ని చిత్రీకరించిన పటం. ఫిగర్ 1.1)

❋

**జాతీయ పరిణామాలు**

# విశ్వసనీయత కోల్పోతున్న మోడి ప్రభుత్వం


రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

**ఎ.కోటిరెడ్డి**

**మో**డి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అత్యంత వేగంగా ప్రజా విశ్వాసాన్ని కోల్పోతున్నది. మాటలు, చేతల మధ్య హస్తిమశకాంతరం ఉండటమే అందుకు కారణం. మోడి ప్రభుత్వం ఏర్పడిన 2014 నుండి ఇదే పరిస్థితి నెలకొని ఉన్నది. మొదట్లో ప్రభుత్వ పనితీరును నిశితంగా గమనిస్తున్న వారు మాత్రమే ఈ విధానాలను అర్థం చేసుకున్నారు. ఇప్పటికొచ్చేసరికి సాధారణ ప్రజలు కూడా మోడి ప్రభుత్వ జిమ్మిక్కులు, వాగ్దానభంగాలు, కపటపు నడవడికను అర్థం చేసుకోవటం పెరుగుతున్నది. విస్తారమైన ప్రజలు ప్రభుత్వ నిజస్వరూపాన్ని తెలుసుకోవటంతో మోడి మాటలు ప్రజలను ప్రభావితం చేయలేకపోతున్నాయి. ఇటీవల జరుగుతున్న సంఘటనలతో దేశ ప్రజలు ఈ అంశాలను మరింత స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారు.

మోడి ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేకంగా రైతులు సంవత్సరంపైగా పోరాటం చేశారు. ఢిల్లీ సరిహద్దులలో పోరాట శిబిరాలను ఏర్పాటు చేసుకుని, ఎండ, చలి, వర్షాలను లెక్కచేయకుండా సాగించిన పోరాటం మొత్తం రైతాంగం, దేశప్రజలతో పాటు ప్రపంచ ప్రజానీకం మద్దతును కూడా సాధించింది. రైతాంగం, ప్రజలలో అపఖ్యాతి పాలు కావటం, కీలకమైన ఉత్తరప్రదేశ్‌తో పాటు ఐదు రాష్ట్రాలలో ఎన్నికలు రావటం వ్యవసాయ చట్టాలను రద్దు చేయక తప్పని పరిస్థితిని బిజెపి ప్రభుత్వానికి కల్పించింది. అందువలన వ్యవసాయ చట్టాలను రద్దుచేస్తామని, ఢిల్లీ సరిహద్దులలో ఉన్నరైతులు వెంటనే తమ ఇళ్ళకు తిరిగి వెళ్ళాలని నవంబరు నెలలో ప్రధాని ప్రకటించాడు. రైతాంగం ముందుకు తెచ్చిన కనీసమద్దతు ధరలు, ప్రభుత్వ సేకరణ, రైతాంగంపై పెట్టిన కేసుల రద్దు, పోరాటం సందర్భంలో మరణించిన వారి కుటుంబాలకు పరిహారం చెల్లింపు తదితరాలను గురించి ప్రస్తావించలేదు. చట్టాలను రద్దుచేస్తామని ప్రధాని ప్రకటించినప్పటికీ పార్లమెంటులో చట్టాలను రద్దు చేయటంతో పాటు మిగతా సమస్యలను కూడా పరిష్కారం చేసే వరకు వరకు తాము శిబిరాలను వీడేది లేదని రైతులు స్పష్టం చేశారు. ప్రధాని, ప్రభుత్వం ఎంతగా విశ్వసనీయతను కోల్పోయారో ఈ అంశమే స్పష్టం చేస్తున్నది. ప్రధానిపై విశ్వాసం ఉన్నట్లైతే చట్టాలు రద్దు చేస్తామని ప్రకటించగానే, మిగతా అంశాలపై కూడా ప్రధాని హామి ఇస్తే శిబిరాలను విడిచి వెళ్ళటానికి రైతులు సిద్ధం కావలసింది. కాని రైతులు ప్రధానిని విశ్వసించకపోవటం సరైనదేనని ప్రధాని, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు స్పష్టం చేస్తున్నది. రైతులు శిబిరాలను వీడి మూడు నెలలు అవుతున్నప్పటికీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలలో ఏ ఒక్కదానిని అమలు చేయటానికి చర్యలు తీసుకోలేదు. దీనిపై రైతుసంఘాలు జనవరి 31వ తేదీన దేశవ్యాప్తంగా నిరసన తెలిపాయి. రైతుల నిరసనల తర్వాత అయినా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యం. పార్లమెంటులో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చటానికి అవసరమైన ప్రతిపాదనలు కాని, నిధుల కేటాయింపులు కాని లేవు. ఆరోజు రైతుల చేత పోరాటాన్ని విరమింపజేయటానికి వారి డిమాండ్లను అమలు చేస్తామని రాతపూర్వకంగా హామీఇచ్చారు. రైతులు పోరాటాన్ని విరమించిన తర్వాత 'ఏరుదాటిన తర్వాత తెప్పతగలేసిన' చందంగా తామిచ్చిన హామీలను మరిచారు. ఈ విధంగా వ్యవహరించే ప్రధాని, ప్రభుత్వానికి ఏం విశ్వసనీయత ఉంటుంది?

**ఐదు రాష్ట్రాల ఎన్నికలలో మతోన్మాద ప్రచారం**

ఫిబ్రవరి, మార్చినెలల్లో ఉత్తరప్రదేశ్‌తో పాటు ఐదు రాష్ట్రాలకు జరుగనున్న ఎన్నికలలో బిజెపి మతోన్మాద ప్రచారాన్ని తీవ్రం చేసింది. అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని గురించి విస్తృతంగా ప్రచారం చేయటంతో పాటు కాశీ, మధురలలో కూడా విశ్వనాథ, కృష్ణ మందిరాల నిర్మాణం చేస్తామని, 20 శాతంకు వ్యతిరేకంగా 80 శాతం మంది ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు. అంటే యుపిలో దాదాపు 20 శాతంగా ఉన్న ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకంగా 80 శాతంగా ఉన్న వారు ఓటు చేయాలని మతపరమైన విజ్ఞప్తులు చేస్తున్నారు. ఇంతకు ముందునుండి చేస్తున్న లవ్‌జిహాద్, ముస్లింలను నేరస్తులుగా చూయిస్తూ ఎన్‌కౌంటర్‌లు చేయటం తదితరాలతో పాటు మతోన్మాద ప్రచారాన్ని తీవ్రం చేయటం ద్వారా యుపి ఎన్నికలలో నెగ్గాలని ప్రయత్నిస్తున్నారు. 2014, 19లో జరిగిన పార్లమెంటు ఎన్నికలు, 2017లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మతపరమైన విభజనల ద్వారానే యుపిలో బిజెపి విజయం సాధించింది. 2013లో బిజెపి రగిలించిన మతఘర్షణలలో చిక్కుకుని, ఐక్యత విచ్ఛిన్నం కావటంతో జరిగిన నష్టాన్ని హిందువులు, ముస్లింలు గమనించారు. బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలపై కుల, మతాలతో నిమిత్తం లేకుండా రైతులు ఐక్యంగా పోరాటం చేయటంతో కుల, మత విభజన వెనక్కుపోతున్నది. తిరిగి బిజెపి ప్రచారంలో కొట్టుకుపోవటానికి, మతపరంగా చీలిపోవటానికి యుపి రైతులు, ప్రజలు సిద్ధంగా లేరు.

పరిపాలనలో ప్రజల సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరించటం ఎన్నికలలో బిజెపికి తీవ్ర వ్యతిరేకతను తీసుకొచ్చింది. కోవిడ్ రెండవ వేవ్‌లో ప్రభుత్వం కోవిడ్ బాధితులను పట్టించుకోకపోవటం ప్రజలలో వ్యతిరేకతను పెంచింది. చనిపోయిన తమ బంధువుల అంత్యక్రియలు పూర్తి చేయటం కోసం 24 గంటలూ శవాలు దహనమౌతున్న స్మశానాలలో

**"తన మతోన్మాద విధానాలను ముందుకు తీసుకుపోవటం, ముస్లింలపై దేషం పెంచటంలో భాగంగా ఆవుకు పవిత్రతను ఆపాదిస్తూ ప్రచారాన్ని తీవ్రం చేసింది. 2017లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పశువధను నిషేధించింది. ఆవులు, ఎద్దులను వధించటాన్ని నిషేధించటంతో పాలివ్వటం ఆగిపోయిన ఆవులు, వ్యవసాయం చేయటానికి పనికిరాని స్థితికి చేరిన ఎడ్లను కొనేవారు లేక రైతుల వద్ద మిగిలిపోతున్నాయి. ఏ మాత్రం ఉపయోగపడని వాటిని సాకటం రైతులకు తలకు మించిన భారంగా మారింది."**

బంధువులు గంటల తరబడి ఎదురుచూడటం, కోవిడ్‌తో మృత్యువాత పడిన వారి శవాలు గంగానదిలో కొట్టుకుపోవటం, గంగానది ఒడ్డున పాతి పెట్టిన వందలాది శవాలు బయటపడటం ప్రజలను నివ్వెరపరిచింది. ఇన్ని వాస్తవాలు బయటపడిన తర్వాత కూడా కనీసం వాటిని అంగీకరించటానికి, తర్వాతైనా రోగులకు తగిన వైద్యం అందించటం, శవాలను సక్రమంగా దహనం చేయించటానికి అవసరమైన చర్యలు తీసుకోలేదు. రాష్ట్రంలో వైద్యం, ఆక్సిజన్ అందకపోవటం అనే సమస్య లేదని బుకాయించారు. దానితో ప్రజలలో ప్రభుత్వంపై విశ్వాసం మరింత సడలింది. గత సంవత్సరం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి పరాజయం చెందింది. సమాజ్‌వాది పార్టి ఎక్కువ స్థానాలు గెలుచుకోవటంతో పాటు బిజెపికి కీలకమైన అయోధ్య, అలహాబాద్, గోరఖ్‌పూర్, కాశి తదితర ప్రాంతాలలో ఆ పార్టి ఓటమి పాలయింది.

తన మతోన్మాద విధానాలను ముందుకు తీసుకుపోవటం, ముస్లింలపై దేషం పెంచటంలో భాగంగా ఆవుకు పవిత్రతను ఆపాదిస్తూ ప్రచారాన్ని తీవ్రం చేసింది. 2017లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పశువధను నిషేధించింది. ఆవులు, ఎద్దులను వధించటాన్ని నిషేధించటంతో పాలివ్వటం ఆగిపోయిన ఆవులు, వ్యవసాయం చేయటానికి పనికిరాని స్థితికి చేరిన ఎడ్లను కొనేవారు లేక రైతుల వద్ద మిగిలిపోతున్నాయి. ఏ మాత్రం ఉపయోగపడని వాటిని సాకటం రైతులకు తలకు మించిన భారంగా మారింది. గత్యంతరం లేని పరిస్థితులలో పనికిరాని ఆవులు, ఎడ్లను వీధులలో వదిలివేస్తున్నారు. ఆ విధంగా వదిలివేసిన పశువులు రైతులు, గ్రామాలలోని ప్రజలకు ప్రాణ సంకటంగా మారుతున్నాయి. వదిలివేసిన ఆవులు, ఎడ్లు పంట పొలాలపై బడి పంటలను నాశనం చేస్తున్నాయి. వీధులలోనూ, పొలాలలోనూ తిరుగుతున్నపుడు పొడవటంతో గ్రామాలలో అనేకమంది గాయపడటం, కొందరు చనిపోవటం కూడా జరిగింది. గోశాలలను నిర్మించటం, పశువుల పోషణకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నప్పటికీ గోశాలలోని పశువుల పోషణకు అవి ఏ మాత్రం సరిపోవటం లేదు. వచ్చిన నిధులను కూడా ఎక్కువ మంది గోశాలల నిర్వాహకులు కాజేసి, పశువులను పొలాలపైకి వదులుతున్నారు. రాష్ట్రంలోని గ్రామీణప్రాంత ప్రజలు ఈ సమస్యతో తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ఆవుల పవిత్రతను గురించి విశ్వాసం ఉన్నవారు కూడా తమ జీవనోపాధికి కలుగుతున్న నష్టంతో తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రధాని మోడి కూడా ఈ సమస్యను ప్రస్తావించక తప్పలేదు. తమ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యను పరిష్కరిస్తామని ఆయన చెప్పాడు. కాని విశ్వాసనీయత కోల్పోతున్న మోడి మాటలు ప్రజలపై ప్రభావం చూపించటం లేదని పరిశీలకులు పేర్కొంటున్నారు.

ఎంత మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నప్పటికీ యుపి ఎన్నికలలో విజయం పట్ల బిజెపి నేతలకు విశ్వాసం లేదన్న విషయం వారి మాటలలోనే స్పష్టమౌతున్నది. ఎన్నికలలో సమాజ్‌వాది పార్టి కూటమి విజయం సాధించినప్పటికీ దాని మిత్రపక్షంగా ఉన్న రాష్ట్రీయ లోక్‌దళ్ ఎన్నికల అనంతరం తమతో జతకడుతుందని, ఎన్నికలలో ఏ పార్టి విజయం సాధించినప్పటికీ తమ పార్టియే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అమిత్‌షా చెప్పటం విజయం సాధించటంపై ఆ పార్టి అవిశ్వాన్ని వెల్లడిస్తున్నది. ఇతర బిజెపి నాయకులు కూడా ఇదేవిధమైన ప్రచారం కొనసాగిస్తున్నారు.

### ప్రజలను దారితప్పించటంలో మోడి సామర్థ్యం క్షీణిస్తున్నది

వివిధ సమస్యలపై చర్చ ముందుకు వచ్చినపుడు చర్చనీయాంశాలను దారి తప్పించి, అనవసర విషయాలను ముందుకు తీసుకువచ్చి, ప్రజలను మభ్యపెట్టటంలో మోడి అందెవేసిన చెయ్యి. గోరక్షణ పేరుతో మూకదాడులతో ముస్లింలను హత్యలు చేస్తున్నపుడు, నోట్లరద్దు, జిఎస్‌టి, ఆర్థిక సంక్షోభం, కోవిడ్ సమయంలో హఠాత్తుగా లాక్‌డౌన్ విధించటం తదితర సందర్భాలలో అసలు విషయాలు ప్రస్తావించకుండా ప్రజలను మోడి దారి తప్పించటానికి ప్రయత్నం చేశాడు. మన్‌కీబాత్ పేరుతో ప్రతినెలా చేసే రేడియో ప్రసంగంలోనూ ఇదే విధమైన ఎత్తుగడలను అనుసరిస్తున్నాడు. అసలు సమస్యలను గాలికి వదిలివేసి, అనవసర విషయాలను చెబుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తున్నట్లు ఫోజు పెడుతున్నాడు. ఇప్పటికి వచ్చే సరికి ఆ సామర్థ్యం క్షీణించిపోతున్నదని, వాస్తవ విషయాలు ప్రస్తావించక తప్పని పరిస్థితి ఏర్పడుతున్నదని, కొన్ని సందర్భాలలో అసందర్భమైన విషయాలు కూడా ప్రస్తావిస్తున్నాడని మోడి ప్రసంగాలు స్పష్టం చేస్తున్నాయి. బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై పార్లమెంటులో జరిగిన చర్చకు సమాధానం ఇస్తూ కాంగ్రెస్ పార్టికి కుటుంబ ప్రయోజనాలే ప్రధానమని, ఆ పార్టిలో అర్బన్ నక్సల్స్ ఉన్నారని ఆరోపణలు చేశాడు. చర్చలో ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలకు సమాధానం ఇవ్వకుండా తప్పించుకోవటం కోసం ఈ విధమైన ఆరోపణలు చేశాడు. రాజ్యసభలో చేసిన ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ విభజనపై విమర్శలు చేశాడు. ఈ విమర్శలు ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ వ్యతిరేకతకు దారితీశాయి. తెలంగాణాలో టిఆర్ఎస్, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టిలు మోడి విమర్శలను వ్యతిరేకించాయి. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే విధమైన ప్రతిస్పందన వచ్చింది. అయితే రాష్ట్రంలో పాలక వైసిపి, ప్రతిపక్షంలో ఉన్న టిడిపి మోడి విమర్శలపై స్పందంచలేదు. ఆంధ్రప్రదేశ్ విభజనపై చేసిన ఆరోపణలకు మోడి ప్రభుత్వం కూడా సమాధానం చెప్పుకోవాల్సి ఉంది. నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజాస్వామిక పద్ధతిలో రాష్ట్రాన్ని విభజించిందని చెప్పిన మోడి ఆనాడు తమపార్టి పార్లమెంటులో దానిని ఎందుకు

వ్యతిరేకించలేదో చెప్పాల్సి ఉంది. విభజన అనంతరం జరిగిన ఎన్నికలలో ఆయన నాయకత్వంలోనే బిజెపి ప్రభుత్వం ఏర్పడింది కదా! మరి చట్టంలో ఉన్న లోపాలను ఎందుకు సవరించలేదు? విభజనతో నష్టపోయిన తెలుగు రాష్ట్రాలకు అవసరమైన సహకారం ఎందుకు అందించలేదు? రాష్ట్ర విభజన తర్వాత విభజన చట్టం ప్రకారం ఉభయ రాష్ట్రాలకు ఇవ్వాల్సిన వాటిని కేంద్ర ప్రభుత్వం ఎందుకివ్వటం లేదన్నదానికి సమాధానం చెప్పాల్సింది కూడా మోడియే. ఈ విధంగా తాను, తన ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అంశాలను ఎదుటివారిపై నెడదామని ప్రయత్నం చేస్తే కుదిరేపని కాదు. అందువలననే మోడి ప్రసంగాల తర్వాత విభజన సమయంలో పార్లమెంటులో బిజెపి వ్యవహరించిన తీరు, మోడి అధికారంలోకి వచ్చిన తర్వాత విభజన చట్టంలోని అంశాలను అమలు చేయకపోవటంపై రాజకీయ పార్టీలు, పరిశీలకులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. వాటికి సమాధానం చెప్పగల స్థితిలో మోడి, ఆయన ప్రభుత్వం లేదని వారి మౌనమే వెల్లడిస్తున్నది.

**ప్రత్యర్థులపై దిగజారిన విమర్శలు**

రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేయటంలో మోడి దిగజారుడు కొనసాగుతున్నది. ప్రధాని స్థానంలో ఉండి రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్ష నాయకులపై ఇంత దిగజారుడు విమర్శలు ఇంతకు ముందెవరూ చేయలేదు. ఐదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించటానికి ముందు యుపిలో అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ప్రధాని, బిజెపి నాయకులు ఎక్కువసార్లు కాశి వెళ్ళారు. దానిని పురస్కరించుకుని బిజెపికి చివరిరోజులు వచ్చాయని, చివరి రోజులు సమీపించిన వారు కాశీలో గడపటానికి వచ్చిన విధంగానే బిజెపి నాయకులు కాశీలో ఎక్కువ కాలం గడుపుతున్నారని ఎస్‌పి నేత అఖిలేశ్ యాదవ్ విమర్శ చేశాడు. ప్రతిగా ప్రధాని తాను కాశీలో చనిపోవాలని కొందరు నాయకులు కోరుకుంటున్నారని విమర్శ చేశాడు. అఖిలేశ్ యాదవ్ చేసిన రాజకీయ విమర్శకు ఈ విధంగా స్పందించటం ప్రధాని ఏ స్థాయికి దిగజారాడో స్పష్టం చేస్తున్నది. తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ప్రచారం చేసుకుని, సానుభూతి ఓట్లు పొందాలని ప్రయత్నం చేయటం ఏ మాత్రం ఫలితాలను ఇవ్వదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

**మత విభజనను పెంచటానికి ప్రయత్నాలు**

> **“ ప్రధాని స్థానంలో ఉండి రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్ష నేతలపై ఇంత దిగజారుడు విమర్శలు ఇంతకు ముందెవరూ చేయలేదు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ప్రకటించటానికి ముందు యుపిలో అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ప్రధాని ఎక్కువసార్లు కాశి వెళ్ళారు. దానిని పురస్కరించుకుని బిజెపికి చివరిరోజులు వచ్చాయని, చివరి రోజులు సమీపించిన వారు కాశీలో గడపటానికి వచ్చిన విధంగానే బిజెపి నాయకులు కాశీలో ఎక్కువ కాలం గడుపుతున్నారని ఎస్‌పి నేత అఖిలేశ్ యాదవ్ విమర్శ చేశాడు. ”**



యుపి ఎన్నికల ర్యాలీలో ముఖ్యమంత్రి యోగీ ఆధిత్యనాథ్‌తో నరేంద్ర మోడీ

మత విభజనను పెంచటం కోసం కర్ణాటకలోని బిజెపి ప్రభుత్వం, సంఘ్ పరివార్ హిజాబ్ వివాదాన్ని ముందుకు తీసుకొచ్చాయి. మొదట శివమొగ్గలోని ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న ముస్లిం విద్యార్థినులు హిజాబ్‌తో రాకూడదని ఆంక్షలు విధించటంతో వివాదం ప్రారంభమైంది. ముస్లీం విద్యార్థినులు హిజాబ్ ధరించటానికి వ్యతిరేకంగా హిందు మతోన్మాదులు విద్యార్థులను రెచ్చగొట్టటంతో కాషాయ స్కార్ఫ్‌లతో కొందరు విద్యార్థులు హాజరయారు. దానితో వివాదం తీవ్రం కావటం, కొందరు విద్యార్థినులు హైకోర్టుకు వెళ్ళటం జరిగింది. తుది ఉత్తర్వులిచ్చే వరకూ విద్యార్థులెవరూ మతపరమైన చిహ్నాలు ధరించి రాకూడదని హైకోర్టు డివిజన్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. హిందుత్వ శక్తులు కర్ణాటక రాష్ట్రంతో పాటు దేశ వ్యాపితంగా ఈ వివాదాన్ని విస్తరింపజేసి, వివిధ రాష్ట్రాలలో ప్రజల మధ్య విభజనలు పెంచటానికి ప్రయత్నం చేశారు. ఈ వివాదం ముస్లీం మహిళల విద్యాహక్కుపై దాడి చేస్తుంది. హిందు మహిళలలో కొందరు మేలిముసుగు వేసుకున్నట్లుగానే ముస్లీం మహిళలలో కొందరు హిజాబ్ ధరిస్తారు. ఈ ఆచారాలు సనాతన వాదుల పట్టుకు సూచికగా ఉన్నప్పటికీ, వాటికి వ్యతిరేకంగా ఆయా మతాలలోని మహిళలు ఆందోళనకు పూనుకోవాల్సివుంది. మతపరమైన, సాంప్రదాయక అంశాలపై బయటి నుండి దాడి చేయటం ఆయా మతాలలోని మహిళలపై సనాతనవాదుల పట్టు పెరగటానికి దోహదం చేస్తుంది. ఇటువంటి వివాదాలు అన్ని మతాలలోని మహిళల పరిస్థితులు మరింత దిగజారటానికి దోహదం చేస్తాయి.

**బిజెపి, కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు పెంచిన కె సి ఆర్**

ప్రగతి భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో కెసిఆర్ మోడి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను విమర్శించాడు. ఎల్‌ఐసిని, ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతామని చెప్పటాన్ని ప్రస్తావిస్తూ అమెరికా

> **" ఇటువంటి పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని వ్యతిరేకిస్తూ, సమాఖ్య విధాన రక్షణ కోసం ప్రాంతీయ పార్టీలు గొంతెత్తటం పెరిగింది. దీనితో పాటు రాష్ట్రాలలో తమ స్థానం పదిలంగా ఉందని భావిస్తున్న ప్రాంతీయ పార్టీల నాయకులు జాతీయ స్థాయిలో ప్రధానపాత్ర నిర్వహించాలని, అంటే ప్రధానమంత్రి కావాలని ఆశిస్తున్నారు. అటువంటివారిలో మమతాబెనర్జి, కెసిఆర్, ఉద్దవ్‌థాకరే తదితరులున్నారు. "**

బీమా కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం బ్రోకర్‌గా వ్యవహరిస్తున్నదా అని ప్రశ్నించాడు. నల్లధనం, ఉద్యోగాల సంగతేమిటి, మీరు చెప్పిన ఏ ఒక్కమాట మీదైనా నిలబడ్డారా అని నిలదీశాడు. అవసరమైతే జాతీయ రాజకీయాలలో పాత్ర వహిస్తామని, తెలంగాణా జోలికొస్తే ఊరుకోమని, రాష్ట్ర ప్రజల కోసం ఢిల్లీ వెళ్ళి కొట్లాడతామని చెప్పాడు. జనగాం సభలోనూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించాడు. గతంలో కూడా కొన్ని సందర్భాలలో కెసిఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని, మోడిని విమర్శించాడు. కాని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలకు భంగకరంగా వ్యవహరించిన సందర్భాలలో, ముఖ్యంగా ధాన్యం కొనుగోలు చేయబోమని, రైతులు ఇతర పంటలు పండించుకోవాలని చెబుతున్నపుడు కెసిఆర్, రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర విధానాన్ని వ్యతిరేకించకుండా అదేపాట పాడారు. తీరా రాష్ట్ర బిజెపి నుండి టిఆర్ఎస్ ప్రభుత్వంపై దాడి తీవ్రం కావటం, ప్రజలలో తమ ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకత నుండి బయటపడటం కోసం ఇపుడు మోడిని, కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించటానికి కెసిఆర్ పూనుకున్నాడు. వీటితో పాటు సంవత్సరం పాటు సాగిన రైతాంగ ఉద్యమం ముందు తలొంచి, మూడు వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేయక తప్పతి పరిస్థితి మోడి ప్రభుత్వానికి ఎదురుకావటం, తనకు కేంద్రస్థానంగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలలో ఆ పార్టీ బలహీనపడటం, యుపి ఎన్నికలలో ఎదుర్కొంటున్న సవాలు కూడా మోడిని విమర్శించటానికి కెసిఆర్‌ను పురికొల్పి ఉండవచ్చు.

కెసిఆర్ కేంద్రంపై విమర్శలు పెంచిన తర్వాత ఇతర రాష్ట్రాలలో ప్రభుత్వాలను నడుపుతున్న ప్రతిపక్ష పార్టీల నుండి ఆయనకు మద్దతు లభిస్తున్నది. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జి హైదరాబాద్‌లో కెసిఆర్‌తో చర్చలు జరిపింది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి, శివసేన అధ్యక్షుడు ఉద్దవ్ థాకరే కెసిఆర్‌ను బొంబాయికి ఆహ్వానించి చర్చలు జరిపాడు. ఎన్‌సిపి నాయకుడు శరద్‌పవార్‌ను కూడా కెసిఆర్ కలిశాడు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కేంద్ర ప్రభుత్వ విధానాలను, ఫెడరలిజంపై చేస్తున్న దాడులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాడు. కేంద్రం రాష్ట్రాల హక్కులపై చేస్తున్న దాడులను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాశాడు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం ఫెడరలిజంపై కేంద్ర దాడులను, ప్రజా వ్యతిరేక విధానాలను నికరంగా వ్యతిరేకిస్తున్నది. తన విధానాలను వ్యతిరేకిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాల వ్యవహారాలలో కేంద్రం గవర్నర్ల ద్వారా జోక్యం చేసుకుంటున్నది. కేరళ, పశ్చిమబెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాలలోని గవర్నర్లు తమ రాజ్యాంగ పరిధిని అతిక్రమించి, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పాలనా వ్యవహారాలలో జోక్యం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. రాజ్యాంగం రాష్ట్రాలకు ఇచ్చిన హక్కులను కుదించటం పెరిగింది. ఇటువంటి పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని వ్యతిరేకిస్తూ, సమాఖ్య విధాన రక్షణ కోసం ప్రాంతీయ పార్టీలు గొంతెత్తటం పెరిగింది. దీనితో పాటు రాష్ట్రాలలో తమ స్థానం పదిలంగా ఉందని భావిస్తున్న ప్రాంతీయ పార్టీల నాయకులు జాతీయ స్థాయిలో ప్రధానపాత్ర నిర్వహించాలని, అంటే ప్రధానమంత్రి కావాలని ఆశిస్తున్నారు. అటువంటివారిలో మమతాబెనర్జి, కెసిఆర్, ఉద్దవ్‌థాకరే తదితరులున్నారు.

**రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలేస్తున్న వైసిపి ప్రభుత్వం**

ఆంధ్రప్రదేశ్‌లోని వైసిపి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలి, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను తు చ తప్పకుండా అమలు చేస్తున్నది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలోని ఏ రాష్ట్రానికీ చేయనంత ద్రోహం ఆంధ్రప్రదేశ్‌కు చేస్తున్నది. విభజన హామీలను అమలుచేయటం లేదు. పెరిగిన పోలవరం ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ఆమోదించలేదు, రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన నిధులను తిరిగి చెల్లించటంలో జాప్యం చేస్తున్నది. విశాఖ ఉక్కుఫ్యాక్టరీని ప్రైవేటు వారికి అమ్మటానికి ఏర్పాట్లు చేస్తున్నది. ఇందులో పదోవంతు కూడా నష్టం జరగని రాష్ట్రాలు కేంద్ర విధానాలను వ్యతిరేకిస్తూ బహిరంగంగా ప్రకటనలు చేస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి నోరు మెదపటం లేదు. పైగా బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేయటంలో ఎక్కడలేని ఉత్సాహం చూపుతున్నాడు. దేశంలో ఏ రాష్ట్రం కన్నా ముందే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు బిగించటం ప్రారంభించారు. నూతన విద్యా విధానాలను అమలు జరుపుతున్నారు. గుజరాత్ ప్రజలు, ముఖ్యమంత్రిగా ఉన్నపుడు మోడి ప్రభుత్వం వ్యతిరేకించిన అణువిద్యుత్ కేంద్రాన్ని మనరాష్ట్రంలో నిర్మించటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులతో కనీసం సంప్రదించకుండా అణు విద్యుత్ కేంద్రం కోసం బలవంతంగా భూములు తీసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని అదానికి కట్టబెట్టటానికి పూనుకున్నది. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యోగులు, కార్మికులు, విద్యుత్‌కేంద్రం నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులు, ప్రజలు చేస్తున్న ఆందోళనలను అణచివేస్తున్నది. సిఐటియు, ఇతరసంస్థలు కలిసి 27వ తేదీన బహిరంగసభ జరపటానికి పూనుకుంటే నాయకులను అరెస్టు చేసి, సభ జరగకుండా చేసింది.

కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకే ఈ విధంగా వ్యవహరిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లుగా గతంలో గంగవరం పోర్టును కూడా అదానికి అప్పగించింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలుచేయటం, ప్రభుత్వ, ప్రజల సంపదలను అంబాని, అదానిలకు అప్పగించటానికి వైసిపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. ఇటువంటి విధానాలను అమలుజరిపే ప్రభుత్వాలు, పార్టీల వలన ప్రజలకు ఎనలేని హాని జరుగుతుంది. వైసిపి ప్రభుత్వం రాష్ట్రానికి, ప్రజలకు ద్రోహం చేస్తున్నది. ప్రజలు రాష్ట్ర ప్రయోజనాలకు జరుగుతున్న నష్టాన్ని గమనించి, పోరాటాల ద్వారా ఈ విధానాలను తిప్పికొట్టటానికి పూనుకోవాలి.

❊

# రాజ్యాంగ పునాదులను ధ్వంసం చేస్తున్న సంఘ్ పరివారం



రచయిత జెఎన్‌యులో సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ అసోసియేట్ ప్రొఫెసర్

రాకేష్ బతబ్యల్

స్వతంత్ర పోరాటం నుండి ఆవిర్భవించిన భారతదేశ లౌకిక జాతీయవాదం స్థానంలో హిందూ సాంస్కృతిక జాతీయ వాదాన్ని స్థాపించాలని హిందుత్వవాదులు ప్రయత్నిస్తున్నారు. దేశం తమ ఆధీనంలో ఉండటాన్ని అవకాశంగా తీసుకుని, తమ విధానానికి వ్యతిరేకంగా ఉన్న అన్ని సమూహాల పై హింసను ప్రేరేపిస్తున్నారు. తమ తరహా జాతీయతను బలవంతంగా రుద్దుతున్నారు. దానిని అనుసరించడానికి తిరస్కరిస్తున్న లేదా దేశాన్ని ఒక మూసపోత ఏకశిలా నిర్మాణంలో ఇమడ్చడానికి చేసే వారి ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్న వారిపై విచ్చలవిడిగా హింసను ప్రయోగిస్తున్నారు.

భారతదేశం సార్వభౌమత్వాన్ని, అస్తిత్వాన్ని కోల్పోతూ ఈనాడు అతి విపత్కరమైన, భయానకమైన స్థితిలోకి నెట్టబడుతున్నదని చాలామంది భావిస్తున్నారు. భారతదేశ ఆత్మలుగా ఉన్న, రాజ్యాంగపరంగా ఏర్పడిన వ్యవస్థలన్నీ ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేయబడుతున్నాయి. ఒక నిరంకుశ ఆధిపత్య పాలన రాబోతున్న దానికి సంకేతాలు కనిపిస్తున్నాయి. సమాజం, రాజకీయాలు రెండింటిలోనూ చర్చలకు తావు లేకుండా చేస్తున్నారు. భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న వారిపై భౌతికదాడులను ప్రోత్సహిస్తున్నారు. రాజ్యాంగ వ్యవస్థాపకులు ఆశించిన అసమానతలు లేని ప్రజాస్వామ్యయుతమైన, ప్రజాతంత్ర రిపబ్లిక్ వ్యవస్థని నాశనం చేస్తూ, ఆ స్థానంలో మతతత్వ రాజ్యాన్ని స్థాపించే ప్రయత్నాలు చేస్తున్నారు. హింసాయుతమైన హిందుత్వ మతతత్వవాద సిద్ధాంతం మార్గదర్శకంగా ఉన్నవారు త్వరత్వరగా జాతీయ లౌకికవాద స్థానాన్ని ఆక్రమిస్తున్నారు.

వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటం నుండి భారత జాతీయవాదం ఆవిర్భవించింది. భారతదేశ ఉపఖండంలోని వివిధ తరగతుల ప్రజలు ఈ ఉద్యమకాలంలో ఒక చోటికి చేరారు. వారంతా 'న్యాయమైన, సమానత్వం గల' లౌకిక ప్రజాతంత్ర సూత్రాల ఆధారంగా నిర్ధారించబడిన సమాజం స్థాపించడానికి ఒక చోట కూడారు. హిందూ మతతత్వవాదుల ఆధ్వర్యంలోని ఆర్ఎస్ఎస్ ఈ విధానాలకు సదా వ్యతిరేకం. సంఘ్, దాని మేధో మార్గదర్శకుల దృష్టిలో భారతదేశం ఎల్లప్పుడూ ఒక హిందూ రాజ్యంగా విలసిల్లేది. కానీ విదేశీయులు, ముఖ్యంగా ముస్లింలు దాడిచేసి జయించడం వల్ల అది పతనం అయింది. అందువల్ల బ్రిటిష్ పాలకులు భారతదేశాన్ని వదిలి వెళ్ళగానే హిందూ దేశాన్ని స్థాపించాలని వారు భావించారు. ప్రజాతంత్ర వ్యవస్థలో గల అవకాశాలను ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభ వంటి మతతత్వ కూటములు తమ ఆశయ సాధనకు ఉపయోగించుకున్నాయి. జాతిపిత మహాత్మా గాంధీని హత్య చేసినట్లు ఆ సంస్థలను అనుమానిస్తున్న సమయంలో కూడా భారతదేశ లౌకిక, ప్రజాతంత్ర రాజకీయ విధానాన్ని బాహాటంగా వ్యతిరేకించాయి. సాహిత్యం, అసత్య ప్రచారం, ఎన్నికలలో వాక్ చాతుర్యంతో కూడిన ప్రసంగాలతో పాటుగా, మతతత్వ హింసాయుత దాడులలో చురుకుగా పాల్గొనడం ద్వారా సమాజంలో మతతత్వం నిరంతరంగా సజీవంగా ఉండడానికి ప్రయత్నం చేశారు. ఈ చర్యలు భారతదేశ రాజకీయాలలో ప్రజాతంత్ర వ్యతిరేక ధోరణులు పెరగడానికి ఉపయోగపడ్డాయి.

భారతదేశ ప్రజల నుండి వారి విధానాలకు మద్దతు లోపించడం వలన భారతీయ జనతా పార్టీ తన రాజకీయ అనుయాయులు రాజ్యాన్ని హస్తగతం చేసుకోవడానికి, రాజ్య పరిపాలనా యంత్రాంగాన్ని మతతత్వ ఆలోచనలతో నింపటానికి అవసరమైన విధంగా రాజకీయ శిక్షణనిచ్చింది. అందువల్లే 1977, 1997, 2014లో సంఘ్ పరివార్ కేంద్రంలో అధికారంలోకి రాగలిగింది. వారు 'హిందూ రాజ్యం' ఏర్పడడం అన్నదానికి తొలి ప్రాధాన్యతనిచ్చారు. భారతదేశం లౌకిక రాజ్యంగా కాక, 'హిందూ దేశం' గా ఉండడం సహజమైనదిగా చేయాలని వారు భావించారు.

కాని భారతదేశం ఆధునిక దేశంగా ఉండాలని, జాతీయత, సార్వభౌమత్వ ఆలోచనలు కలిగి ఉండాలని ఈనాటి భారతీయులలో అత్యధిక భాగం కోరుకుంటున్నారు. వారు పౌరసత్వం, లౌకికత, సోషలిజం, అంతర్జాతీయత, రాజ్యాంగం, మొదలైన స్వాతంత్రోద్యమ కాలం నాటి భావనలు జీర్ణించుకున్నారు. కాబట్టి ఈ ఆధునిక ఆలోచనలను చట్టవ్యతిరేకంగా చిత్రించాల్సిన అవసరం హిందూ మతతత్వ అంగాలన్నిటికి ఏర్పడింది. 'హిందూ జాతి' వాదం ఆధునిక ఆలోచనలను మంటగలుపుతుంటుంది. అందువల్ల భారతదేశ ఆధునిక రాజకీయాలు, సామాజికాభివృద్ధి, సంస్కృతి, తదితరాలకు మతతత్వం కళ్లెం వేయ పూనుకుంది ఇందుకు రెండు రకాలైన విధానాలను అవలంభిస్తున్నారు. మొదటగా భారతదేశంలో లౌకిక, ప్రజాతంత్ర, సార్వజనీన ఆలోచనలు, ఆచరణలకు ప్రతీకగా నిలిచిన అన్ని సంస్థలు, వ్యక్తులపై దాడులు చేస్తున్నారు. ఆ తర్వాత తమ వాదనలు సరైనవని బలవంతంగా అయినా ఒప్పించి, అవే నిజమని నమ్మే స్థితికి తీసుకురావటానికి ప్రయత్నం చేస్తున్నారు.

**భారత జాతీయవాద పునాదులపై దాడి**

హిందూ మతతత్వవాదం స్వతంత్రం వచ్చిన నాటి నుండి స్వాతంత్ర్యోద్యమాన్ని, దాని నాయకుడు, స్వాతంత్ర్యోద్యమానికి గుర్తుగా

> **“ అదేవిధంగా స్వాతంత్రోద్యమం ఒక సాధారణమైన ఉద్యమంగా, రాజకీయాల జిత్తులమారి ఆటగా, ఈ నాడు ఎన్నికలలో జరుగుతున్న పోరాటాలలో ఒకరికి వ్యతిరేకంగా మరొకరు ఉన్నట్టే, అప్పుడు కూడా ఉండేవారని చూయించటానికి ప్రయత్నం చేస్తున్నారు. గాంధీ, నెహ్రూ సుభాష్ చంద్రబోస్ వ్యతిరేకులని ఒకవైపు, నెహ్రూకి పటేల్ వ్యతిరేకి అని మరోవైపు చూపుతున్నారు. ఇదంతా ఒక ఆటలో భాగమే. నాయకులను బలహీనులుగా, వ్యక్తిత్వం లేనివారుగా, చేతకాని వారుగా చూపే ప్రయత్నం చేస్తున్నారు. ”**

నిలిచిన, భారత జాతీయోద్యమానికి ప్రతీకగా ఉన్న, సుప్రసిద్ధుడైన మహాత్మా గాంధీ భావాలను అపఖ్యాతిపాలు చేయటంపై దృష్టి పెట్టింది. గాంధీని చంపి, ఆయనపై, స్వాతంత్రో ద్యమంపై దాడి చేసిన గాడ్సేని పొగడటంలో తలమునకలైంది. గాంధీని చంపడంతో ఆగలేదు. గాంధీని ప్రజల మనసుల నుంచి, జ్ఞాపకాల నుంచి పూర్తిగా తొలగించే పనిలో పడింది. ఆయనతో పాటు కాంగ్రెస్‌లో ఉన్న సహచరుల నుండి ఆయనను వేరు చేసింది. రాజకీయాలకు సంబంధం లేని వ్యక్తిగా, చివరి రోజులో అతని అనుచరులు, ముఖ్యంగా జవహర్లాల్ నెహ్రూ మోసం చేసినందువల్ల రాజకీయాలకు దూరంగా ఉన్న వ్యక్తిగా గాంధీని చిత్రీకరిస్తున్నారు. స్వచ్ఛ భారత్‌కు గుర్తుగా మాత్రమే గాంధీని చూపడం అంటే, 1920లలో స్వాతంత్రోద్యమ గమనాన్ని సమూలంగా మార్చిన వాడిగా, ఆ తర్వాత 30 ఏళ్లు స్వాతంత్రోద్యమానికి మార్గదర్శకుడిగా కాక, భవిష్యత్ తరాలలో గాంధీని కేవలం హిందూ మతానికి గుర్తుగా, ఒక హిందూమత సేవానిరతునిగా చూపాలని చేసే ప్రయత్నం అనుకోవాల్సి ఉంటుంది.

జాతీయోద్యమంపై అబద్ధాల ప్రచారాలు చేస్తున్నారు. దానిని అపఖ్యాతి పాలు చేయటానికి, నిరుపయోగమైనదిగా చిత్రించటానికి ప్రయత్నం చేస్తున్నారు. ఆ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖ నాయకులు, ముఖ్యంగా నెహ్రూ వ్యక్తిత్వాన్ని కించపరచడానికి, ప్రజలలో తప్పుడు అభిప్రాయాలు ఏర్పరచడం కోసం క్రమబద్ధంగా అసత్య ప్రచారం కొనసాగిస్తున్నది. తప్పుడు ప్రకటనలు ఇస్తున్నది. స్వాతంత్రోద్యమ కాలమంతా లౌకికతకు కట్టుబడి నిలిచిన కీలకమైన వ్యక్తి నెహ్రూను, అతని అనుచరులను బ్రిటిష్ ఏజెంట్లుగా ప్రచారం చేస్తున్నారు. చర్చలు జరపటం చేతకాక దేశ విభజనకు అంగీకరించిన వాళ్ళు గాను, పరిపాలన చేతకాకపోవటం వల్లే చైనాతో జరిగిన యుద్ధంలో ఓడిపోయాడని చూపేందుకు ప్రయత్నిస్తున్నది. దేశంలో ముస్లిం జనాభా పెరగడానికి అవకాశం కల్పించిన ఫలితంగా మరోసారి దేశ విభజన జరగాలని డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడిందని ప్రచారం చేస్తున్నారు.

స్వాతంత్ర్యపోరాట వారసత్వం, ఆలోచనలను ప్రజలలో పలుచన చేసేందుకు, దేశ విభజనతో మనం మోసపోయామని, హిందువులు అధికారాలు కోల్పోయి, బలహీనులయ్యారని, క్రమబద్ధంగా ప్రచారం చేయటం ద్వారా అసంతృప్తిని పెంచటానికి, దానిని రాజకీయంగా వినియోగించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నది. ఆగస్టు 14వ తేదీని భయానక విభజన జ్ఞాపక దినంగా ప్రకటించి, హిందువులు విభజనకు బలయ్యారనే కథకు ప్రచారం కల్పిస్తున్నది. హిందువులు భరించవలసి వచ్చిన హింసకు స్వతంత్ర దినాన్ని చిహ్నంగా చూపేందుకు మరో ప్రయత్నం జరుగుతున్నది.

అదేవిధంగా స్వాతంత్రోద్యమం ఒక సాధారణమైన ఉద్యమంగా, రాజకీయాల జిత్తులమారి ఆటగా, ఈ నాడు ఎన్నికలలో జరుగుతున్న పోరాటాలలో ఒకరికి వ్యతిరేకంగా మరొకరు ఉన్నట్టే, అప్పుడు కూడా ఉండేవారని చూయించటానికి ప్రయత్నం చేస్తున్నారు. గాంధీకి, నెహ్రూకి సుభాష్ చంద్రబోస్ వ్యతిరేకి అని ఒకవైపు, నెహ్రూకి సర్దార్ పటేల్ వ్యతిరేకి అని మరోవైపు చూపుతున్నారు. ఇదంతా ఒక ఆటలో భాగమే. నాయకులందరినీ బలహీనులుగా, వ్యక్తిత్వం లేనివారుగా, చేతకాని వారుగాను చూపే ప్రయత్నం చేస్తున్నారు. స్వాతంత్రోద్యమానికి ముందు గుర్తించబడని నాయకులు ఉన్నట్లు, లేదా వారు దేశం కోసం ప్రాణాలు అర్పించినట్టుగా మరోవైపు చూపుతున్నారు. తద్వారా బ్రిటీషువారికి వ్యతిరేకంగా పోరాడడం అన్నది ప్రాధాన్యత లేని అంశంగా చూపే ప్రయత్నం జరుగుతున్నది. స్వాతంత్రోద్యమం, అందులో చురుకుగా పాల్గొన్న నాయకుల ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్వాతంత్ర్యం సాధించి 75 సంవత్సరాలైన సందర్భాన్ని పురస్కరించుకుని జరుగుతున్న ‘ఆజాదికా అమృత్ మహోత్సవ్’ లో దీనినే ప్రచారం చేయటానికి పూనుకున్నారు.

అలాగే ఆనాడు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న నాయకుల ప్రాధాన్యతను కూడా తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అదే సమయంలో వి.డి. సావర్కర్, గాడ్సే లేదా ఇతర హిందూ మతతత్వవాదుల ప్రాధాన్యతను, రాజకీయ క్రియాశీలతను పెంచే ప్రయత్నం చేస్తున్నారు. వారికి గుర్తింపు, గౌరవం తెచ్చే అంశాలకు ప్రాముఖ్యత ఇస్తున్నారు. సామ్రాజ్యవాదులకి వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో హిందూ మతతత్వవాదులు, నాయకులు భాగస్వాములు కాలేదన్న వాస్తవాన్ని దీంతో కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారు. బ్రిటీషు వారితో కుమ్మక్కయ్యారని తమపై ఉన్న అపవాదును తొలగించుకోవాలని భావిస్తున్నారు.

భారత జాతీయ జీవనం, జాతీయోద్యమ మౌలిక అంశాలను అప్రతిష్ఠ పాలు చేయటానికి తమ చర్చలు, రాజకీయాల ద్వారా సాధారణ ప్రజల దృక్పథంలో సాయుధీకరణ కావాలన్న భావాలను పెంచుతున్నారు. సైనికీకరించడం ఆర్ఎస్ఎస్ సైనిక సిద్ధాంతంలో కీలకమైన అంశం. సైనిక సేవలు దేశ ప్రజలందరికి తప్పనిసరి చేయాలని, ఇజ్రాయిల్‌తో సంబంధాలు పెట్టుకోవాలని, ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన అమెరికాతో దగ్గరి సంబంధాలు కలిగి ఉండాలని, అణుబాంబు కలిగి ఉండాలని డాక్టర్ బి.ఎస్ మూంజి వంటి మహారాష్ట్ర కూటమికి చెందినవారు చెప్పటం సైనికీకరణపై ఆర్ఎస్ఎస్ ఆలోచనలను వెల్లడిస్తున్నాయి. సైనికీ కరించడానికి ఇంతటి ప్రాధాన్యతనివ్వడం సహజమైనదిగా పౌర సమాజం చేత అంగీకరింపచేయడానికి పౌరాణిక అంశాలను ఆలంబన చేసుకుంటున్నారు.

భారతదేశ చరిత్ర, ముఖ్యంగా మధ్యయుగాల చరిత్రను తీసుకుని భారతదేశం

విదేశీయుల చేతిలో –ఆఫ్ఘన్‌లు, తుర్కులు, మొగలులు– ఓడినందుకు ఇప్పుడు ప్రతీకారం తీర్చుకోవాలని వాదిస్తున్నారు. భారతదేశం ఓటమిపాలైన చారిత్రక సంఘటనలను తుడిపేయాలని ఒకవైపు ప్రయత్నం చేస్తూ, మరోవైపు ప్రాంతీయంగా విజయాలు సాధించిన హిందూ నాయకులను పునః ప్రతిష్టించాలని, వారి ఘనతను ప్రచారం చేసుకోవాలని తాపత్రయపడుతున్నారు. వారి ప్రణాళిక అమలు చేయలేకపోయినప్పుడల్లా హిందూ జాతీయవాదాన్ని పెంచుకోవడానికి సైనిక, పోలీసు చర్యలను ఆశ్రయిస్తున్నారు. అందువల్లే చరిత్రను, గొప్పగొప్ప చరిత్రకారులను హిందూ మతతత్వవాద సమూహాలు లక్ష్యంగా చేసుకుంటున్నాయి. పురాణాలు, ప్రాంతీయ విజయాలు కొత్త చరిత్రకు లక్ష్యాలుగా మారాయి.

దీనికి తోడు జాతీయ సైనికీకరణలో దూకుడు పెంచాలని ప్రకటించారు. ఇప్పుడిక జాతీయతకు కొత్త అర్థాన్ని ఇచ్చే ప్రయత్నం జరుగుతున్నది. శత్రువు, యుద్ధం, దాడికి ప్రాధాన్యతలు పెరుగుతున్నాయి. దేశం కోసం ప్రాణత్యాగం చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న ప్రజల త్యాగాల ప్రాధాన్యత తగ్గించబడింది. హిందూ మతతత్వవాదులు అధికారం, శక్తి, బల ప్రదర్శనలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. నిజానికి స్వాతంత్రోద్యమ కాలంలో సామాన్యులు కూడా ఈ గొప్ప విలువలను ఆచరించేవారు.

**మతతత్వవాదాన్ని సాధారణీకరించడం**

ప్రచార మాధ్యమాలను, రాజ్యానికి సంబంధించిన సంస్థలను, నూతన ప్రపంచాన్ని గురించిన భావాలను విస్తృతంగా ప్రచారం చేయటం కోసం వినియోగించు కోవటం అన్న మూడు విధానాలను మతతత్వాన్ని సాధారణీ కరించటం కోసం మతతత్వవాదులు వినియోగించు కుంటున్నారు..

**1.** భారత రాజ్యం 'హిందూ రాజ్యం' అని ప్రచారం చేయడం. ప్రపంచవ్యాప్తంగా రాజ్యాలు, రాజ్య వ్యవస్థలను జాతిగా చూపడం సాధారణంగా కొనసాగుతూ వస్తున్నది. జాతీయోద్యమ కాలంలో దీనిని ఆ నాటి భారత జాతీయోద్యమ నాయకులు బాగా అర్థం చేసుకున్నారు. జాతీయ ప్రయోజనాలను సామ్రాజ్యవాదులు సులభంగా ఉపయోగించుకునే అవకాశాలు ఉన్నాయని గ్రహించారు. యూరప్‌లో 18-19

" ఇప్పుడిక జాతీయతకు కొత్త అర్థాన్ని ఇచ్చే ప్రయత్నం జరుగుతున్నది. శత్రువు, యుద్ధం, దాడికి ప్రాధాన్యతలు పెరుగుతున్నాయి. దేశం కోసం ప్రాణత్యాగం చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న ప్రజల త్యాగాల ప్రాధాన్యత తగ్గించబడింది. హిందూ మతతత్వ వాదులు అధికారం, శక్తి, బల ప్రదర్శనలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. నిజానికి స్వాతంత్రోద్యమ కాలంలో సామాన్యులు కూడా ఈ గొప్ప విలువలను ఆచరించేవారు. "



**స్వాతంత్ర్యోద్యమ ర్యాలీలో ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ తో గాంధీజీ : జాతీయోద్యమ నాయకత్వాన్ని తక్కువ చేయడం, ఉద్యమానికి ద్రోహం చేసిన సంఘ్ పరివార్ నాయకులను గొప్పవారిగా చిత్రీకరించడం ఆర్ఎస్ఎస్ ప్రచార ఎత్తుగడలో భాగం**

శతాబ్దాలలో సామ్రాజ్యవాదం పెరగడానికి జాతీయవాదమే కారణం. విభిన్న ప్రాంతాల, మతాల ప్రజలు ఒకే విధంగా ఉన్నట్టు, అత్యధిక ప్రజలు ఆచరిస్తున్న పద్ధతులనే ఆచరిస్తున్నట్టు చూపడం జరిగింది. ఇటువంటి జాతీయవాదాన్ని సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం ఉపయోగించుకోకుండా ఉండడటానికి రాజ్యాంగం హామి కల్పించేది.

అందువల్లే 1947లో ప్రభుత్వ మార్పు చాలా సుహృద్భావ వాతావరణం జరిగినా, జాతీయత పేరుతో హిందూ రాష్ట్రాన్ని కోరుకునే వారి చేతుల్లోకి రాజ్యం వెళ్లి హిందూ రాష్ట్రంగా ఏర్పడకుండా ఉండటానికి కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఎంతగానో శ్రమించాల్సి వచ్చింది. విభజన తర్వాత జరిగిన హింసకు కూడా కారణం అదే. జాతీయోద్యమం బలంగా ఉండి చాలా రోజులు సాగినట్టు, రాజ్యంలో ఉండే ఒంటెత్తు పోకడలు, విభజనల నన్నింటిని గట్టిగా కలిపి ఉంచినట్టు కనిపిస్తుంది. అందువల్లే కొన్ని ప్రాంతాల్లో మతతత్వ పోకడలు ఉన్నప్పటికీ మతతత్వ ధాటికి కొట్టుకుపోకుండా భారతదేశం లౌకిక రాజ్యం అయింది. మతతత్వం పై చేయి సాధించి ఉంటే కొత్తగా ఏర్పడిన రాజ్యం దాదాపు నియంతృత్వ రాజ్యంగా అవతరించి ఉండేది. ఇది ప్రజాతంత్ర రాజ్యం ఏర్పాటు చేసుకోవాలన్న ప్రజల భావనలకు పూర్తిగా భిన్నమైనది.

ముస్లిం మతతత్వవాదం కూడా అదే విధమైన ఆలోచనలతో నిలదొక్కుకుని, హిందూ

> **“ రాజకీయంగా, మేధోపరంగా 19, 20 శతాబ్దాలలో కాపాడుకున్న విలువైన మత, భాషాపరమైన, సాంస్కృతిక వైవిధ్యాలు ఈ క్రమంలో నాశనం అవుతున్నాయి. సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా భారతదేశ ప్రజలను ఐక్యం చేసేటప్పుడు కూడా ఈ వైవిధ్యాన్ని కాపాడుకున్నారు. చారిత్రికంగా అణచివేతకు, వివక్షకు గురైన దళితులు, తరతరాలుగా తమని అణచి వేసిన 'బ్రాహ్మణ ఆధిపత్యం' తిరిగి తలెత్తడాన్ని, ఆధునిక హిందూ గుర్తింపు రూపంలో ముందుకు రావడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ”**

మతతత్వవాద సంఘాలకు, వారి భావాలకు ఆమోదనీయతను కల్పించింది. అయితే హిందూ మతతత్వ సంస్థలు మాత్రమే మతతత్వాన్ని పెంచి భారతదేశాన్ని మత రాజ్యాంగా మార్పు చేసే ప్రయత్నాలు చేసాయి. వారు దేశాన్ని దాదాపు ఒక నియంతృత్వ రాజ్యాంగా మలచాలని భావించారు. ఇది ప్రజాతంత్ర, లౌకిక భావాలకు వ్యతిరేకం. సోషలిస్టు ఆలోచనలకు, భారత ప్రభుత్వం, రాజకీయ పార్టీల దృక్పధానికి భిన్నమైనది. అందువల్లే స్వతంత్ర పార్టీ వంటి పార్టీలు, లేదా ఫోరమ్ ఫర్ ఫ్రీ ఎంట్రప్రెన్యూర్స్ వంటి సంఘాలు సోషలిస్టు భావాలను వ్యతిరేకిస్తూ పెట్టుబడిదారీ విధానానికి పూర్తి అనుకూలమైనప్పటికీ, వారికంటూ ఎటువంటి మతతత్వం లేకపోయినా, హిందూ మతతత్వవాద సమూహాలతో సహజ మిత్రులుగా ఉండగలిగాయి. వారు నెహ్రూ, ఆయన తర్వాత ఇందిరా గాంధీని, ద్వేషించారు. నెహ్రూను ద్వేషించడం, అప్రతిష్టపాలు చేయడం, కుట్రలు పన్నడం 1948 నుండి మొదలయ్యాయి. నెహ్రూ, కమ్యూనిస్టుల మధ్య సంబంధాలు అడపాదడపా ప్రమాదంలో పడుతుండేవి. హిందూ మతతత్వ సంస్థలు లౌకికతత్వానికి, సోషలిస్టు భావజాలానికి వ్యతిరేకంగా నిరంతరం కలిసి పనిచేస్తూనే ఉన్నాయి. ప్రఖ్యాత చరిత్రకారుడు బిపిన్ చంద్ర అన్నట్టు, ముస్లిం వ్యతిరేకతే వారి బంధులో కీలకమైన అంశం.

ఈ రోజు జాతీయవాదం కోసం చేసే ప్రయత్నాలు ఇందుకు పూర్తిగా భిన్నమైనవి. హిందూ మతతత్వవాదం భారత జాతీయవాదం స్థానంలోకి రాబోతోంది. తనదైన జాతి, 'హిందూ జాతి'ని స్థాపించబోతోంది. జాతి, జాతీయతలకు మతతత్వం ఇచ్చే నిర్ధారణలు సామ్రాజ్యవాద రంగులు పులుముకుంటున్నాయి. 'హిందూ మతం' ఒక ఏకశిలా సదృశ్యమైనదన్న కల్పనలను ప్రచారం చేస్తున్నారు. 'హిందూ దేశం' ను దాని కేంద్రంగా చూపే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవానికి హిందూ మతం ఏకశిలా సదృశ్యమైనది కాకపోవడం వల్ల, ఈ అవగాహనతో భారతదేశమంతటికి కేంద్రంగా ఏ ఒక్క రాష్ట్రం లేకపోవడం వల్ల, రాజ్యం ఒకవైపు, హిందూ మతతత్వవాదులు మరో వైపు భారతదేశం నలుమూలలా హింసను వ్యాపింపచేస్తున్నారు. చర్చలలో, భౌతికంగా కూడా తమకు భిన్నమైన అభిప్రాయాలు కలవారిపై హింసకు తెగబడుతున్నారు. తమ ఆలోచనలను ఆమోదించని వారిపై దాడులు చేసి బలవంతంగా ఒప్పిస్తున్నారు. ఏకాభిప్రాయం ఉన్నట్టు చిత్రిస్తున్నారు.

రాజకీయంగా, మేధోపరంగా 19, 20 శతాబ్దాలలో కాపాడుకున్న విలువైన మత, భాషాపరమైన, సాంస్కృతిక వైవిధ్యాలు ఈ క్రమంలో నాశనం అవుతున్నాయి. సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా భారతదేశ ప్రజలను ఐక్యం చేసేటప్పుడు కూడా ఈ వైవిధ్యాన్ని కాపాడుకున్నారు. చారిత్రికంగా అణచివేతకు, వివక్షకు గురైన దళితులు, తరతరాలుగా తమని అణచి వేసిన 'బ్రాహ్మణ ఆధిపత్యం' తిరిగి తలెత్తడాన్ని, ఆధునిక హిందూ గుర్తింపు రూపంలో ముందుకు రావడాన్ని వ్యతిరేకిస్తున్నారు.

**2.** మతతత్వ శక్తులు కొత్తగా ఏర్పడ్డ ప్రత్యేక పరిస్థితిని సాధారణీకరించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇతర ప్రాంతాల్లో లాగే భారతదేశంలో జాతీయవాదం, జాతీయోద్యమం, లెక్కలేనన్ని మేధోపర, రాజకీయ గళాలు ఒకదానితో ఒకటి తీవ్రంగా విభేస్తున్నప్పటికీ, తమ వాదనలు వినిపించేందుకు వాటికి అవకాశం కల్పించాయి. నెహ్రూ సోషలిజం నుండి గాంధీ గ్రామ స్వరాజ్యం వరకు, లేదా హిందుత్వ నుండి అంబేద్కర్ తీవ్రంగా విభేదించడం వరకు, సమూల సంస్కరణలు అమలు చేయడం కోసం కమ్యూనిస్టులు ప్రజా సమీకరణలు చేయడం వరకు, మావోయిస్టుల గ్రామీణ విప్లవం పిలుపు నుండి (ఇ.వి. రామస్వామి) పెరియార్ సమానత్వ అన్వేషణల వరకు విభిన్న ఆలోచనలకు భారతదేశంలో జాతీయవాదం నిలయంగా మార్చింది. సమాజంలోని అనేక సమూహాలు ప్రజలను ప్రభావితం చేయడానికి రాజకీయ కార్యకలాపాలకు అవకాశం కల్పించింది. వైవిధ్యభరితమైన సామాజిక దృష్టి వివిధ పార్టీలకు, అనేక రకాల రాజకీయ కార్యాచరణలకు అవకాశం కల్పించింది.

తమకంటూ నిర్ణయాత్మక కార్యకలాపం లేనందువల్ల హిందూ మతతత్వవాదులు, హిందూ మతతత్వానికి ఆవలనున్న ప్రతి సిద్ధాంతాన్ని ప్రత్యేకమైనదిగా చూపే ప్రయత్నం చేస్తారు. ఈ క్రమం ఎంత దూరం పోతుదంటే వారు ఈ ప్రత్యేకతలను వ్యతిరేకించటమే కాకుండా వారిని రాజ ద్రోహులుగా, దేశద్రోహులుగా పరిగణిస్తున్నారు. రాజ్యాంగంలోని 370 అధికరణ రద్దును విమర్శించడం, ప్రధానమంత్రిని విమర్శిస్తూ ఫేస్‌బుక్‌లో రాయడం నేరంగా, జాతి వ్యతిరేకమైనదిగా పరిగణిస్తున్నారు. ఈ ప్రత్యేకతల మాటున రాజ్యం యొక్క అధికారాన్ని కిరాతకంగా, నిఘాకు సాధనంగా వినియోగించటం సాధారణమైన విషయాలుగా చూపుతున్నారు.

**3.** మూడో విషయం, ఒక వ్యక్తిని గాని, సంస్థని గానీ, సమూహాన్ని గాని పూర్తిగా ఉపేక్షించదగిన వారిగా చూడడం సాధారణ విషమైనట్లు ప్రచారం చేస్తున్నారు. ముస్లింలను బహిరంగంగా కొట్టి చంపేస్తుండడం, చట్టాలతో నిమిత్తం లేకుండా నేరస్థులనే పేరుతో కాల్చివేయటం, తన ప్రత్యేకమైన స్వరూపానికి శత్రువులని భావించిన వారిని రాజ్యం తుదముట్టించటం అన్నవి సాధారణమైన విషయాలుగా చూయిస్తున్నారు.

సైనికీకరణను నిరంతరంగా కొనసాగించడం, రక్షణ పెంచుతుండడం కూడా ముస్లింలను శత్రువులుగా చూపడానికి దోహదం చేస్తున్నది. ఇదే ఆర్‌ఎస్‌ఎస్ దాని అనుబంధ సంస్థల మౌలిక ప్రాపంచిక దృక్పధం. ముస్లింలను శత్రువులుగా చూపడం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ తన కలల పట్టికకు ఒక నిర్మాణ రూపం ఇవ్వగలుగుతున్నది. భారతదేశ లౌకికత, నెహ్రూ లౌకికవాదం అంటే ముస్లింలను బుజ్జగించడంగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం చేస్తున్నది. అందువల్ల ముస్లింలు,

నెహ్రూ, లౌకికవాదం, మూడూ ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంస్థలు దాడి చేయవలసిన త్రిమూర్తులు అయ్యాయి. లౌకికవాదం గురించి, మైనారిటీ ముస్లిం మతస్తుల తరపున మాట్లాడిన వారిలో ముస్లింలు దాగి ఉన్నట్లు, లేదా ముస్లిం తల్లి తండ్రులో, బయటికి ప్రకటించని భర్త లేక భార్య ఉన్నట్టు హిందూ మతతత్వ సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. ముస్లింలను సామాజికంగా హీనస్థాయి కలవారిగా చూపడం వీటన్నిటిలో ఉన్న ఒక సాధారణ అంశం. మమతా బెనర్జీని ముస్లిం మతస్థురాలిగా వ్యంగ చిత్రంలో చూపడం, ఆమెను ముస్లిం అనుకూలురాలిగా చిత్రించడం, ఆమె ముస్లిం మతం స్వీకరించిందనడం ఇటువంటి పథకంలో భాగాలే.

ముస్లింలను భారతీయులుగా మార్చాలనే ప్రచారం 1970లలో జనసంఘ్ మొదలు పెట్టింది. అంటే తమకు వారికంటే ఎక్కువ దేశభక్తి ఉందని చూపడమన్నమాట. ఆ రోజుల్లో ఇటువంటి ఎత్తుగడలకు భారతదేశంలోని అన్ని రాజకీయ పక్షాల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా ఈనాడు ముస్లింలపై తీవ్రవాదులుగా ముద్ర ఉండడం వల్ల ఆర్ఎస్ఎస్ ముస్లిం వ్యతిరేక ప్రచారం మరింత సులువైంది. మరింత గట్టిగా తన గళాన్ని వినిపించే అవకాశం ఏర్పడింది. ఇటువంటి చిత్రీకరణలను బలంగా ప్రచారం చేస్తున్నారు. ఇటువంటి విషయాలు సర్వసాధారణమని అనుకునే స్థితి భారతదేశంలోని మధ్య తరగతి ప్రజలలో ఏర్పడింది.

ట్రిపుల్ తలాక్, పౌరసత్వ సవరణ చట్టం ద్వారా రాజ్య అధికార యంత్రాంగంలో మార్పులు చేసి, భారతదేశాన్ని ఆధునీకరిస్తున్నట్టుగా, భారతీయకరణ చేస్తున్నట్టుగా రాజ్యం అనుసరించే విధానాలను చూపుతున్నారు. మొత్తం ముస్లిం సమాజాన్నంతటిని ఒక ప్రత్యేకమైన వారిగా చూపే కొత్త స్థితి ఏర్పడింది. హిందూ మతతత్వ భావాల ప్రచారాన్ని సరికొత్త జ్ఞానాన్ని ఇచ్చేదిగా చూపుతూ, ముస్లింలను గురించి అప్రమత్తంగా ఉండాలన్న స్థాయికి ప్రజలను చేర్చటానికి ప్రయత్నం చేస్తున్నారు. రాజ్యం నిరంతరం ఏదో ఒక అత్యవసర పరిస్థితిని ఎదుర్కొంటున్నట్టు – శత్రువుల దాడులో, తీవ్రవాదులో, అంతర్గత భద్రతో –చూపబడుతున్నది. ఆఖరికి ఎన్నికలను కూడా ఒక యుద్ధంగా చూపుతున్నారు. వీటన్నింటిలో కూడా ముస్లింలను సందేహాస్పద మైన వారిగా చూయించటమో లేదా మినహాయింపబడిన వారిగా చూపడం జరుగుతున్నది. వీటిని సాధారమైన అంశాలుగా చూయిస్తున్నారు. వీటన్నింటిలో రాజ్యం కూడా భాగస్వామి అవుతున్నది. తన పరిధులను మతతత్వం దిశగా ఎప్పటికప్పుడు విస్తరించుకుంటున్నది. చరిత్రలో ఇటువంటి వాటి పర్యవసానాలు చూస్తే, భయమేస్తుంది. ఎందుకంటే అటువంటి ప్రత్యేక సమూహాలను సమూలంగా నిర్మూలించిన దాఖలాలు చరిత్రలో అనేకం ఉన్నాయి. రాజ్యంతో సంబంధంలేని అనేక సమూహాలు ఈ పద్ధతులు అనుసరిస్తుండటం వల్ల చరిత్ర పునరావృతం అయ్యే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.

ఇటువంటి భయానక పరిస్థితులలో జోక్యం తప్పనిసరి. హింసను సాధారణీకరించే విధానాలు, హింసను ప్రోత్సహించే చర్యలు, ప్రత్యేకతలను సృష్టించడాన్ని ఎదుర్కోడానికి అవసరమైన రూపాలను రూపొందించుకోవలసిన అవసరం ఉంది. చరిత్రలో, దేశంలో జరిగిన స్వాతంత్రోద్యమమే గాక, అనేక సంఘటనలు ఉన్నాయి. ప్రజలు చైతన్యవంతంగా ఉండడం, సున్నితంగా మసలుకోవడం, స్పందించడం చూశాం. ఇవే మతతత్వ రాజ్య సిద్ధాంతం మనపై చేస్తున్న దాడికి సరైన మందు. ఇంతకు ముందు చెప్పుకున్నట్టు ఇటువంటి రాజ్యం హింసను పరాక్రమంగా చూపుతుంది. లౌకిక ప్రజాతంత్ర విలువలను వ్యతిరేకిస్తున్నది. జాతీయ దృక్పథం తనకున్నట్టు చూపుకోవడానికి ప్రజలలో ప్రాచుర్యం గల నాయకులను సొంతం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నది. మనం అందరం కన్న కలలను సాకారం చేసుకుందామని సంకల్పించుకోడం ద్వారా ప్రజలు సృష్టించిన దేశాన్ని తిరిగి పొందటం కోసం కృషి చేయటం కొనసాగించాలి.

**(అనువాదం : కె.ఉషారాణి)**

# భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు)

## కేంద్ర కమిటీ

సర్క్యులర్ సం. 2/2022

ఫిబ్రవరి 3, 2022

అన్ని రాష్ట్ర కమిటీలకు

***డియర్ కామ్రేడ్స్,***

హైదరాబాదులో 2022 జనవరి 7-9 తేదీలలో జరిగిన పార్టీ కేంద్రకమిటీ సమావేశంలో పార్టీ నిబంధనావళిని ఖరారు చేయబడిన సవరణలను పంపుతున్నాము. ఈ సవరణలు పార్టీ 23వ మహాసభ ముందు పరిశీలన కోసం, ఆమోదం కోసం ఉంచబడతాయి.

**ఆర్టికల్ 15**

కేంద్రకమిటీ,

16వ క్లాజుగా చేర్చాలి.

కేంద్రకమిటీకి ఎన్నికయ్యే సభ్యుల వయోపరిమితని, మహిళా కోటాను కేంద్రకమిటీ నిర్ణయించవచ్చు. రాష్ట్ర కమిటీలకు ఎన్నికయ్యే సభ్యుల వయోపరిమితిని, మహిళా కోటాను నిర్ణయించడానికి మార్గదర్శకాలను కేంద్రకమిటీ సూచించవచ్చు.

**ఆర్టికల్ 19**

పార్టీ క్రమశిక్షణ

క్లాజు 3వ చివర చేర్చాలి.

గృహహింస, లైంగిక హింసకు సంబంధించిన ఏ చర్యలైనా దీని క్రిందకు వస్తాయి.

పై సవరణలను పార్టీ శాఖలన్నింటికీ సర్క్యులేట్ చేయండి. పార్టీ పత్రికలలో ప్రచురించండి.

అభివందనములతో,


**సీతారాం ఏచూరి**

ప్రధాన కార్యదర్శి

మతతత్వం

# విఫలమైన భారత పాలక వర్గాలు

బిటి రణదివె



రచయిత సిపిఐ(ఎం) మాజీ పొలిట్ బ్యూరో సభ్యులు, సిఐటియు అగ్రనాయకులు

సిపిఐ(ఎం) అగ్రనాయకులు బి టి రణదివె 40వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 1987లో ఇంగ్లీష్ త్రైమాస పత్రిక మార్క్సిస్టుకు రాసిన వ్యాసాన్ని 75వ స్వాతంత్ర్య వార్షికోత్సవ సందర్భంగా పాఠకులకు అందిస్తున్నాం-సంపాదకుడు.

భారతదేశం స్వాతంత్ర్యం సాధించుకోవటం భూకంపం వచ్చిన విధంగా పాత వలస విధానాన్ని, సామ్రాజ్యవాదాన్ని కంపింపజేసి, వలస విధానంపై నిర్ణయాత్మకమైన దెబ్బకొట్టింది. ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో సోవియట్ యూనియన్ విజయం సాధించిన పూర్వరంగంలో ప్రారంభమైన నూతన ప్రపంచక్రమంలో వివిధ వర్గాల ప్రజల కార్యకలాపాలు, వారి ప్రయోజనాలు భాగమైనాయి. భారతదేశం స్వాతంత్ర్యం సాధించుకున్న అనంతరం జరిగిన సంఘటనలు, వాటి ఫలితాలు సామాజికాభివృద్ధి సూత్రాలకు అనుగుణంగా అభివృద్ధి సాధించటానికి దోహదం చేశాయి. నూతనయుగంతో ప్రపంచ బలాబలాలలో వచ్చిన మార్పు ఫలితంగా అందుబాటులోకి వచ్చిన చారిత్రకమైన అవకాశాల నేపథ్యంలో సాధించిన విజయాలను చూడాలి. నూతనంగా విముక్తి సాధించిన దేశాలలోని నూతన పాలకవర్గాల వర్గ పరిమితులను దృష్టిలో పెట్టుకొని సాధించిన విజయాలు, అనుభవాలను గురించి నిర్ణయాలకు రావాలి.

1960లో కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల సమావేశం ఆమోదించిన తీర్మానంలో ఈ విధంగా చెప్పారు. ' ఘనమైన అక్టోబరు సోషలిస్టు విప్లవ విజయంతో పెట్టుబడిదారి విధానం నుండి సోషలిజానికి పరివర్తన జరిగే యుగం ప్రారంభమైంది. రెండు విరుద్ధమైన సామాజిక వ్యవస్థల మధ్య పోరాటం జరుగుతున్న కాలంలో, సోషలిస్టు విప్లవాలు, జాతీయ విముక్తి విప్లవాలు జరుగుతున్న, వలస విధానం రద్దవుతున్న, సామ్రాజ్యవాదం విచ్ఛిన్నమౌతున్న, ప్రజలు అంతకంతకు ఎక్కువగా సోషలిజం మార్గాన్ని ఎంచుకుంటున్న, సోషలిజం, కమ్యూనిజం ప్రపంచవ్యాప్తంగా విజయం సాధిస్తున్న కాలంలో మనం ఉన్నాం'.

### అవకాశాలను వాస్తవాలుగా చేసుకోలేని స్థితి

వలస దాస్యం అంతమైన తర్వాత స్వతంత్ర భారతదేశానికి అవకాశాలు అందుబాటులోకి రావటానికి వెనుక ఉన్న పూర్వరంగం ఇది. భారతప్రజలు, ప్రజాతంత్ర, కార్మికవర్గ ఉద్యమాలు, స్వతంత్ర భారతదేశం ఈ నూతన యుగం అందిస్తున్న గొప్ప అవకాశాలను వినియోగించుకోలేక పోయాయనే అంశంపై వివాదం లేదు. తీవ్రమైన సామాజిక మార్పులను ప్రవేశపెట్టి, అభివృద్ధి మార్గంలో ముందడుగు వేయటానికి అవసరమైన శక్తి భారత ప్రజా వుద్యమానికి లేకపోయింది. మౌలిక వ్యవసాయక సమస్యల నుండి, వ్యవసాయక విప్లవం నుండి విప్లవపోరాటం వేరుపడింది. ఫలితంగా ప్రజాస్వామిక విప్లవాన్ని పూర్తి చేయవలసిన కర్తవ్యం అసంపూర్తిగా మిగిలిపోయింది. తర్వాతి దశకు, సోషలిజం కోసం పోరాడాల్సిన దశకు చేరాల్సిన సామాజిక పోరాటం ముందుకు సాగలేదు. విముక్తి పోరాటం, స్వతంత్ర భారతదేశ నాయకత్వం భూస్వాములతో కూటమి కట్టిన బూర్జువావర్గం చేతులలో ఉండటమే ఇందుకు కారణం. ఈ కూటమికి వ్యవసాయక విప్లవం పట్ల ఏ మాత్రం ఆసక్తి లేదు. తన ప్రయోజనాల కోసం, తన పాలనను స్థిరపరచుకోవటం కోసం అవసరమైన మార్పులను తీసుకురావటం పట్ల మాత్రమే వారు ఆసక్తి చూపించారు.

చైనాలో ఇందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి ఉన్నది. విముక్తి పోరాటం జరుగుతున్న కాలంలో పోరాటంలో రైతాంగాన్ని నడిపించటం ద్వారా కార్మికవర్గం నాయకత్వ స్థానానికి చేరుకున్నది. విముక్తి సాధించిన తర్వాత రైతాంగంతో మిత్రత్వం నెరపుతున్న కార్మికవర్గం చేతుల్లోకి రాజ్యాధికారం వచ్చింది. అందువలన విప్లవశక్తులు ప్రజాస్వామిక కర్తవ్యాలను పూర్తిచేసి, సోషలిజం నిర్మాణానికి సాగిపోవటానికి మార్గం సుగమమైంది. ఈ యుగం అందించిన అవకాశాలను పూర్తిగా ఉపయోగించుకున్నారు.

నాలుగు దశాబ్దాల స్వాతంత్ర్యం భారతదేశంలోని వర్గశక్తుల పరిస్థితిలో మౌలికమైన మార్పులకు దారితీయలేదు. అసంపూర్తిగా ఉన్న ప్రజాస్వామిక కర్తవ్యాలను పూర్తి చేయటానికి నాలుగు దశాబ్దాలకు మించిన కాలం చారిత్రకంగా అనివార్యం కాదు. జాతీయ విముక్తి పోరాటం సందర్భంలో కమ్యూనిస్టు ఉద్యమ బలహీనత, ఫలితంగా వ్యవసాయక విప్లవానికి ప్రజలను సన్నద్ధం చేయటం, వర్గ అధికారంపై ప్రత్యక్షంగా దాడిచేయటంలో అశక్తత వలన ఇది పొడిగింపబడుతున్నది. అందువలన భారతదేశంలోని బూర్జువా-భూస్వామ్యవర్గాల ప్రభుత్వం దీర్ఘకాలం పాటు స్థిరంగా కొనసాగింది.

### ప్రజల నుండి వర్గపాలనకు తీవ్రమైన సవాలు ఎదురుకాలేదు

బలమైన కమ్యూనిస్టు పార్టీ, కార్మికవర్గ నాయకత్వం, కార్మిక-కర్షక ఐక్యత లేకుండా ప్రజాస్వామిక విప్లవాన్ని పూర్తిచేయటం, తర్వాతి దశ అయిన సోషలిజానికి మార్గం సుగమం చేసే జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని పూర్తి చేయటం సాధ్యం కాదు. సిపిఐ(ఎం) కార్యక్రమం ఈ విధంగా చెప్పింది.'ప్రస్తుత దశలో మన విప్లవం ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక, గుత్త పెట్టుబడిదారి వ్యతిరేక, ప్రజాస్వామిక స్వభావం కలది. సోషలిజం సాధనకు ముందుకు సాగటం కోసం కార్మికవర్గం తప్పని సరిగా ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహించాల్సి ఉంటుంది'.

ఁ కార్మికవర్గ నాయకత్వంలో జనతా ప్రజాస్వామిక రాజ్యాన్ని స్థాపించటం, విదేశీ పెట్టుబడుల దోపిడి, పలుకుబడిని అంతం చేయటం, వ్యవసాయక విప్లవాన్ని జయప్రదం చేయటం అన్న కర్తవ్యాలను ప్రజాస్వామిక విప్లవం నెరవేర్చాలి. జనతా ప్రజాస్వామిక సంఘటనకు దృఢమైన కార్మిక-కర్షక ఐక్యత కీలకంగా, పునాదిగా ఉంటుంది. ఈ యుగంలోని ప్రస్తుత పరిస్థితులలో కార్మికవర్గం నెరవేర్చాల్సిన చారిత్రక కర్తవ్యం ఇది. ఈ కర్తవ్యాన్ని భారతదేశంలో పూర్తి చేయలేదు.

సిపిఐ(ఎం) వివిధ సందర్భాలలో తన బలహీనతలను గుర్తించి, వాటిని అధిగమించటానికి చర్యలు తీసుకుంటున్నది. కమ్యూనిస్టులు, వామపక్షాలు ఈ మధ్యకాలంలో తమ బలాన్ని పెంచుకున్నారు. సిపిఐ(ఎం) తీవ్రమైన అణచివేత, అర్థఫాసిస్టు నిర్బంధకాండను, ఆచరణలో నిషేధాన్ని(ఎమర్జెన్సిలో) అధిగమించాల్సివచ్చింది. అయినప్పటికీ అది మూడు రాష్ట్రాలలో ఎన్నికల విజయాలు సాధించి, ప్రజలలో పలుకుబడిని పెంచుకున్నది. అయినప్పటికీ తన చారిత్రక కర్తవ్యాన్ని నిర్వహించటానికి అవసరమైన శక్తిని సంపాదించుకోలేదు.

కార్మికవర్గ నాయకత్వంలో, విప్లవ చొరవతో ప్రత్యామ్నాయం కోసం ప్రజా పోరాటాలు ముందుకుసాగని స్థితిలో నూతన బూర్జువా-భూస్వామ్య పాలకులు పూర్తి అధికారాన్ని చలాయిస్తున్నారు. రోజులు గడుస్తున్నకొద్దీ ప్రజల కోరికలు, వారి ప్రజాస్వామిక ఆకాంక్షలు, ముఖ్యంగా ఫ్యూడల్ దోపిడీని అంతం చేయాలన్న రైతుల డిమాండ్‌తో పాలకుల విధానాలు ప్రత్యక్షంగా ఘర్షణ పడుతున్నాయి. పాలకవర్గాలు-ప్రజల మధ్య, పాలకవర్గాలు-సామ్రాజ్యవాదానికి మధ్య జరుగుతున్న ఘర్షణ కారణంగా గత నాలుగు దశాబ్దాలుగా జరుగుతున్న పరిణామాలు రూపుదిద్దుకున్నాయి.

### స్వాతంత్ర్యాన్ని కాపాడుకున్న భారతదేశం

గత నాలుగు దశాబ్దాలలో సానుకూల, ప్రతికూల పరిణామాలు జరిగాయి. సానుకూల పరిణామాలు. (1) భారతదేశం స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవటం, (2) అలీన విదేశాంగ విధానాన్ని అనుసరించటం, (3) అనేక కుదుపులు, దాడులు జరిగినప్పటికీ, షాక్‌లు తగిలినప్పటికీ భారత రాజ్యాంగాన్ని, పార్లమెంటరి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవటం, (4)జాతీయ ప్రణాళికా విధానం, ప్రభుత్వరంగాన్ని అభివృద్ధి చేసుకోవటం ద్వారా దాదాపుగా భారత ఆర్థికవ్యవస్థ స్వతంత్రతను కొనసాగించటం తదితరాలు సానుకూలమైనవి.

నూతనంగా విముక్తి సాధించిన ఏ దేశంలోని బూర్జువా పాలకవర్గాలకైనా ఇది అసాధారణమైన విజయం. మన చుట్టుపక్కల ఉన్న దేశాలు, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో జరుగుతున్న పరిణామాలకు ఇవి పూర్తి భిన్నమైనవి. వీటిలోని అనేక దేశాలలో ప్రత్యక్ష సైనికపాలన లేదా నకిలీ పార్లమెంటరీ విధానం అమలు జరుగుతున్నవి. అనేక దేశాలలో బహిరంగంగా నియంతృత్వ విధానాలను అమలుచేస్తున్న ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయి. నూతనంగా విముక్తి సాధించిన అనేక దేశాలు సామ్రాజ్యవాదుల సైనిక సంఘటనలలో భాగస్వాములై తమ ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యాన్ని కోల్పోయాయి. వాటిలో కొన్ని అలీన విధానానికి కట్టుబడివున్నామని ప్రకటిస్తూనే, అమెరికాకు లొంగివుండేలా సైనిక ఒప్పందాలు చేసుకుంటున్నాయి. నూతనంగా విముక్తి పొందిన దేశాలలోని ప్రజలు విముక్తి పొందిన తర్వాత కొద్దిపాటి ప్రజాస్వామ్యాన్ని మాత్రమే అనుభవించి, ఆర్థికంగా, సైనికంగా అమెరికన్ సామ్రాజ్యవాదులు మద్దతిస్తున్న సైనిక నిరంకుశత్వం కింద నలిగిపోతున్న దేశాలకు పాకిస్తాన్ ఉదాహరణగా ఉన్నది. పశ్చిమదేశాలలోని ద్రవ్య పెట్టుబడిదారులు ఆ దేశాల ఆర్థికవ్యవస్థలను ప్రభావితం చేయటంతో తమ రాజకీయ స్వాతంత్రంపై రాజీ పడుతున్నారు.

భారతదేశం-పాకిస్తాన్‌ల మధ్య, భారతదేశం-నూతనంగా విముక్తి పొందిన అనేక దేశాల మధ్య గుణాత్మకమైన ఈ వ్యత్యాసానికి కారణమేమిటి? భారతదేశం సామ్రాజ్యవాదుల కూటమిలో చేరటానికి తిరస్కరిస్తూ స్వతంత్రమైన విదేశాంగ విధానాన్ని ఎలా కొనసాగించగలుగుతున్నది? కొన్ని ఎగుడుదిగుడులున్నప్పటికీ భారతదేశం, దాని పాలకవర్గాలు అనేక సంవత్సరాల నుండి స్వయం సమృద్ధితో కూడిన స్వతంత్ర ఆర్థిక విధానాలను ఏ విధంగా కొనసాగిస్తున్నాయి?

భారతదేశం, పాకిస్తాన్‌లలోని పాలకవర్గాల మధ్య ఉన్న వ్యత్యాసం, భారత బూర్జువా వర్గ ఆర్థికశక్తి, బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా శతాబ్దకాలానికి పైగా జరిగిన పోరాటంలో ప్రజలలో బలంగా నాటుకుపోయిన సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ సాంప్రదాయాలు ఇందుకు కారణం. విముక్తికి ముందే వలసదేశాలలో భారతదేశం అభివృద్ధి చెందినదిగా ఉన్నది. విదేశీ వలస పాలకులు అనేక విధాలైన ఆంక్షలు విధిస్తున్నప్పటికీ భారత బూర్జువావర్గం అభివృద్ధి చెందింది.

రెండవ ప్రపంచయుద్ధ సమయంలో ప్రకటించిన టాటా-బిర్లా ప్రణాళిక బూర్జువావర్గ బలాన్ని, దాని ఆకాంక్షలను వ్యక్తం చేసింది. రెండవ ప్రపంచయుద్ధ సమయంలో తన చేతిలో ఉన్న వనరులను పెంచుకున్నది. రాజ్యాధికారం తన చేతిలోకి వచ్చే అవకాశాలు దగ్గరవటంతో తమకు ఇబ్బందికరంగా ఉంటున్న విదేశీ పోటీదారులు లేని స్వతంత్ర ఆర్థికవ్యవస్థకు తామే యజమానులం అవుతామని బడా పెట్టుబడిదారులు భావించారు. పార్టీ కార్యక్రమం ఈ విధంగా చెప్పింది. ' భారత పెట్టుబడిదారులు స్వాతంత్రానికి ముందు కూడా కొంతమేరకు బలపడ్డారు. నూలు బట్టలు, పంచదార, సిమెంటు లాంటి పారిశ్రామిక రంగాలలో బలంగా పాతుకుపోయి ఉన్నారు. రెండవ ప్రపంచయుద్ధ సమయంలో బడా పెట్టుబడిదారులు విపరీతంగా సంపదలను పోగుచేసుకుని, తమ ఆర్థికస్థానాన్ని మరింత బలపరుచుకున్నారు'.

జాతీయ బూర్జువావర్గ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తూ రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకున్న కాంగ్రెస్ నాయకులు కూడా అత్యధికంగా ప్రజాభిమానం పొందినవారు. స్వాతంత్ర్యం కోసం దశాబ్దాలుగా జరిగిన ప్రజా ఉద్యమాలకు వారు నాయకత్వం వహించారు. కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ నాయకులు ప్రజలపై అత్యంత బలమైన పలుకుబడి కలిగివున్నారు. నూతన ప్రభుత్వానికి నాయకత్వం వహించిన వారు రాజ్యాధికారంతో పాటు ప్రజలలో బలమైన పటుకుబడి కలిగివున్నారు. సాంప్రదాయకంగా ఉన్న సామ్రాజ్యవాద వ్యతిరేక, జాతీయవాద భావాలు పెట్టుబడిదారులు, వారి ప్రభుత్వం సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయటానికి, వారితో బేరసారాలు చేయటానికి అవసరమైన శక్తిని ఇచ్చాయి.

ఈ విధమైన సానుకూల అంశాల కలయిక భారతదేశం, మిగతా అనేకదేశాలు, ప్రభుత్వాలకు మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసానికి కారణం. ఆ దేశాలలో బలమైన పెట్టుబడిదారులు గాని, బలమైన సామ్రాజ్యవాద వ్యతిరేకతగాని లేవు. పెట్టుబడిదారులు అభివృద్ధి చెందకపోవటం, ఆధునిక బూర్జువావర్గ ప్రయోజనాలను కాపాడే విధానాలను అనుసరించకుండా మతపరమైన విజ్ఞప్తులు చేయటం, గిరిజనుల ప్రయోజనాలను ముందుకు తీసుకురావటం, అస్పష్టమైన జాతీయ భావనలు పెంచటం, సామ్రాజ్యవాద వ్యతిరేక భావాలు, పాలకులపై పెరిగిన ఆగ్రహంతో ఇతర దేశాలలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఆర్థికవ్యవస్థ నుండి మద్దతు పొందటం, ప్రజలను తమ వెనుక సమీకరించుకోవటం చేయలేకపోయాయి. ప్రజాస్వామ్యాన్ని, వాక్‌స్వాతంత్ర్యాన్ని, ప్రజా ప్రాతినిధ్య సంస్థలను ఏర్పాటు చేయటానికి వారు సాహసించలేకపోయారు. అటువంటి వాటిని అమలులోకి

తీసుకువచ్చిన చోటకూడా వాటిని హడావిడిగా రద్దుచేశారు. బూర్జువా ప్రజాస్వామ్యానికి గీటురాయిగా భావించే ప్రతిపక్ష పార్టీల ఉనికిని కూడా సహించలేకపోయారు. కాబట్టి భారతదేశంలో ఈ కాలమంతా బూర్జువాలకు, సామ్రాజ్యవాదానికి మధ్య వైరుధ్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రజాబలం, రాజ్యాధికారం తమచేతుల్లో ఉన్న బూర్జువాలకు సామ్రాజ్యవాదుల షరతులపై వారితో రాజీ పడటానికి, లొంగిపోవటానికి తగిన కారణం కనిపించలేదు. స్వతంత్రంగా ఆర్థికాభివృద్ధిని సాధించటం, తన చేతిలో ఉన్న అంతర్గత మార్కెట్ నుండి లాభాలు సంపాదించటం, దేశంలోకి ప్రవేశించి ఆర్థికవ్యవస్థను తమ అదుపులోకి తీసుకోవాలని పదేపదే ప్రయత్నం చేస్తున్న సామ్రాజ్యవాదులతో తరచుగా ఘర్షణ పడటం వారి లక్ష్యాలుగా ఉన్నాయి. సామ్రాజ్యవాదులు అనేక సందర్భాలలో భారత పాలకవర్గాలను తక్కువగా అంచనా వేశారు.

భారత పాలకవర్గాలు కొన్ని సందర్భాలలో ఈ పోరాటంలో వెనక్కుతగ్గి, సామ్రాజ్యవాదులతో రాజీపడుతూ ఒప్పందాలు చేసుకున్నాయి. ఫలితంగా ఆర్థికవ్యవస్థ పశ్చిమదేశాలపై ఆధారపడటం పెరిగిపోతున్నది. ఈ విధంగా దాగుడుమూతల పోరాటం కొనసాగుతున్నది. భారతదేశ బూర్జువావర్గం ఈ ఘర్షణలలో తన ప్రయోజనాలను కాపాడుకోవటానికి, మరింత ముందుకు తీసుకుపోవటానికి, స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవటానికి, సామ్రాజ్యవాదులతో గట్టిగా బేరసారాలు చేయటానికి సోషలిస్టు శిబిరాన్ని, సోషలిస్టు దేశాలను వినియోగించుకుంటున్నది. భారతదేశంలోని కార్మికవర్గం నూతన యుగంలోని అవకాశాలన్నింటినీ శక్తివంతంగా వినియోగించుకోలేకపోయినప్పటికీ, బూర్జువావర్గం తన స్వప్రయోజనాలను కాపాడుకోవటం కోసం వాటిని బాగా వినియోగించుకున్నది. ఆర్థికవ్యవస్థను తన అవసరాలకు అనుగుణంగా నడపటానికి అవసరమైన కనీసశక్తిని అప్పటికే సాధించటం, విస్తారమైన ప్రజా మద్దతు వలన ఇది సాధ్యమైంది. తన వర్గ ప్రయోజనాలకు అనుగుణంగా సామ్రాజ్యవాదులతో అపుడపుడు రాజీపడటం, మౌనంగా ఉండటం జరుగుతున్నప్పటికీ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలబడటం వలన ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాస్వామిక భావాలతో మిళితమైంది.

ఉభయుల ప్రయోజనాల మధ్య ఘర్షణ వచ్చినపుడు తన లాభం కోసం ముందుకుపోవటం, రాజీపడటం లేక తిరోగమించటం నూతన రాజ్యం అనుసరిస్తున్న విదేశాంగ విధానంలో కూడా స్పష్టమైంది. దాని విధానంలో అనేక ఎగుడుదిగుడులు ఉన్నప్పటికీ మొత్తంగా చూసినపుడు అలీనోద్యమంలో భాగంగానే ఉన్నది. అందువలన భారతదేశం ఏ సామ్రాజ్యవాద దేశంతోనూ సైనిక మైత్రి నెరపలేదు. మరోవైపున పాకిస్తాన్‌ను సైనికీకరణ చేయటంతో తీవ్రమైన విబేధాలు సోవియట్ యూనియన్‌తో స్నేహ, సహకార ఒప్పందానికి దారితీశాయి.

ఈ కాలంలో సోవియట్ యూనియన్, సోషలిస్టు దేశాలతో భారతదేశ సంబంధాలు బలపడుతూ వచ్చాయి. 1962లో జరిగిన భారత్–చైనా ఘర్షణ సందర్భం ఒకటే ఇందుకు మినహాయింపు. మిగతా కాలమంతా ఈ సంబంధాలు మరింత స్నేహపూరితంగా ఉన్నాయి. భారతదేశం ఆర్థికంగా స్వయం సమృద్ధిని సాధించటం, స్వతంత్రంగా వ్యవహరించటం కోసం చేస్తున్న పోరాటానికి సోవియట్ యూనియన్, ఇతర సోషలిస్టు దేశాల నుండి విలువైన సహాయం అందింది. సోవియట్ సహకారంతోనే స్వతంత్ర పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన వ్యూహాత్మక పరిశ్రమలు ప్రభుత్వరంగంలో ఏర్పాటైనాయి. ఉక్కు, ఆయిలు, యంత్ర పరిశ్రమలు అన్నీ దాదాపు సోవియట్ సహకారంతోనే ఏర్పాటు అయ్యాయి. భారత– సోవియట్ స్నేహ, సహకార ఒప్పందం దేశ రక్షణను బలపరచటంతో పాటు భారత ఉపఖండంలో శాంతియుత పరిస్థితులు కొనసాగటానికి దోహదం చేసింది. పాలకవర్గాల ప్రయోజనాలు, ఆకాంక్షల వలన ఈ కాలంలో కొన్ని ఊగిసలాటలు, ఒడుదుడుకులు కూడా చోటు చేసుకున్నాయి.

విదేశాంగ విధానంపై నిరంతరం ఒత్తిడులు ఉంటున్నాయని, నూతన విధానాలకు ద్వారాలు తెరిచే చర్యలు ఈ విధానాలు నీరుగారటానికి దారితీయవచ్చునని గత రెండు సంవత్సరాలలో జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. రాజీవ్‌గాంధి ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టటం, బహుళజాతి సంస్థలు భారతదేశంలోకి ప్రవేశించటానికి అవకాశాలు కల్పించటం, రక్షణ పరికరాలు, తేలికపాటి యుద్ధ విమానాల కోసం అమెరికాతో చర్చలు జరపటం, ప్రభుత్వ, ప్రైవేటురంగ సంస్థలు, ప్రభుత్వశాఖలలోని ఉన్నతాధికారులకు అమెరికాలో శిక్షణ ఇప్పించాలని ప్రతిపాదించటం సోషలిస్టు దేశాలతో స్నేహ, సహకారం, అలీన విధానం నీరుగారిపోవటానికి దారితీస్తాయి. రాజీవ్‌గాంధి ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వలన అలీన విధానం నిరంతరాయంగా కొనసాగుతుందని భావించరాదని, విదేశాంగ విధానానికి సంబంధించిన ఊగిసలాటలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలకత్తాలో జరిగిన సిపిఐ(ఎం) మహాసభ హెచ్చరించింది.

**బూర్జువా ప్రజాస్వామిక రాజ్యాంగం**

వలసపాలన నుండి విముక్తి పొందిన దేశంలోని పూర్తిగా అభివృద్ధి చెందని పెట్టుబడిదారులు ప్రాథమిక హక్కులు, వయోజన ఓటింగ్ హక్కు, ప్రజలచే ఎన్నుకోబడిన పార్లమెంటు, పార్లమెంటుకు సర్వాధికృతను కట్టబెట్టటం, వాక్‌స్వాతంత్ర్యం, తమకు నచ్చిన సంస్థలను ఏర్పాటు చేసుకొనే హక్కు, మనస్సాక్షికి అనుగుణంగా వ్యవహరించటం తదితరాలను రాజ్యాంగం ద్వారా ప్రకటించగల ధైర్యం ప్రదర్శించారు. బూర్జువా వర్గం, వారిని బలపరుస్తున్న మేధావులు ఫ్యూడల్ సంబంధాలను అంతం చేయాలని, వారికున్న ప్రత్యేకహక్కులను రద్దుచేయాలని, కనీసం వాటితో పోరాడాలనే ఆలోచన కూడా చేయని పరిస్థితులలో ఈ విధమైన హక్కులివ్వటం మరింత ప్రాధాన్యత కలిగినది. స్వాతంత్ర్య పోరాటం జరుగుతున్న కాలమంతా ఇదే విధానాలను కొనసాగించారు. ఈ సంబంధాలను రద్దుచేయటం తమ అభివృద్ధికి అత్యవసరం అన్నంతగా పెట్టుబడిదారీ సంబంధాలు విస్తరించలేదు. పెట్టుబడిదారి విధానం అభివృద్ధి చెందలేదు. దీనితో పాటు రాజ్యాంగాన్ని రూపొందించిన వారు, రాజ్యాంగసభను ఏర్పరచిన వారు బ్రిటన్ రూపొందించిన రాజ్యాంగం ప్రకారం పరిమితమైన ఓటుహక్కు ప్రాతిపదికపై ఎన్నికయారు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని అధికారం నుండి తొలగించటం కోసం విజయవతంగా పోరాటం చేస్తున్న విప్లవకారులైన ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకున్న రాజ్యాంగసభ కాదది. వాస్తవానికి పోరాటం చేస్తున్న ప్రజలు ఓటుహక్కు లేకుండా ఉండగా, వారికి సంబంధం లేకుండా ఎన్నుకున్న రాజ్యాంగసభ అది. అయినప్పటికీ రాజ్యాంగాన్ని రూపొందించిన వారు చారిత్రకంగా ఫ్యూడలిజంపై విజయం సాధించిన విప్లవ ప్రజలు సాధించుకున్న హక్కులు, ప్రజాస్వామిక సూత్రాలను రాజ్యాంగంలో పొందుపరిచారు. రాజ్యాంగసభలో నిజమైన అధికారం జాతీయోద్యమ విజయానికి ప్రతినిధులుగా ఉన్న కాంగ్రెస్ పార్టి, దాని నాయకుల చేతులలో ఉండటం వలన ఇది జరిగింది. స్వతంత్రమైన పెట్టుబడిదారి విధాన అభివృద్ధిని కాంక్షిస్తూ, స్వాతంత్ర్య పోరాటకాలంలో ప్రచారం చేసిన ప్రజాస్వామిక భావాలతో ఈ నాయకులు ఉత్తేజం పొందారు.

కాబట్టి రాజ్యాంగంలో బలహీనతలు, పొరపాట్లు ఉన్నప్పటికీ, నూతనంగా విముక్తి చెందిన వాటిలో కొద్ది దేశాలలో మాత్రమే

ప్రజాస్వామ్యాన్ని విస్తరింపజేయటంలో దీనికి సరిపోల్చదగినవి ఉన్నాయి. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో ఆవిర్భవించిన ఈ నూతన నాయకత్వం ప్రజలపై తమ అధికారాన్ని బలపరచుకోవటానికి ప్రజాస్వామిక హక్కులు దోహదం చేస్తాయని భావించింది. నూతనంగా విముక్తి పొందిన ప్రజలకు ప్రాథమిక హక్కులు ఇచ్చి, ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకోవాలని ప్రకటించిన రాజ్యాంగం బూర్జువా-భూస్వామ్యవర్గాల కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి మార్గం సుగమం చేసింది. వలస పాలన కాలంలో లేని స్వాతంత్ర్యం, హక్కులు ప్రజలకు లభించినప్పటికీ దాని సారాంశం ఇది. ఆస్తిహక్కును ప్రాథమిక హక్కుగా రాజ్యాంగంలో పొందుపరిచారు. పరిపాలన, రాజ్యం యొక్క రక్షణకు ప్రాథమిక హక్కులు లోబడి ఉండేలా చేశారు. కాలం గడుస్తూ వర్గ వైరుధ్యాలు తీవ్రమౌతున్నకొద్దీ, ప్రజలకిచ్చిన హక్కులను ఉల్లంఘించటం అనివార్యంగా మారింది. అత్యవసర పరిస్థితి కాలంలో రాజ్యాంగాన్ని రద్దుచేయటంతో ఈ క్రమం శిఖరాగ్రానికి చేరింది.

అత్యంత ప్రజాస్వామికమైన పెట్టుబడిదారీ రాజ్యాంగాలు కూడా వర్గ పరిపాలన అవసరాలను తీర్చటం కోసమే రూపొందిస్తారని ఇది స్పష్టం చేస్తున్నది. 1936లో సోవియట్ యూనియన్ ముసాయిదా రాజ్యాంగాన్ని వివరిస్తూ స్టాలిన్ ఈ విధంగా చెప్పాడు, ' సమాజంలో పరస్పర విరుద్ధమైన వర్గాలు, ఆస్తి కలిగిన వర్గాలు, ఆస్తిలేని వర్గాలు ఉంటాయనే పునాది నుండి బూర్జువా రాజ్యాంగాలు ప్రారంభమౌతాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చిందనే దానితో సంబంధం లేకుండా సమాజాన్ని నడిపించే రాజ్యం( నియంతృత్వం) తప్పనిసరిగా బూర్జువావర్గం చేతులలోనే ఉండాలి. ఆస్తి కలిగిన వర్గాలు కోరుతున్నట్లుగా, వారికి ప్రయోజనం కలిగించేదిగా, అటువంటి సామాజిక వ్యవస్థను మరింత బలపరచేదిగా రాజ్యాంగం ఉంటుంది'. (లెనినిజం-సమస్యలు పేజి 5-9)

రాజ్యాంగ నిర్మాతలు అనేక ఆంక్షలు, పరిమితులతోనే ప్రజాస్వామిక హక్కులు, స్వేచ్ఛలను పొందుపర్చారు. అయినప్పటికీ వయోజన ఓటుహక్కు, ఎన్నికలు, ప్రజల ఓట్లతో ఎన్నికైనవారు ప్రభుత్వాలను ఏర్పాటు చేయటం కోట్లాది మంది ప్రజలను ప్రజాస్వామిక పోరాటాలలోకి ఆకర్షించటానికి, వారి చైతన్యం పెరగటానికి దారితీశాయి. ప్రజాస్వామిక హక్కులను వినియోగించుకోవటంపై ఆంక్షలు, పరిమితులు విధించిన రాజ్యాంగ నిర్మాతలు తర్వాతి కాలంలో ప్రజాస్వామ్యం, జాతీయ ఐక్యతకు ప్రమాదకరంగా పరిణమించిన అంశాలకు సంబంధించి కూడా బలహీనంగానే వ్యవహరించారు. మొదటి అంశం, ఇంగ్లీషు అంగీకారయోగ్యంగా ఉన్నప్పటికీ అధికార భాషపై ఏకాభిప్రాయానికి రాలేదు. కాని వాస్తవంలో ఇంగ్లీషు ఏకైక అధికార భాషగా కొనసాగుతున్నది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఈ పరిణామం పట్ల గర్వపడుతుంటారు. ఇది భారతదేశానికి సిగ్గుచేటైనది. జాతీయ ఐక్యతసాధనలో ఉన్న బలహీనతలను, అన్ని భాషల సమానత్వం ప్రాతిపదికగా ఈ బలహీనతలను తొలగించటంలో నూతన పాలకవర్గాల అశక్తతను కూడా ఇది వెల్లడిస్తున్నది. రెండవది, రాజ్యాంగ నిర్మాతలు పౌరులు, మానవజాతిని దాటి, గో రక్షణను కూడా ఆదేశిక సూత్రాలలో చేర్చారు. ఆవుకు రక్షణ కల్పించటం అంటే కాంగ్రెస్ జాతీయ నాయకులలోని అత్యంత ముఖ్యులలో ఉన్న హిందుమత పునరుద్ధరణవాద భావజాలాన్ని ముందుకు తీసుకురావటం మినహా వేరుకాదు. కొంతమేరకు ఇది ఊహించినదే. వలసపాలనలో ఉన్న దేశంలో భూస్వాములతో రాజీపడుతున్న పెట్టుబడిదారులు, వారి ప్రతినిధులు పూర్తి లౌకికవాదులుగా ఉంటారని భావించరాదు. అభివృద్ధి నిరోధక శక్తులతో రాజీ పడటం వలన కాలం గడిచేకొద్దీ భారతప్రజలు పరిష్కరించటం సాధ్యం కాని సమస్యలను ఎదుర్కోవాల్సి

**వర్గపాలనను సుస్థిరం చేసుకోవటం కోసం అభ్యుదయ విధానాలు**

నూతన పాలకులు రాజ్యాంగాన్ని రూపొందించటంతో పాటు దేశ ఐక్యతకు, బ్రిటిష్ పాలకుల పాత మిత్రుల పలుకుబడిని తగ్గించటానికి అవసరమైన చర్యలు కూడా తీసుకున్నారు. స్వాతంత్రం వచ్చిన వెంటనే సంస్థానాధీశుల పాలనలోని ప్రాంతాలను భారతదేశంలో విలీనం చేయటం గొప్ప రాజకీయ ప్రాధాన్యత కలిగిన అంశం. అది జరగకపోయినట్లైతే భారతదేశ నాయకుల శక్తిని పరిమితం చేయటానికి, దేశాన్ని మరింతగా విభజించటానికి అవకాశం ఉండేది. భారతదేశం లేదా పాకిస్తాన్‌లో చేరటమా లేక స్వతంత్రంగా ఉండటమా అన్న అంశాన్ని బ్రిటిష్ పాలకులు ఆయా సంస్థానాల పాలకుల ఇష్టానికే వదిలేశారు. భారతదేశం లేదా పాకిస్తాన్‌లో చేరేలా సంస్థానాల పాలకులను వత్తిడి చేయటానికి వారు తిరస్కరించారు. రెండు దేశాలలో చేరకుండా స్వతంత్రంగా ఉండటానికి బ్రిటిష్ పాలకులు వారికి అవకాశం ఇచ్చారు. అసంఖ్యాకంగా ఉన్న సంస్థానాలు స్వతంత్రంగా ఉండే అవకాశం ఇచ్చినట్లైతే భారతదేశ స్వాతంత్ర్యం హాస్యాస్పదంగా మారేది. భారతదేశ స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా సామ్రాజ్యవాదుల చేతిలో ఆయుధంగా, శాశ్వతమైన పంచమాంగ దళంగా వారు వ్యవహరించేవారు. దేశాన్ని మూడు భాగాలుగా విభజించటంలో బ్రిటిష్ వారి ప్రణాళిక ఇదే. ఆలస్యం చేయటం లేదా సందేహాలతో వ్యవహరించినట్లైతే స్వతంత్ర భారతదేశ సమగ్రతకు శాశ్వతంగా నష్టం జరిగేది. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన జాతీయ నాయకులు ఆలస్యం చేయలేదు. ఒకవైపున కేంద్ర ప్రభుత్వం తటస్థంగా వ్యవహరిస్తామని ప్రకటించినప్పటికీ మరోవైపున ఆయా సంస్థానాల పాలకులు తమ సంస్థానాలను యూనియన్‌లో భాగం చేసే విధంగా నాయకులు ప్రజలను ఆందోళనలకు పురిగొల్పారు. ప్రజల వత్తిడితో సంస్థానాధీశుల వ్యతిరేకత నీరుగారిపోయింది. తమ సంస్థానాలను యూనియన్‌లో భాగం చేసిన తర్వాత సంస్థానాధీశులకు పన్నులు, ప్రీవి పర్సులు, ఆస్తులను అట్టిపెట్టుకోవటంతో పాటు అనేక ఇతర రాయితీలు ఇచ్చారు. వారిలో కొందరిని తమ రాష్ట్రాలకు ప్రముఖ్‌లుగా చేశారు. అయినప్పటికీ వారి రాజకీయాధికారం బద్ధలైంది. తెలంగాణాలో ప్రజా పోరాటం ప్రారంభం కావటం, అది బూర్జువా-భూస్వామ్య వర్గాల పాలనకు ప్రమాదకరంగా మారటంతో హైదరాబాద్‌లో సైనికంగా జోక్యం చేసుకున్నారు. సంస్థానాలను విలీనం చేసుకోవటం, వాటిని దేశంలో భాగంగా మార్చటం గొప్ప ప్రాధాన్యత కలిగినది. ఈ చర్యతో సంస్థానాధీశుల ద్వారా రాజకీయ జోక్యం చేసుకోవచ్చన్న సామ్రాజ్యవాదుల కలలు కల్లలైనాయి.

విస్తారమైన భారతదేశ మార్కెట్‌ను తమ లాభాల కోసం వినియోగించుకోవాలని భావిస్తున్న బూర్జువా పారిశ్రామికవేత్తలకు ఈ చర్య అత్యవసరమైంది. భారతదేశ నాయకులు తమ ఉనికిని, పరిపాలనను కాపాడుకుని, మరింతగా బలపర్చుకోవటం కోసం ఈ ఫ్యూడల్ వ్యతిరేక చర్య తీసుకోవాల్సి వచ్చింది. వర్గశక్తుల బలాబలాలలో వచ్చిన మార్పును కూడా ఇది ప్రతిబింబించింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న సమయంలో ఫ్యూడల్ సంస్థానాధీశులను ఎదుర్కోవటానికి కాంగ్రెస్ నాయకులు తిరస్కరించారు. సంస్థానాధీశులకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా పోరాటాలను నిరుత్సాహపరిచారు. బ్రిటిష్ వారి ప్రత్యక్షపాలనలో ఉన్న భారతదేశాన్ని బ్రిటిష్ ఇండియాగా పిలుస్తూ, తరచుగా వారు సంస్థానాధీశుల పాలనలో ఉన్న ప్రాంతాలను భారతదేశంలో భారతదేశంగా అభివర్ణించేవారు.

రెండవది చట్టం చేయటం, నష్టపరిహారం చెల్లించటం ద్వారా చట్టబద్ధమైన భూస్వామ్య విధానాన్ని రద్దుచేయటానికి తీసుకున్న చర్యలు ముఖ్యమైనవి, అభ్యుదయకరమైనవి. పాత భూస్వాముల చేతిలో ఎక్కువ భూములు ఉండటానికి అవకాశం కల్పించినప్పటికీ, వారికి నష్ట పరిహారం

చెల్లించినప్పటికీ, వారి రాజకీయాధికారం కుదించబడింది. పెద్ద ఫ్యూడల్ భూస్వాములు తమ అధికారాన్ని కోల్పోయారు. వారి భూములు కౌలుకు చేసినవారు ఓటర్లయారు. విప్లకరమైన మార్గంలో కాకపోయినప్పటికీ వారి భూములను పంచారు.

ప్రాథమిక హక్కుల కింద రాజ్యాంగంలో ఆస్థికి కల్పించిన రక్షణ తమ అభివృద్ధికి అవసరమైన పరిమిత భూ సంస్కరణలు అమలు చేయటానికి, రైతులకు రక్షణ కల్పించటానికి ఆటంకంగా పరిణమిస్తుందని బూర్జువావర్గం త్వరలోనే గమనించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదించిన అనేక భూసంస్కరణల చట్టాలను కోర్టులలో సవాలు చేశారు. వాటి పరిస్థితి అనిశ్చితంగా ఉంది. ఈ చట్టాలలో కోర్టుల జోక్యాన్ని నివారించటం కోసం వాటిని రాజ్యాంగంలోని 31(బి)లో భాగంగా 9వ షెడ్యూల్‌లో చేర్చారు. ఆస్థిపై వారికి ఉన్న హక్కులు పెట్టుబడిదారుల ప్రయోజనాలకు లోబడి ఉంటాయని బూర్జువా ప్రభుత్వం ఫ్యూడల్ భూస్వాములకు అర్థమయేలా చేసింది. పెద్దన్నకు మాత్రమే ఆస్తిపై అన్ని హక్కులు ఉంటాయని స్పష్టం చేశారు. ఫ్యూడల్ భూస్వాములను లొంగదీసుకోవటానికి, వారి పరిధిని కుదించటానికి, పెట్టుబడిదారి విధాన అభివృద్ధికి వారు లోబడివుండేలా చేయటానికి బూర్జువా నాయకత్వం చేసిన చివరి ముఖ్యమైన దాడి ఇది.

**కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం**

బూర్జువావర్గ జాతీయ నాయకత్వం తమ ప్రయోజనాలను కాపాడుకోవటం కోసం ఫ్యూడల్ భూస్వాములకు వ్యతిరే కంగా వ్యవహరిస్తూనే ప్రత్యేకంగా కమ్యూనిస్టులు, విప్లవకర కార్మికవర్గ ఉద్యమానికి వ్యతిరేకంగా జాగ్రత్తలు తీసుకున్నారు. కాంగ్రెస్ జాతీయ నాయకుల ప్రోద్బలంతో కొత్త కార్మికసంఘాన్ని ఏర్పాటు చేయటం కోసం ఎఐటియుసిలో ఉన్న కాంగ్రెస్ కార్మికవర్గ విభాగం చీలిపోయి, 1947లో ఐఎన్‌టియుసిని ఏర్పాటు చేసింది. ఎఐటియుసి లోపలా, బయటా ఉన్న కాంగ్రెస్ కార్మిక విభాగ కార్యకర్తలకు కొత్తసంఘాన్ని ఏర్పాటు చేయటం కోసం ఐక్యం కావాలని విజ్ఞప్తి చేసి సర్దార్ పటేల్ ఈ చీలిక తీసుకొచ్చాడు. కమ్యూనిస్టులతో పోరాటం చేయటం, కార్మికవర్గంలో తమ పలుకుబడిని విస్తరింపజేసుకోవటం కోసం కాంగ్రెస్ బూర్జువా నాయకత్వానికి ప్రత్యేకమైన సంఘం అవసరమైంది. కార్మికోద్యమాన్ని చీల్చటం బూర్జువావర్గానికి రాజకీయంగా అవసరం అయింది. ఐఎన్‌టియుసి ప్రారంభసభలో కాంగ్రెస్ నాయకులు చేసిన ప్రసంగాలలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. కమ్యూనిస్టుల పలుకుబడిని తగ్గించటం కోసం వర్గసంకర విధానాలను అనుసరించాలని చీలికను ప్రోత్సహించిన వారు చెప్పారు.

ఐఎన్‌టియుసి ప్రారంభసభలో కృపలాని తమ మధ్య ఉన్న విబేధాలను స్పష్టం చేశాడు. 'ఎఐటియుసి, కొత్త సంఘానికి మధ్య పూడ్చలేనంత గండి ఉన్నది. కార్మికుల నిజమైన ప్రయోజనాలను పరిరక్షించటానికి అవసరమనుకుంటే సమ్మె ఆయుధాన్ని ప్రయోగించటానికి నూతనసంఘం సందేహించదు. కాని పూర్తిగా ఆలోచించిన తర్వాత, అత్యంత జాగ్రత్తతో ఈ ఆయుధాన్ని ఉపయోగించాలి. కొందరి రాజకీయ ప్రయోజనాలను సాధించటం కోసమే ఉపయోగించటం అంటే దీనిని దుర్వినియోగం చేయటం అవుతుంది..' సమ్మెలకు, విప్లవకర కార్మికవర్గానికి వ్యతిరేకంగా వినియోగించే బాగా పరిచయమైన భాష ఇది.

గుల్జారీలాల్ నందా ఈ విషయాన్ని మరింత స్పష్టంగా చెప్పాడు,' కమ్యూనిస్టుల నాయకత్వంలో ఉన్న ఎఐటియుసి నాయకత్వం అనుసరిస్తున్న విధానాలు మన లక్ష్యాలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. వారి విధానాలు సమాజ సంక్షేమం, భద్రతకు ప్రమాదం కలిగిస్తున్నాయి. కార్మికుల ప్రయోజనాలకు కూడా వ్యతిరేకంగా ఉన్నాయి. కాబట్టి మౌలికంగా కమ్యూనిస్టులకు, కార్మికోద్యమానికి వ్యతిరేకంగా ఉండి, అసంఘటితంగా ఉన్న శక్తులను సంఘటితం చేయటం మన ఉద్యమ అత్యవసర కర్తవ్యంగా ఉన్నది'.

సర్దార్‌పటేల్ అధ్యక్షోపన్యాసంలో ఈ విధంగా చెప్పాడు.' కమ్యూనిస్టు నాయకులు ప్రభుత్వం పట్ల ఉన్న గుడ్డి వ్యతిరేకతతో జాతీయ సంక్షేమానికి సంబంధించిన విషయాలను గాలికొదిలేస్తున్నారు. వారు నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తూ సమ్మెలకు సంబంధించిన అంశాలను అర్థం చేసుకోవటంలో విఫలం అవుతున్నారు. ఏ సాకు దొరికినా సమ్మెలకు వెళుతూ కార్మికుల సంక్షేమం, ప్రయోజనాలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. అరాచకత్వం, విచారం మినహా ఈ సమ్మెలతో సాధిస్తున్నది ఏమీలేదు'.

ఫ్యూడల్ ప్రభువులు, చట్టబద్ధమైన భూస్వాములను దారికి తెచ్చుకోవటానికి ముందుగానే కమ్యూనిస్టులు, విపప్లకర కార్మికవర్గానికి వ్యతిరేకంగా దాడులు, నిందలను ప్రారంభించారన్నది గమనించాల్సిన అంశం. కార్మికవర్గ ఉద్యమాలకు ఆటంకం కలిగించటానికి ప్రాధాన్యత ఇవ్వటంలో బూర్జువావర్గం కాలాన్ని వృధా చేయలేదు. కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేయటం, తర్వాత దానిని తన రాజకీయ పలుకుబడిలోకి తెచ్చుకోవటం వారి మొదటి లక్ష్యం. దాని కొనసాగింపుగా భారత కమ్యూనిస్టు పార్టీని చట్ట విరుద్ధమైనదిగా ప్రకటించి, కమ్యూనిస్టులపై తీవ్రమైన నిర్బంధాన్ని అమలుచేశారు. మూకుమ్మడి అరెస్టులు, ప్రజాసంఘాలు, కార్మికసంఘాలను దాదాపుగా నిషేధించారు. తెలంగాణా రైతులు భూమికోసం చేస్తున్న పోరాటాన్ని అణచివేయటం కోసం కనీవినీ ఎరుగని నిర్బంధాన్ని ప్రయోగించారు. రాజ్యాంగంలో భారతదేశ ప్రజలకు ప్రాథమిక హక్కులు కల్పించటం కోసం నూతన నాయకత్వం తీవ్రంగా ప్రయత్నం చేస్తున్న సమయంలోనే వీటన్నింటినీ చేశారు. వర్గ పోరాటం, కార్మికవర్గం పట్ల భయం నూతన రాజ్యాంగాన్ని ప్రకటించే వరకు కూడా నిలువనీయలేదు. తెలంగాణా మహిళల అవమానాలు, ఆగ్రహం, తెలంగాణా రైతుల రక్తపు మరకలు రాజ్యాంగంపై పడ్డాయి.

కమ్యూనిస్టు ఉద్యమాన్ని అణచివేస్తూనే కార్మికవర్గంపై తమ పలుకుబడిని విస్తరింపజేసుకోవటానికి, అనేక రాయితీలు ఇవ్వటం ద్వారా దానిని తమవైపుకు తెచ్చుకోవటానికి ప్రయత్నం చేశారు. సరుకులు కావాలన్న కోరికలను తీర్చటం కోసం నూతన పరిశ్రమలను స్థాపించటం, విస్తారంగా ఉన్న దేశీయ మార్కెట్‌ను తమ స్వాధీనంలోకి తెచ్చుకుంటున్న సమయం అది. ఇపుడు భారతదేశం, దాని ప్రభుత్వం చేతుల్లో ద్రవ్య, ఆర్థిక అధికారాలు ఉన్నాయి. పరిశ్రమలకు సంబంధించినంత వరకు సమ్మెలను ప్రతిపాదించటానికి ఇది తగిన సమయం కాదు. అదే సమయంలో మారుతున్న పరిస్థితులను గమనించటం, తాము ప్రతిపాదించిన సంస్కరణలలో కొన్నింటినైనా పాక్షికంగా పూర్తిచేయటం కోసం వలస పాలన కాలంలో ఎరుగని విధంగా కార్మికవర్గానికి వెసులుబాటు కల్పించే కొన్ని కార్మిక చట్టాలను తీసుకొచ్చారు. ఎనిమిది గంటల పనిదినం, సంవత్సరంలో మూడు వారాలు పూర్తి వేతనంతో సెలవులు, ప్రావిడెంట్ ఫండ్, ఇఎస్ఐ తదితరాలు కార్మికులు, ఉద్యోగులకు వెసులుబాటు కలిగించటంతో పాటు నూతన పాలకులకు అనుకూలంగా లోతైన ప్రభావం కలిగించాయి. అదే విధంగా నూతన పరిశ్రమలలో ఎక్కువ వేతనాలను ఇవ్వటంతో పాటు ధరల పెరుగుదల ప్రభావాన్ని పరిహరించటం కోసం కాంపెన్సెటరీ అలవెన్సు విధానాన్ని విస్తరింపజేయటం కూడా తాత్కాలికంగా పెట్టుబడిదారులకు అనుకూల పరిస్థితులను కల్పించటంతో పాటు పారిశ్రామికవేత్తలు దేశీయమార్కెట్‌ను స్వాధీనం చేసుకోవటంలో తీరిక లేకుండా ఉన్న సమయంలో సమ్మెలకు ఉన్న అవకాశాలను కుదించింది.

**(తరువాయి ఏప్రిల్ సంచికలో)**

**(అనువాదం: ఏ కోటిరెడ్డి)**

# పార్టీపై దాడులు

(మిగతా 2వ పేజీ తరువాయి)

నివేదికపై తీర్మానం ఆమోదించబడింది. ఇందులో సి పి ఎస్ యు నివేదికలోని తప్పుడు అభిప్రాయాలను ఎటువంటి విమర్శా లేకుండా ఆమోదించటంతో పాటు ప్రశంసించారు. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మిస్తున్నదని, అది ఈ తరం చూసేందుకు వీలుగా త్వరలోనే పూర్తి కాబోతున్నది అనేది అందులో ప్రధానమైనది. సామ్రాజ్యవాద శక్తుల బలాన్ని తక్కువగా అంచనా వేశారు. దేశాలు శాంతియుత సహజీవనం చేయవచ్చని, శాంతియుతంగా సోషలిజాన్ని సాధించవచ్చుననే సిద్ధాంతానికి ఈ నిర్ణయాలు బలం చేకూర్చాయి. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులపై అంచనాలు, కమ్యూనిస్టు పార్టీల పాత్ర, జోక్యం మొదలైన అంశాలలో అప్పటికే తీవ్రంగా ఉన్న అంతర్గత విభేదాలు మరింత పెరగడానికి ఇవి దోహదం చేశాయి.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ఏర్పడిన విభేదాలు, ముఖ్యంగా అల్బేనియన్ పార్టీ అఫ్ లేబర్ కి, సి పి ఎస్ యు కి మధ్య, సి పి సి కి, సి పి ఎస్ యు కి మధ్య ఉన్న విభేదాల ప్రభావం పార్టీ అంతర్గత చర్చలపై పడింది. 1960లలో మాస్కోలో 81 దేశాల కమ్యూనిస్టు పార్టీల సమావేశం ఏర్పాటు చేసినట్టే, సి పి ఎస్ యు మళ్ళీ ప్రపంచంలోని అన్ని కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని పార్టీ ఒక తీర్మానం ఆమోదించింది.

ఈ నేపథ్యంలో అప్పటివరకు నివురుగప్పిన నిప్పులా ఉన్న భారత్, చైనా దేశాల మధ్య సరిహద్దు వివాదం1962 అక్టోబర్‌లో ఒక్కసారిగా భగ్గుమంది. కాంగ్రెస్ ప్రభుత్వం భారతదేశ రక్షణచట్టం కింద అత్యవసర పరిస్థితి ప్రకటించి, ఏ విధమైన విచారణ లేకుండా ప్రజలను అదుపులోకి తీసుకోవడం మొదలు పెట్టింది. పార్టీ నాయకత్వంలో ఒక భాగాన్ని– వర్గ సామరస్య విధానాన్ని వ్యతిరేకిస్తున్న, రెండు పొరుగు దేశాల మధ్య వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచిస్తున్న వారిని– అదుపులోకి తీసుకోడానికి ప్రభుత్వం ఈ అసాధారణ పరిస్థితులను ఉపయోగించుకుంది. ముజఫర్ అహ్మద్ ,ఏ కె గోపాలన్, బి టి రణదివే, పి సుందరయ్య, జ్యోతిబసు, ప్రమోద్‌దాస్ గుప్త, హరికిషన్ సింగ్ సూర్జిత్, ఎం. బసవపున్నయ్య, హరేకృష్ణ కోనార్ తదితర ప్రఖ్యాత నాయకులను అదుపులోకి తీసుకుని చాలా రోజులు జైలులో నిర్బంధించారు. పార్టీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు 50 మందితో సహా 800 మంది కమ్యూనిస్టు నాయకులు, 40 మంది వివిధ రాష్ట్రాల శాసనసభ్యులు, కార్మికసంఘాలు, ఇతర ప్రజాతంత్ర ఉద్యమ నాయకులను ఈ కిరాతకమైన నిబంధనల కింద అదుపులోకి తీసుకున్నారు.

కార్మిక సంఘాలు, రైతుసంఘాల పనిని స్తంభింప చేయడానికి, కార్మికులను, ఉద్యోగస్తులను బెదిరించటానికి, వారిని బలిపశువులను చేయడానికి, వారిపై దమనకాండకు ప్రభుత్వం ఈ అసాధారణ అధికారాలను వాడుకుంది. చాలా ప్రాంతాలలో కమ్యూనిస్టు పార్టీ కార్యాలయాలపై కాంగ్రెస్ పార్టీ దాడి చేసింది. పత్రాలను, ఇతర సామాగ్రిని తగులపెట్టింది. పార్టీ నాయకుల ఇళ్లపై దాడి చేసి, వారిని భయభ్రాంతులకు గురిచేసింది.

విప్లవ విభాగంపై జరిగిన ఈ దాడులను తమ వర్గ సంకర విధానాలను మరింత ముందుకు తీసుకొని పోడానికి ఒక అవకాశంగా డాంగే నాయకత్వంలోని రివిజనిస్టులు భావించారు. అన్ని రకాల, అన్ని తరగతుల మితవాదుల సహాయ సహకారాలను తీసుకుంటూ, అవాకులు చవాకులతో అభాండాలు వేస్తూ, దురభిమానాలను రెచ్చగొడుతూ ప్రచారం సాగించారు. పార్టీ, కార్మిక సంఘాల నాయకులపై 'దేశ ద్రోహులు', 'చైనా అనుకూలురు' అన్న ముద్ర వేయడాన్ని వ్యతిరేకించటానికి కమ్యూనిస్టు పార్టీ నిరాకరించింది. ఏ ఐ టి యు సి సమావేశంలో నాయకుల అరెస్టులను ఖండిస్తూ తీర్మానం ఆమోదించకుండా చేయడానికి డాంగే తన శక్తికొలది ప్రయత్నం చేశాడు. తమకు మితవాదుల నుండి మాత్రమే కాక డాంగే వంటి కమ్యూనిస్టుల నుండి కూడా మద్దతు దొరకడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి మరింత ధైర్యం వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేతను అన్ని సోదర కమ్యూనిస్టు పార్టీలు, కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి కాని డాంగే గ్రూపు మాత్రం ఎటువంటి నిరసన తెలియచేయలేదు.

డాంగే నాయకత్వంలోని రివిజనిస్టు గ్రూపు వేర్వేరు రాష్ట్రాలలోని పార్టీని తమ ఆధీనంలోకి తెచ్చుకోవటానికి ఈ కాలాన్ని ఉపయోగించుకుంది. వారు పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కౌన్సిల్‌ని రద్దు చేసి, దాని స్థానంలో ప్రాంతీయ నిర్మాణ కమిటీని ఏర్పాటు చేశారు. పంజాబ్‌లో ప్రత్యేక మహాసభ జరిపి కొత్త కమిటీని ఎన్నుకున్నారు. పార్టీ నాయకత్వ స్థానాలలో ఉండి, వర్గ సామరస్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్న వారినందరినీ ఈ విధంగా తరిమేయాలనుకున్నారు.

రివిజనిస్టుల నాయకత్వంలోని కమ్యూనిస్టు పార్టీ సరిహద్దు ఘర్షణలు ముగిసిన తరువాత అత్యవసర పరిస్థితిని ఎత్తివేయాలని డిమాండ్ చేయలేకపోయింది. పైగా అత్యవసర పరిస్థితిని కొనసాగించాలని డాంగే కోరుకున్నాడు! "ప్రతిపక్షాలతో చర్చించి అత్యవసర పరిస్థితిని కొనసాగించవలసిన ఆవశ్యకతను సమీక్షించమని" మాత్రమే అడగడానికి సిద్ధపడ్డాడు.

పార్టీ పై, ముఖ్యంగా వర్గ పోరాట పంథాకి కట్టుబడి ఉన్నవారిపై దాడులకు గుర్తుగా 1962–1963 మధ్యకాలం నిలుస్తుంది. 1954 నుండి పార్టీలో నిరంతరంగా కొనసాగుతున్న విభేదాలు మరింత పెరిగాయి. ఇక ఏ మాత్రం కలిసి ఉండే పరిస్థితి లేకుండా చేశాయి. పార్టీ నాయకత్వ స్థానంలో ఉన్నవారికే పరిమితమైన ఈ విభేదాలు క్రమ క్రమంగా కింది స్థాయికి కూడా చేరుకున్నాయి.

(అనువాదం: కె ఉషారాణి)


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!


'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume: 16, issue : 10 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Ra. 10/- Total Pages : 36

................

# పట్టణీకరణలో 161వ స్థానంలో భారత్

**ప**ట్టిణీకరణకూ, దేశాభివృద్ధికీ మధ్య దగ్గరి సంబంధం ఉందని అనేక అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఆర్థికాభివృద్ధి వల్ల పరిశ్రమలు పెరుగుతాయి. పరిశ్రమలు పెరిగితే పట్టణీకరణ పెరుగుతుంది. అదే విధంగా పట్టణీకరణ కూడాఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. ఆరీత్యా చూసినప్పుడు పట్టణీకరణలో భారత దేశం ప్రపంచ దేశాల్లో బాగా వెనుకబడి ఉంది. దేశ విముక్తినాటికి పట్టణీకరణలో మనకన్నా వెనుకబడి ఉన్న చైనా ఈ కాలంలో పెద్ద అంగల్లో పురోగమించింది.

2020వ సంవత్సరం లెక్కల ప్రకారం ప్రపంచంలోని 194 దేశాల్లో పట్టణీకరణ శాతాలు లెక్కవేయగా 34.9 శాతం పట్టణీకరణతో భారత దేశం 161వ స్థానంలో ఉంది. చిన్న చిన్న దేశాలైన కువైట్, నౌరు, మొనాకో నగర రాజ్యాలైన సింగపూర్, హాంగ్‌కాంగ్, వాటికన్ సిటీ, మకావో వంటివి 100 శాతం పట్టణీకరణ సాధించాయి. ఇక  దేశాలుగా చెప్పుకోవాలంటే క్వతర్, బెల్జియం, ఉరుగ్వే, ఇజ్రాయిల్, నెదర్లాండ్స్, అర్జెంటీనా, జపాన్ తదితరాలు 90 శాతం పైన పట్టణీకరణ సాధించాయి. బ్రిటన్ 83 శాతం, అమెరికా 82 శాతం పట్టణీకరణ సాధించాయి. అత్యధిక యూరప్ దేశాలు 60 శాతం పైన పట్టణీకరణ సాధించాయి. వాటితో పోలిస్తే ఇటీవలి వరకు బాగా వెనుకబడి ఉన్న చైనా నేడు 61.4 శాతం పట్టణీ కరణ చెందింది. చైనాతోపాటు ఇతర సోషలిస్టు దేశాలు క్యూబా 77.2, ఉత్తర కొరియా  62.4 శాతాలు మంచి అభివృద్ధి సాధించగా మరో సోషలిస్టు దేశమైన వియత్నాం (37.3) మన దేశం కన్నా ముందున్నప్పటికీ  50 శాతం పట్టణీకరణ సాధించలేదు.

దక్షిణాసియాలో మాల్దీవులు (40.2 శాతం) బంగ్లాదేశ్ (38.2 శాతం), పాకిస్తాన్ (37.2 శాతం) పట్టణీకరణలో మన దేశం కన్నా ముందున్నాయి. మ్యాన్మార్ (31.1), నేపాల్ 20.6), శ్రీలంక (18.7) మన కన్నా వెనుకబడి ఉన్నాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు ......................................................
వీధి..........................................................................
గ్రామం ......................................................................
మండలం లేదా పట్టణం ...........................................
జిల్లా...........................................................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd.  D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977.
Editor : S. Venkatarao,